


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



పాకిస్థాన్‌పై భారత్
**ఘనవిజయం**
12

సంపుటి 08, సంచిక: 87 | సోమవారం | 24-02-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## రాష్ట్రంలో త్వరలో కొత్తరకం మద్యం

- నూతన బ్రాండ్‌లకు అనుమతినిచ్చిన ఎక్సైజ్ శాఖ
- దేశీయ, విదేశీయ లిక్కర్, బీర్ కంపెనీల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఆరోపణలు లేవని నిర్ధారణ సర్టిఫికెట్ జతపరచాల్సిందే

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో త్వరలో కొత్త రకం మద్యం బ్రాండ్స్ రానున్నాయి. ఈ మేరకు మందుబాబులకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్ తెలిపింది. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిజిబిసిఎల్) కొత్త లిక్కర్ బ్రాండ్స్‌ను ఆహ్వానించడానికి అవసరమైన చర్యలు చేపట్టింది. ఇప్పటికే రాష్ట్రంలో ఆరు బీరు కంపెనీలకు చెందిన సుమారు 58 రకాల బీరు బ్రాండ్లు, తొమ్మిది వైన్స్ తయారీ కంపెనీల నుంచి 150 రకాల వైన్స్ అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా కొత్త మద్యం బ్రాండ్లకు ఎక్సైజ్ శాఖ తరువాయి 2లో

విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోతే
## పునరుద్ధరణ చర్యలకు త్రిసభ్య కమిటీ
02

- బొగ్గుద్వారా వచ్చే బూడిదను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు యోచిస్తున్నాం : డిప్యూటీ సిఎం భట్టి

# సహాయక చర్యలకు ఆటంకం



- ఎస్ఎల్‌బిసి సొరంగంలో భారీగా చేరిన మట్టి, నీరు
- బాధితులను రక్షించేందుకు శాయశక్తులా యత్నిస్తున్న ఎన్‌డిఆర్ఎఫ్, ఆర్మీ, సింగరేణి రెస్క్యూ టీం, హైడ్రా
- పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు
- ఎస్ఎల్‌బిసి ఘటనలో ప్రభుత్వ చర్యలను అభినందించిన రాహుల్





ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బిసి) టన్నెల్‌లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎన్‌డిఆర్ఎఫ్, ఆర్మీ, సింగరేణి రెస్క్యూ టీమ్, హైడ్రా, సికింద్రాబాద్ బైసన్ డివిజన్ ఇంజినీరింగ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రక్షణ చర్యలు చేపట్టారు. సొరంగంలో మట్టి, నీరు భారీగా చేరడంతో సహాయక చర్యలకు ఆటంకమేర్పడుతోంది. 8 మంది బాధితులను క్షేమంగా రక్షించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సొరంగం పైనుంచి లోపలికి వెళ్లే అంశాన్ని పరిశీలిస్తున్నామని మంత్రి వెల్లడించారు. 130 మంది ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది, 120 మంది ఎస్‌డిఆర్ఎఫ్, 24 మంది ఆర్మీ, 24 మంది సింగరేణి రెస్క్యూ టీమ్, 24 మంది హైడ్రా సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సొరంగంలో 13.5 కిలోమీటరు వద్ద పైకప్పు కూలింది. అక్కడి వరకు వెళ్లిన సహాయక బృందాలు తరువాయి 2లో



## సురక్షితంగా బయటికి రావాలి

కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

శ్రీశైలం ఎడమ గట్టు సొరంగ మార్గం ప్రమాదంలో చిక్కుకున్న 8 మంది క్షేమంగా బయటికి రావాలని ఆకాంక్షిస్తున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. గత 10 ఏళ్లు గా పట్టించుకోకుండా ఉన్న శ్రీశైల సొరంగ మార్గాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంతోషకరమని, అయితే టన్నెల్ పనులు ప్రారంభించేముందు టన్నెల్ బోర్ మిషన్ (టిబిఎం) ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సిన లాజికల్ సర్వే అధికారుల ఏమరపాటు వల్ల ఈ ఘటన జరిగి తరువాయి 2లో

## పరిస్థితి నిరాశాజనకం : జూపల్లి

టన్నెల్‌లో కొనసాగుతోన్న సహాయక చర్యలను మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు పర్యవేక్షిస్తున్నారు. లోకో ట్రైన్‌లో సొరంగం లోపలికి వెళ్లి వచ్చిన తర్వాత మంత్రి జూపల్లి మీడియాతో మాట్లాడారు. సొరంగంలో నీరు, బురద తోడేసే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. 'సొరంగం లోపలికి ఆక్సిజన్ పంపుతున్నారు. సహాయక బృందాలు రాత్రి నుంచి నిరంతరాయంగా పనిచేస్తున్నాయి. రెస్క్యూ టీమ్‌లు టన్నెల్ బోర్ మిషన్‌కు చేరువగా వెళ్లాయి. టన్నెల్ లోపల పరిస్థితి భయంకరంగా ఉంది. నీటి ఉద్ధృతికి బోరింగ్ మిషన్ కొట్టుకొచ్చింది. అవసరమైన యంత్రాలు లోపలికి తీసుకెళ్లలేని పరిస్థితి. కార్మికులను రక్షించే ప్రయత్నాలు తీవ్రంగా చేస్తున్నాం. లోపల చిక్కుకున్న కార్మికుల నుంచి ఎలాంటి శబ్దాలు రావట్లేదు. కార్మికుల విషయంలో పరిస్థితి ఆశాజనకంగా లేదు. అయినా, చివరి వరకూ మా ప్రయత్నాలు కొనసాగిస్తాం' అని తెలిపారు.

దివ్య విమాన గోపురం
## స్వర్ణమయం

- గోపురాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- దేశంలోనే ఎత్తయిన దివ్యవిమాన బంగారు గోపురంగా యాదగిరిగుట్ట రికార్డు
- అత్యంత వైభవంగా యాదగిరిగుట్ట మహాకుంభాభిషేక సంప్రోక్షణ





ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి ప్రతినిధి

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ దివ్య స్వర్ణ విమాన గోపుర కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. సుమారు 68 కిలోల బంగారంతో తాపడం చేయించిన దేశంలోనే ఎత్తయినదిగా రికార్డు పొందిన యాదగిరిగుట్ట స్వర్ణ విమాన గోపురాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. యాదగిరిగుట్టలో ఈ నెల 19 నుంచి నిర్వహిస్తున్న పంచకుండాత్మక నారసింహ యాగం పూర్ణాహుతి అనంతరం ఉదయం 11.54 గంటలకు దివ్య స్వర్ణ విమానగోపురం కుంభాభిషేకం కన్నుల పండుగగా జరిగింది. ఆగమశాస్త్ర తరువాయి 2లో



# 267 డ్రోన్లతో ఉక్రేన్‌పై విరుచుకుపడిన రష్యా





## యుద్ధానికి నేటితో మూడేళ్ళు పూర్తి

**కీవ్ :** ఉక్రేన్‌లో యుద్ధం ప్రారంభమై సోమవారంనాటికి (ఫిబ్రవరి 24) మూడు సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో ముందురోజునే రష్యా భారీస్థాయిలో డ్రోన్లతో దాడులకు దిగింది. దేశరాజధాని కీవ్‌పై బహుముఖంగా డ్రోన్ల దాడి జరిగింది. తమ భూభాగాలపై మొత్తం 267 డ్రోన్లను ఒకేసారి రష్యా సైన్యం ప్రయోగించిందని ఉక్రేన్ ఎయిర్‌ఫోర్స్ కమాండ్ అధికార ప్రతినిధి యూరివ్ ఐగ్నాత్ ఆదివారంనాడు చెప్పారు. 2022 ఫిబ్రవరిలో దాడి తర్వాత ఇదే అతిపెద్ద దాడి అని చెప్పారు. ఐతే ఈ దాడుల్లో ఎంతమంది ఉక్రేన్ ప్రజలు మరణించారన్న విషయంపై ఇంకా ఒక స్పష్టత రాలేదు. ఖార్జీవ్, పోల్టావా, సుమీ, కీవ్, చెర్నిహీవ్, మైఖోలెవ్, ఒడెశా సహా 13 రీజియన్లపై రష్యా సామూహిక డ్రోన్ల దాడి జరిగింది. ఐతే వీటిల్లో కేవలం 138 డ్రోన్లు మాత్రమే ఉక్రేన్ రాడార్లకు దొరికాయి. మిగిలినవి రహస్యంగా దెబ్బతీశాయి. దాడుల అనంతరం ఎమర్జెనీ సర్వీసులు రంగంలోకి దిగాయి. దక్షిణ ఉక్రేన్ ఖేర్సాన్, సెంట్రల్ సిటీ, జపోర్‌ఝియా, కీవ్ తదితర ప్రాంతాలపై రష్యా డ్రోన్లదాడ జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం ముగ్గురు మరణించారు. పలువురు గాయపడ్డారు. కైవీ రిహ్, ఒకవైపు శాంతి యత్నాలు, మరోవైపు యూరప్–అమెరికా మధ్య ఉక్రేన్ విషయంలో విభేదాలు పెరుగుతున్న తరుణంలో దాడులు జరగడంతో జెలెన్స్కీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాతో సహా యూరప్ దేశాలు, శాంతిని కోరుతున్న ప్రతి ఒక్కరూ తమకు పూర్తిస్థాయిలో అండగా ఉండి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు రష్యా రక్షణమంత్రిత్వశాఖ ఒక ప్రకటన చేస్తూ శనివారం నాడు రాత్రికి రాత్రే ఉక్రేన్ తమ భూభాగాలపై డ్రోన్లు ప్రయోగించిందనీ, తాము 20 డ్రోన్లను కూల్చివేశామని పేర్కొంది.



**యుద్ధం కొనసాగుతుంది: జెలెన్స్కీ కీలక ప్రకటన**
రష్యాతో తమ యుద్ధం కొనసాగుతుందని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఎక్స్ వేదికగా ఆదివారంనాడు ఒక కీలక ప్రకటన చేశారు. రష్యా ఏకకాలంలో భారీస్థాయిలో డ్రోన్లతో ఉక్రేన్‌పై బహుముఖ దాడికి దిగిన నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేశారు. యూరప్, అమెరికా సహా ప్రపంచంలో శాంతిని కోరే ప్రతి ఒక్కరూ ఉక్రేన్‌కు అండగా నిలబడాలని ఆ ప్రకటనలో కోరారు. ఉక్రేన్‌లో శాంతికి, యుద్ధ నివారణకు తాము శాయశక్తులా కృషి చేస్తామని, సహాయం చేయగలిగినవారు తమ గగనతల రక్షణకు సాయం చేయాలని, సాటి మానవుల ప్రాణాలు కాపాడాలని కోరారు. అందరూ ఐక్యంగా ఈ పని చేయగలుగుతారన్నారు. ఈ వారంలో భారీస్థాయిలో 1,115 డ్రోన్లు, 1,400 గైడెడ్ ఏరియల్ బాంబులు, వివిధ రకాల 35 క్షిపణులు తమ దేశంపై దాడి చేశాయని ఆ పోస్టింగ్‌లో పేర్కొన్నారు. తాజాదాడి ఇప్పటివరకూ జరిగిన దాడుల్లో అతిపెద్దదన్నారు.




# జర్మనీలో పోలింగ్‌లో ఇమ్మిగ్రేషన్,ఎకానమీ,ఉక్రేన్‌లే ఎజెండా








**బెర్లిన్ :** ఇమ్మిగ్రేషన్ (అక్రమ వలసలు), ఎకానమీ (అంతర్గత ఆర్థిక సంక్షోభం), ఉక్రేన్ (మద్దతు అంశం) అనే మూడు సమస్యలే ప్రధాన ఎజెండాగా మారిన జర్మనీలో పార్లమెంటుకు, 16 రాష్ట్రాల అసెంబ్లీలకు ఆదివారంనాడు పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. దీంతోపాటు భవిష్యత్తులో అమెరికాతో 27 యూరప్ దేశాల సంబంధాల విషయం కూడా జర్మన్ ఓటర్లపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నది. జర్మనీలో 5 కోట్ల 90 లక్షల 20 వేలమంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. దిగువసభ బుందేస్టాగ్‌లో ఈసారి కుదించిన 630 సీట్లకు ఓటింగ్ జరిగింది. పోలింగ్ ప్రక్రియ రోజు నాటికి కూడా 30 శాతం ప్రజలు ఎటూ తేల్చుకోలేకపోయారు. వీరిలో యువకులే అత్యధికులు ఉన్నారు. దేశ సరిహద్దులలో భద్రత కట్టుదిట్టం చేయాలని, అక్రమ వలసలను అరికట్టాలని జర్మనీ ఓటర్లు ప్రధానంగా కోరుకుంటున్నారు. ఈ నాడినే ప్రధానపార్టీలు పట్టుకున్నాయి. ఆర్థిక సంక్షోభంవల్ల ధరల పెరుగుదలతో ప్రజలు సతమతమవుతున్నారు. ప్రధానంగా ఈ సమస్యవల్లే ఓలాఫ్ షల్జ్ కూటమిపార్టీలో సంక్షోభం తలెత్తి ప్రభుత్వం కుప్పకూలిపోవడంతో ఏడునెలలు ముందుగానే మెరుపు ఎన్నికలు జరిగాయి.మొదటినుండీ ఎన్నికల ప్రచారంలో ఆధిపత్యం ప్రదర్శించిన సిడియు–సిఎస్‌యుపార్టీ తాజా ఎన్నికల సర్వే ప్రకారం కూడా తన ఆధిపత్యం నిరూపించుకుని 29.7 శాతం అంచనా ఓటింగ్ మద్దతుతో ప్రథమస్థానంలో నిలిచింది. ఆ పార్టీ తరపున ఫ్రెడరిక్ మెర్జ్ ఛాన్సలర్ పదవిరేసులో ముందంజలో ఉన్నారు. అమెరికా బలమైన మద్దతుదారుగా ఉన్న పచ్చి మితవాద ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ పార్టీ తరపున ఛాన్సలర్ అభ్యర్థిగా ఆలీస్ వీడెల్ తాజా సర్వేలో 20.6 శాతం ఓటింగ్ అంచనాలతో రెండోస్థానంలో ఉన్నారు. ఇక దేశంలో మెరుపు ఎన్నికలకు కారకుడైన తాత్కాలిక ఛాన్సలర్ ఓలాఫ్ షల్జ్ పార్టీ ఎస్‌పిడి 15.5 శాతం అంచనా ఓటింగ్ తో మూడోస్థానానికి దిగజారారు. ఎస్‌పిడి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న గ్రీన్స్‌పార్టీ 12.9 శాతం, జర్మనీ వామపక్షాలు 7.2 శాతం అంచనాఓట్లతో సర్వేలో నాలుగు, ఐదుస్థానాల్లో ఉన్నాయి. సందిగ్ధంలో ఉన్న యువకులు, ఎఎఫ్‌డికి అమెరికా మద్దతు వంటి పరిణామాలమధ్య చివరిని మిషంలో ఏదైనా జరగవచ్చునని కొందరు అంచనావేస్తున్నారు.

**బలమైన నాయకత్వం ఇస్తా**
ఇక హాట్ ఫేవరెట్‌గా బరిలో ఉన్న ఫ్రెడరిక్ మెర్జ్ (69) జర్మనీ ప్రజలకు ఎంతో సుపరిచితుడు. 33ఏళ్ళ వయసులో 1989లోనే ఆయన యూరోపియన్‌యూనియన్ పార్లమెంటుకు ఎన్నికయ్యారు. సిడియు–సిఎస్‌యు పార్లమెంటరీపార్టీ నాయకుడుగా వ్యవహరిస్తున్నారు. ఉక్రేన్‌కు యుద్ధంలో పూర్తి మద్దతు ఇస్తున్నారు. జాతీయ అంతర్జాతీయస్థాయిలో జర్మనీకి బలమైన నాయకత్వాన్ని ఇస్తాననీ, దేశంలో ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరిస్తాననీ మెర్జ్ చెబుతున్నారు. వలసలను అరికట్టేందుకు పార్లమెంటులో ఎఎఫ్‌డిపార్టీ మద్దతు కోరిన మెర్జ్ ఇంతకు ముందు తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్నారు. తర్వాత ఆ వైఖరి నుండి వెనక్కు మళ్ళారు. సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేస్తాననీ, అవసరమైతే సరిహద్దులు మూసేస్తాననీ జర్మనీలో తరచు వలస ప్రజల డ్రైవర్లవల్ల జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో శపథం చేశారు. ఎఎఫ్‌డి నాయకురాలు ఆలీఫ్ వీడెల్ కూడా ఇవే అభిప్రాయాలతో ఉన్నారు.

# ఈ వారంలోనే ట్రంప్–స్టార్‌మర్ భేటీ



**లండన్ :** బ్రిటన్ ప్రధాన మంత్రి ఖైర్ స్టార్‌మర్ ఈ వారంలోనే అమెరికా వెళ్ళి అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో సమావేశం జరుపుతారు. ఉక్రేన్ విషయంలో యూరప్–అమెరికా (ట్రాన్స్ అట్లాంటిక్) సంబంధాలు దెబ్బతింటున్న తరుణంలో స్టార్‌మర్ పర్యటన, ట్రంప్‌తో చర్చలు కీలకం కానున్నాయి. ఉక్రేన్ లేకుండా రష్యాతో శాంతి చర్చలకు అర్థం లేదని యూరప్ దేశాలు పట్టుపడుతున్నాయి. పుతిన్‌తో రియాద్‌లో అమెరికా అధికార ప్రతినిధుల చర్చల విషయాన్ని ఉక్రేన్‌కు చెప్పకపోవడం, యూరప్ నాయకత్వాన్ని భాగస్వామ్యం చేయకపోవడాన్ని ప్రపంచ సంబంధాలలో పెనుమార్పులుగా యూరోపియన్ యూనియన్ పరిగణిస్తున్న తరుణంలో ట్రంప్–స్టార్‌మర్‌ల సమావేశం జరగనున్నది. కాగా ఆదివారంనాడు గ్లాస్కోలో జరిగిన ఒక సదస్సులో బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్ మాట్లాడుతూ, ఎవ్వరూ రక్తతర్పణం జరగాలని కోరుకోవడంలేదన్నారు.

**ఉక్రేన్ లేకుండా రష్యా**
**ట్రంప్‌కు బ్రిటన్ మంత్రి ప్రశంస**
రష్యాను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చర్చల బల్ల దగ్గరకు తీసుకువచ్చి కూర్చోబెడుతున్నారని బ్రిటన్ విద్యాశాఖామంత్రి బ్రిడ్జేట్ ఫిలిప్సన్ ప్రశంసించారు. ఆదివారంనాడు ఆమె బ్రిటన్ మీడియాకు ఇంటర్వ్యూ ఇస్తూ, పరిష్కారానికి, శాంతి చర్చలకు ఒప్పుకోని పుతిన్‌తో తిరిగి సంబంధాలు నెలకొల్పుకున్న ట్రంప్ శాంతి సాధనకు సరైన మార్గంలో ప్రయాణిస్తున్నారని ప్రశంసించారు. ఐతే ఈ చర్చల్లో ఖచ్చితంగా జెలెన్స్కీకి కూడా భాగస్వామ్యం ఉండి తీరాలన్న యూరప్ వైఖరని పునరుద్ఘాటించారు. రష్యా–ఉక్రేన్ భాగస్వామ్యంలేకుండా అసలు యుద్ధానికి పరిష్కారమే ఉండదన్నారు. బ్రిటన్ రక్షణరంగ వ్యయాలను జిడిపిలో 2.3 శాతం నుండి 2.5 శాతానికి పెంచుతామని కూడా అన్నారు.

# హిజ్బుల్లా నాయకుడు నస్రుల్లా అంత్యక్రియలు



**బీరూట్ :** ఇజ్రాయెల్ సామూహిక దాడుల్లో మరణించిన హిజ్బొల్లా ఉగ్రవాదసంస్థ నాయకుడు హస్సన్ నస్రల్లా (65) అంత్యక్రియలు బీరూట్‌లో ఆదివారంనాడు జరిగాయి. అతడు మరణించిన ఐదు నెలల తర్వాత వేలాది మంది ప్రజల సమక్షంలో భారీలాంఛనాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నస్రల్లా షియా మత గురువు. 1992 నుండి 2024 సెప్టెంబరు 27న ఇజ్రాయెల్ దాడుల్లో మరణించేవరకూ షియ రాజకీయపార్టీకి, ఉగ్రవాద సంస్థకు మూడవ సెక్రటరీ జనరల్‌గా వ్యవహరించాడు. ఆయన మరణించాక ఇప్పటివరకూ ఐదునెలలపాటు ఒక రహస్యప్రదేశంలో ఖననం చేసి ఉంచారు. అధికారికంగా బీరూట్‌లోని విమానాశ్రయంరోడ్డులో ఉన్న ఒక ప్రత్యేక ప్రదేశాన్ని ఎంపికచేసి ప్రజల సమక్షంలో అంత్యక్రియలు ఆదివారం నాడు నిర్వహించారు. మొదట స్పోర్ట్స్ సిటీ స్టేడియంలో వేలాదిమంది ప్రజలమధ్య ప్రార్థనలతో ప్రధాన కార్యక్రమం నిర్వహించారు.ఇరాన్ సహా ముస్లిందేశాలతోపాటు 79 దేశాల నుండి ప్రతినిధులు ఈ అంత్యక్రియలకు హాజరయ్యారు. ఇస్లాం రాజ్యస్థాపనకోసం పవిత్రయుద్ధమే లక్ష్యంగా ఆయన జీవించాడు. ఆయన వారసుడు హిజ్బుల్లా నాలుగో సెక్రటరీ జనరల్ హషెమ్ సైఫుద్దీన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాడు.

# ఖైదీల విడుదలపై ఇజ్రాయెల్ మెలిక

## ఒప్పందాన్ని ఉల్లంఘించారని హమాస్ ఆగ్రహం



**టెల్‌అవీవ్ :** మధ్యవర్తులు చేసిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని గౌరవించి హమాస్ సంస్థ ఆరుగురు బందీలను విడుదల చేసినప్పటికీ తమవద్ద ఉన్న వందలమంది ఖైదీలను విడుదల చేసేందుకు ఇజ్రాయెల్ ప్రభుత్వం చివరి నిమిషంలో మెలికపెట్టింది. బందీల విడుదలను దాదాపు నిరవధికంగా వాయిదా వేసింది. హమాస్ ఉగ్రవాదసంస్థవద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయెల్ వాసులు అందరినీ పూర్తిగా విడుదల చేస్తామని హామీ ఇస్తేనే 620 మందితోపాటు వందలమంది ఖైదీలను విడుదల చేస్తామని ఆ దేశ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ మెలికపెట్టారు.620 మందిలో 151 మంది జీవితఖైదీలు ఉన్నారు. ఇప్పటికే 500 మంది ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేసింది. అదేవిధంగా బందీలను విడుదల చేసే సమయంలో హమాస్ తమపట్ల అత్యంత అవమానకరమైన, బాధించే పద్ధతులలో వ్యవహరించిందని నేతన్యాహూ కార్యాలయం ఒక ప్రకటనలో విమర్శించింది. దీంతో హమాస్ సంస్థ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇజ్రాయెల్ పూర్తిగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని వెంటనే ఈ విషయం పరిష్కరించాలని డిమాండ్ చేసింది. మార్చి రెండో తేదీతో ఇజ్రాయెల్–పాలస్తీనా ఉగ్రవాదసంస్థ హమాస్ మధ్య కుదిరిన 45 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం గడువు పూర్తవుతుంది. ఇప్పటికే ఈ ఒప్పందాన్ని అనేకసార్లు ఇజ్రాయెల్ ఉల్లంఘించడమేకాదు, ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో గడచిన నాలుగు వారాలుగా ఇజ్రాయెల్ ఒప్పందానికి తూట్లు పొడిచేవిధంగా పాలస్తీనా ప్రజల ఇళ్ళను, మౌలిక సదుపాయాల నిర్మాణాలను కూల్చివేస్తున్నది. ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో ఇప్పటివరకూ ఈ ప్రాంతంలో 15 మందిపైగా పాలస్తీనియన్లు మరణించారు.

# పన్నీర్‌సెల్వంకు అన్నాడిఎంకెలో స్థానం లేదు: పళనిస్వామి

**చెన్నై:** బహిష్కరించిన పన్నీర్‌సెల్వం (ఒపిఎస్)కు పార్టీలో ఎలాంటి స్థానం లేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి అన్నారు. పార్టీలోకి ఆయనను తిరిగి తీసుకునే అవకాశం లేదని తెలిపారు. ఒపిఎస్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై పళనిస్వామి స్పందించారు. సోమవారం దివంగత సిఎం జయలలిత 77వ జయంతి. ఈ నేపథ్యంలో అన్నాడిఎంకె కార్యకర్తలకు ఆదివారం ఆయన లేఖ రాశారు. 'తోడేలు, గొర్రెలు కలిసి జీవించగలవా? కలుపు మొక్కలు, మొక్కలు పంటలో భాగం కాగలవా? విశ్వాసపాత్రుడు, ద్రోహి భుజం భుజం కలిపి నిలబడగలరా? మీ దృఢమైన సమాధానం నాకు వినిపిస్తోంది' అని అందులో పేర్కొన్నారు. కాగా, అన్నాడీఎంకేలోకి తిరిగి రావడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు మాజీ సీఎం పన్నీర్‌సెల్వం ఇటీవల తెలిపారు. అయితే పార్టీలో సర్వశక్తిమంతుడైన ప్రధాన కార్యదర్శి పదవిని కార్యకర్తలే ఎన్నుకోవాలని పట్టుబట్టారు. 'నేను, టీటీవీ దినకరన్, శశికళ (అన్నాడీఎంకే నుంచి బహిష్కృతులు) ఎలాంటి షరతులు లేకుండా అన్నాడీఎంకేతో ఏకం కావడానికి సిద్ధంగా ఉన్నాం. చర్చల ద్వారా సమస్యలను మేం పరిష్కరించుకోవచ్చు' అని అన్నారు. అన్నాడీఎంకే కార్మికుల హక్కుల పునరుద్ధరణ కమిటీకి పన్నీర్‌సెల్వం నాయకత్వం వహిస్తున్నారు.

## బయటికి రావాలి (మొదటి పేజీ తరువాయి)

ఉండవచ్చని తెలుస్తోందని తెలిపారు. శ్రీశైలం రిజర్వాయర్ లోని నీరు టన్నెల్ కాంటూర్ లెవెల్ కంటే ఎక్కువగా ఉండడం వలన 14 కిమీ నుండి 19.500 కిమీ లో ఊట నీరు వస్తుందని, ఈ ప్రాంతంలో గ్రానైట్, రాతిశిల కంటే మట్టి ప్రాంతం ఎక్కువగా ఉండడం ఈ ప్రమాదం జరిగిందని, ఊట నీరు రిజర్వాయర్ నుండి రాకుండా కట్టడి చేయాలన్నారు. ఇంజనీరింగ్ నిపుణుల సలహాలు తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా సత్వరమే పనులు పూర్తిచేయాలని సాంబశివరావు కోరారు. టన్నెల్ లోపల ఎప్పుడు ఆక్సిజన్ సిలిండర్లను అందుబాటులో ఉంచి పనులు నిర్వహించాలని, ఈ ఘటనపై నిపుణుల కమిటీని వేసి విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు.

**గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం : చాడ**
శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ సొరంగం పనుల్లో గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. ఎస్‌ఎల్‌బిసిలో చోటు చేసుకున్న ప్రమాదంలో అనేక పరిణామాలు ఉన్నాయని, గత ప్రభుత్వ కాలంలో పనులు చేపట్టకపోవడం వలన పైకప్పు స్లాబు తుప్పు పట్టి ఈ ప్రమాదం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద సొరంగ మార్గమని, 20 సార్లు మార్పులు చేయడం వలన సొరంగ మార్గం అంచనాలు పెరిగి మరింత ఆలస్యం జరిగిందని తెలిపారు.2007, 2015లో కృష్ణానది పరివాహక ప్రాంతాలను సిపిఐ బృందం సందర్శించినప్పుడు శ్రీశైలం సొరంగ మార్గం త్వరగా పూర్తిచేసి నల్లగొండ జిల్లాకు నీరందించాలని చెప్పడం జరిగిందని అప్పుడే పనులు ప్రారంభించినా, గత ప్రభుత్వ కాలంలో 10 ఏళ్ల పాటు పనులు చేపట్టకపోవడం వలన మరింత ఆలస్యం జరిగిందని తెలిపారు. ఈ ఘటనలో ప్రమాదానికి గురైన వారిని యుద్ధ ప్రాతిపదికన రక్షించాలని, ఈ ఘటనపై విచారణ చేపట్టాలని చాడ వెంకట రెడ్డి డిమాండ్ చేశారు.

# విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోతే పునరుద్ధరణ చర్యలకు త్రిసభ్య కమిటీ

## బొగ్గుద్వారా వచ్చే బూడిదను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు యోచిస్తున్నాం : డిప్యూటీ సిఎం భట్టి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జెన్‌కో పరిధిలోని విద్యుత్ కేంద్రాల్లో సాంకేతిక సమస్యలతో ఏదైనా సంఘటన జరిగి, ఉత్పత్తి నిలిచిపోతే, వీలైనంత త్వరగా పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు డైరెక్టర్, చీఫ్ ఇంజనీర్ అధికారులతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తికి వాడుతున్న బొగ్గుద్వారా వచ్చే బూడిదను వినియోగంలోకి తీసుకురావడానికి ఆలోచిస్తున్నామని, స్థానిక గిరిజన యువతను స్వయం ఉపాధి రంగంలో ప్రోత్సహించేందుకు బూడిదతో ఇటుకలు తయారు చేయించే యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని జెన్‌కో అధికారులను ఆయన ఆదేశించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం అభివృద్ధి పురోగతి పనులపైన జెన్‌కో అధికారులతో డిప్యూటీ సీఎం ఆదివారం సమీక్షించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భద్రాద్రి పవర్ ప్లాంట్ యూనిట్1 ఉత్పత్తికి సంబంధించి కాలిపోయిన జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులపైన డిప్యూటీ సిఎం భట్టి ఆరా తీశారు. మరమత్తు పనులు చేయడానికి టెండర్‌ను ఆహ్వానించామని, పనులు పురోగతిలో ఉన్నాయని చీఫ్ ఇంజనీర్ పి.వి శ్రీనివాస్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఇలాంటి సంఘటన మళ్లీ పునరావృతమైనప్పుడు విద్యుత్తు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయంగా మరో జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కొనుగోలు చేస్తున్నామని, దీనికి కూడా టెండర్‌ను ఆహ్వానించామని వివరించారు. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి బి.హెచ్.ఈ.ఎల్ చేయాల్సిన పెండింగ్ పనులు, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు ప్లాంటు పనితీరు, సింగరేణి మైనింగ్ నుంచి భద్రాద్రి పవర్ ప్లాంట్ వరకు బొగ్గు రవాణ నేపథ్యంలో రైల్వే లైన్ పనులు తదితర అంశాలపై భట్టి సమీక్షించారు.జెన్‌కో పరిధిలోని విద్యుత్ ఉత్పత్తిలో తలెత్తిన సాంకేతిక సమస్యల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ నిర్దిష్ట గడువులోగా సమీక్షించి, తగిన నివేదికను బోర్డుకు సమర్పించాలని, ఆ తర్వాత బోర్డు నుంచి అనుమతి తీసుకుని,ఉత్పత్తి పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తి చేసి, సంస్థకు నష్టం రాకుండా దోహదపడాలని భట్టి విక్రమార్క సూచించారు. వర్షాకాలం సీజన్‌లో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు తడి బొగ్గుతో విద్యుత్తును ఉత్పత్తి చేయడం ద్వారా సంస్థకు నష్టం వస్తుందని అధికారులు డిప్యూటీ సీఎం భట్టికి తీసుకొచ్చారు. దీనిపైన ఆయన స్పందిస్తూ బొగ్గు నిల్వ చేయడానికి కావాల్సిన షెడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. సింగరేణి మైనింగ్ ప్లాంట్ మణుగూరు నుంచి భద్రాద్రి,థర్మల్ పవర్ స్టేషన్ ప్లాంట్ వరకు కొనసాగుతున్న రైల్వే లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా 18.67 కిలో మీటర్ల పొడవునా రైల్వే లైన్ నిర్మాణ పనులకు 201.30 ఎకరాలు భూసేకరణ జరుగుతుందని వివరించారు. ఈ పనుల్లో వేగం పెంచడానికి ప్రతివారం సమీక్ష నిర్వహించడంతో పాటు క్యాలెండర్ ఫిక్స్ చేసి పనులు చేయించాలని భట్టి అధికారులను ఆదేశించారు. భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఏ చిన్న సంఘటన జరిగిన పవర్ ప్లాంటు చీఫ్ ఇంజనీర్ పూర్తి బాధ్యత వహించాలని, వెంటనే ఆ విషయాన్ని తనతో పాటు సిఎండి దృష్టికి తీసుకురావాలని, ఈ విషయంలో ఆలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయని భట్టి హెచ్చరించారు.

**పవర్ ప్లాంట్‌లో నాన్ టెక్నికల్‌గా స్థానిక గిరిజనులను నియమించుకోండి:** పవర్ ప్లాంటులో పని చేయడానికి కావాల్సిన నాన్ టెక్నికల్ కార్మికులను ఐటిడిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ద్వారా స్థానిక గిరిజనులను నియామించుకోవాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో 3500 చొప్పున ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన నేపథ్యంలో బూడిదతో ఇటుకలు తయారు చేసుకునే యువతకు మంచి లాభం చేకూరుతుందన్నారు. భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రానికి సంబంధించి త్రిడి వాక్ వే మోడల్ తయారు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జెన్‌కో డైరెక్టర్లు అజయ్, సచ్చిదానంధం, లక్ష్మయ్య, చీఫ్ ఇంజనీర్లు శ్రీనివాస్‌రావు, రత్నాకర్ రావు, పి.వి శ్రీనివాస్, జీవాకుమార్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తరకం మద్యం (మొదటి పేజీ తరువాయి)

అనుమతి ఇచ్చింది. ప్రభుత్వం ఆదేశించిన రీతిలో కొత్త కంపెనీల మద్యం బ్రాండ్లకు బ్రాండ్లకు అనుమతులు ఇవ్వనున్నారు. తెలంగాణలో లేని విదేశీ దేశీయ లిక్కర్ బీర్ కంపెనీలు తమ మద్యం ఉత్పత్తి బ్రాండ్లను అమ్మకాలు జరుపుకోవడానికి కొత్త కంపెనీల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. టిజిబిసిఎల్‌లో రిజిస్టర్ కానీ కొత్త కంపెనీలు ఇతర రాష్ట్రాల్లో జరుపుతున్న తమ మద్యం అమ్మకాలపై నాణ్యత ప్రమాణాలతో అమ్మకాలు జరుపుతున్నట్లుగా మద్యం అమ్మకాలపై ఎలాంటి ఆరోపణలు లేవని నిర్ధారణ సర్టిఫికేషన్ పత్రం దరఖాస్తులో జత పరచాలని కోరింది. అయితే తెలంగాణలో పలు కొత్త కంపెనీలు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి ఇటీవల టీజీబీసీఎల్ కొందరికి అనుమతులు ఇవ్వడం జరిగింది.కానీ కొత్త కంపెనీలపై పలు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన కొత్త బ్రాండ్లను నిలిపివేశారు. తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్ల ఆహ్వానానికి కొత్త విధానానికి ప్రభుత్వం నాంది పలికింది. కొత్త దరఖాస్తులను ఆహ్వానించే ముందు బహిరంగ ప్రకటన ఇవ్వాలని ప్రభుత్వం టిజిబిసిలకు నిర్దేశించింది. టిజిబిసిఎల్ తెలంగాణలో రిజిస్టర్ కానీ కొత్త సప్లయర్స్ నుంచి దరఖాస్తులు తీసుకోవడానికి ప్రకటన జారీ చేసింది. కొత్త కంపెనీల నుంచి వచ్చిన దరఖాసులను పది రోజులపాటు ఆన్లైన్లో పెట్టాలని నిర్ణయం తీసుకుంది. దరఖాస్తులపై వచ్చిన అభ్యంతరాలపై విచారణ జరిపి అనుమతులపై నిర్ణయం తీసుకోనుంది. టిజిబిసిఎల్ లో రిజిస్టర్ కాబడి సరఫరా చేస్తున్న సప్లయర్స్ మాత్రం ప్రస్తుతం ఉన్న పద్ధతిలోనే కొత్త బ్రాండ్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. వీటన్నిటిని తరువాత తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ కొత్త మద్యం బ్రాండ్లపై నిర్ణయం తీసుకోనున్నారు.

## స్వర్ణమయం (మొదటి పేజీ తరువాయి)

ప్రకారం జరిగిన ఈ స్వర్ణ తాపడం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎంపీ చామాల కిరణ్ కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గన సీఎం రేవంత్ రెడ్డి సతిసమేతంగా యాదగిరిగుట్ట కొండపైకి చేరుకున్నారు. ఆలయ ఈవో కార్యాలయం వద్ద ప్రజా ప్రతినిధులు, ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఆనంతరం సాంప్రదాయదుస్తులు ధరించి లిఫ్ట్ మార్గం ద్వారా పంచకుండత్మాక నరసింహ యాగం వద్దకు చేరుకున్నారు. 40 జీవనదుల నుంచి తీసుకొచ్చిన జాలాల కలశాలలకు ప్రత్యేకంగా పూజలు చేశారు. వానమామలై మఠం పీఠాధిపతి మదుర కవి రామానుజ జీయర్ స్వామి సంప్రోక్షణ కొరకు యాగం చేసిన జాలాల కలశాలలను నెత్తిన ఎత్తుకొన్నారు. యాగశాల నుంచి ఆలయ ఉత్తర ద్వారం లోపలికి వెళ్లి ప్రాకార మండపాల ద్వారా నడుచుకుంటూ స్వర్ణ గోపురం వద్దకు చేరుకున్నారు. స్వర్ణ గోపురాన్ని ఆవిష్కరించిన తరువాత సీఎం రేవంత్ రెడ్డి గోపురంపైకి ఎక్కి సుదర్శన చక్రంపై మహాసంప్రోక్షణకు 40 జీవనదుల జలాలతో అభిషేకించారు. 50.5 అడుగుల ఎత్తు, 10,759 చదరపు అడుగుల వైశాల్యం కలిగిన పంచతల రాజగోపురానికి సుమారు 68 కిలోల బంగారంతో యాదగిరిగుట్ట స్వర్ణ విమాన గోపురం తాపడం చేయించారు. రూ.5.10 కోట్ల ఖర్చుతో భక్తులు, దాతలు ఇచ్చిన బంగారం నగదుతో పాటు, దేవస్థానం హుండీలో భక్తులు వేసిన కానుకలతో స్వర్ణ తాపడం చేపట్టారు. గోపురంపై చెక్కిన సింహ, గరుడ విగ్రహాలు, నారసింహ రూపాలకు సంబంధించిన చరిత్రను, విశిష్టత గురించి సీఎం రేవంత్ రెడ్డికి ఆలయ పండితులు వివరించారు. గోపురంపై ఉన్న నృసింహ అవతారాలు, విష్ణుమూర్తి, లక్ష్మీ (ఆండాళ్ అమ్మవారు), గరుడమూర్తులు భక్తులకు స్వర్ణమయంగా కనువిందు చేశాయి.

**పూర్ణకుంభంతో సీఎం దంపతులకు స్వాగతం...**
స్వర్ణ గోపురం ఆవిష్కరణ ఆనంతరం సీఎం రేవంత్ రెడ్డి దంపతులు గర్భాలయం సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి నల్లందీగల్ భాస్కర చార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ధ్వజస్థంబానికి మొక్కి ప్రధాన ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసుకొని గర్భాలయంలో ఉన్న స్వయంభూవులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం ఆనంతరం ఆలయ ముఖమండపంలో సీఎం రేవంత్ దంపతులకు స్వామి వారి శేష వస్త్రాన్ని బహుకరించి, కండువాను మెడలో వేశారు. స్వర్ణ గోపురం జ్ఞాపికను బహూకరించి స్వామి వారి ప్రసాదాన్ని ఆలయ ఈవో అందజేశారు.

**సీఎం రేవంత్ రెడ్డికి ఘనంగా స్వాగతం..**
హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన యాదగిరిగుట్టకు విచ్చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హన్మంతరావులు ఘనంగా స్వాగతం పలికారు. పట్టు శాలువాకప్పి, పుష్పగుచ్చం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేల్, మండల పార్టీ అధ్యక్షులు కానుగు బాలరాజు, రేవంత్ సైన్యం అధ్యక్షులు మహ్మద్ నజీరుద్దీన్, మఠాధిపతులు, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భాస్కరరావుతో సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు .

**ఆలయంలో ఆర్జిత సేవలు, బ్రేక్ దర్శనాలు రద్దు..**
యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ దివ్య స్వర్ణ విమాన గోపురం మహోత్సవంలో భాగంగా ఆదివారం ఆలయంలో నిత్య కల్యాణం, పుష్పార్చనతో పాటు ఆయా ఆర్జిత సేవలను రద్దు చేశారు. అంతే కాకుండా ఉదయం, సాయంత్రం ఆలయంలో బ్రేక్ దర్శనాలను సైతం నిలిపివేశారు. ఉదయం 10 గంటల నుంచి ఉచిత, వీఐపీ, ఇతర టికెట్ దర్శనాలను రద్దు చేశారు. ఉదయం సమయంలో స్వామి వారి దర్శనాలకు వచ్చిన భక్తులను ఆర్టీసీ బస్సుల్లో అనుమతించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుదీర్ బాబు పర్యవేక్షణలో భువనగిరి డిసిపి రాజేష్ చంద్ర బారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఆటంకం (మొదటి పేజీ తరువాయి)

టన్నెల్ బోరింగ్ మిషన్ వద్దకు వెళ్లేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అక్కడి నుంచి అర కిలోమీటరు వెళ్లేందుకు మట్టి, నీటితో అడ్డంకులు ఏర్పడుతున్నాయి. హై కెపాసిటీ పంపింగ్ సెట్లు, క్రేన్లు, బుల్డోజర్ల సాయంతో ముందుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. టన్నెల్‌లో 14వ కి.మీ వద్ద 100 మీటర్ల మేర 15 అడుగుల ఎత్తు బురద పేరుకుపోయింది. ఫిషింగ్ బోట్లు, టైర్లు, చెక్కబల్లలు వేసి దాటేందుకు ప్రయత్నిస్తున్నారు. మరో 50 మీటర్ల బురద స్థలాన్ని దాటితేనే ప్రమాద స్థలికి వెళ్లగలమని సహాయక బృందాలు చెబుతున్నాయి. ఆర్మీ వైద్య బృందాలు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. 8మంది బాధితుల ఆచూకీ ఇంకా తెలియలేదని ఎన్‌డిఆర్‌ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ సుఖేంద్ తెలిపారు. సహాయక చర్యల కోసం ఆదివారం రాత్రి నేవీ బృందం శ్రీశైలం చేరుకోనుందన్నారు.

**ఎస్‌ఎల్‌బిసి ఘటనలో ప్రభుత్వ చర్యలను అభినందించిన రాహుల్**
**న్యూఢిల్లీ :** ఎస్‌ఎల్‌బిసి ప్రమాద ఘటనలో ప్రభుత్వం తీసుకున్న సహాయక చర్యలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ అభినందించారు. ఆదివారం ఈ ఘటనపై ఆయన సిఎం రేవంత్ రెడ్డితో ఫోన్లో మాట్లాడారు. ప్రమాద వివరాలను, బాధితులను రక్షించేందుకు చేపట్టిన చర్యలను ఆయన సిఎంని ఫోన్‌లో అడిగి తెలుసుకున్నారు. దాదాపు 20 నిమిషాల పాటు ఇరువురి మధ్య ఫోన్ సంభాషణ నడిచింది. ఘటన జరిగిన వెంటనే మంత్రి ఉత్తమ్ ఘటనాస్థలికి వెళ్లారని రాహుల్‌కు రేవంత్ తెలిపారు. ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో సహాయక చర్యలు చేపట్టామని, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు రేవంత్ రాహుల్‌కు వివరించారు. అమ్రాబాద్ మండలం, దోమలపెంట వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్‌ఎల్‌బిసి) టన్నెల్ నిర్మాణంలో శనివారం ఉదయం అపశృతి చోటు చేసుకున్న విషయం తెలిసిందే. టన్నెల్ బోరింగ్ సమయంలో 9మీటర్ల మేర పైకప్పు కూలింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నారు. వీరిని రక్షించేందుకు సహాయక చర్యల్లో 24 మంది ఆర్మీ సిబ్బంది, 130 మంది ఎన్‌డిఆర్‌ఎఫ్ 24 మంది హైడ్రా బృందం, 24 మందితో కూడిన సింగరేణి కాలరీస్ రెస్క్యూ టీమ్, 120 ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

**బాధిత కుటుంబాల్లో ఆందోళన..**
ఎస్‌ఎల్‌బిసి టన్నెల్‌లో చిక్కుకుపోయిన 8మంది ఎలా ఉన్నారోనని బాధిత కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. తమ వారి క్షేమ సమాచారం ఎప్పుడు తెలుస్తుందా అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. బాధితులను క్షేమంగా రక్షించేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని మంత్రులు, అధికారులు బాధితుల కుటుంబాలకు ధైర్యం చెబుతున్నారు. జెపి సంస్థకు చెందిన మనోజ్ కుమార్ (పిఇ), శ్రీనివాస్ (ఎస్ఇ), రోజువారీ కార్మికులు సందీప్ సాహు (28), జక్తాజెస్ (37), సంతోష్ సాహు (37), అనూజ్ సాహు (25) ఉన్నారు. రాబిన్‌సన్ సంస్థకు చెందిన ఆపరేటర్లు సన్నీ సింగ్ (35), గురుదీప్ సింగ్ (40) సొరంగం లోపల చిక్కుకు పోయారు. జమ్మూ, పంజాబ్, ఝార్ఖండ ఉత్తర్ ప్రదేశ్ ప్రాంతాల నుంచి వచ్చిన వీరు సొరంగంలో కొంతకాలంగా పని చేస్తున్నారు.

# వలసదారులపై ట్రంప్ ప్రభుత్వ తీరు ఆక్షేపణీయం

సిపిఐ జాతీయ కార్యదర్శి
డాక్టర్ కె.నారాయణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అక్రమ వలసదారుల పేరుతో యువత పట్ల అమెరికా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయమని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ ప్రభుత్వం వలసదారులను తిప్పి పంపే పేరుతో చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని పేర్కొన్నారు. ఈ మేరకు అమెరికా పార్లమెంటు ముందు నుంచి ఆదివారం నారాయణ ఓ ప్రకటన విడుదల చేశారు. అక్రమ వలసదారులను తిప్పి పంపడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వారి పట్ల కక్ష గట్టినట్లు వ్యవహరిస్తూ అమానవీయ పద్ధతులను అనుసరిస్తోందన్నారు. భారత ప్రభుత్వం కూడా అమెరికాలో ఉన్న భారతీయ వలసదారులను వెనక్కు తీసుకుంటామని ప్రకటన చేసిందని గుర్తుచేశారు. అయితే ట్రంప్ ప్రభుత్వము వలసదారులని తిప్పి పంపడానికి ఎన్నుకున్న విధానాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. భారత ప్రధాని మోదీ అమెరికాకు వచ్చి ట్రంప్‌తో చర్చలు జరిపిన మరుసటి రోజు నుంచి కూడా అదే రీతిలో జంతువులను వేటాడినట్లు వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని నారాయణ అన్నారు. అమెరికాలో ఉన్న వలసదారులు ఇప్పటికిప్పుడు వచ్చిన వారు కాదని, దశాబ్దకాలంగా అక్కడ ఉంటున్నారని తెలిపారు. వారిని వారి దేశాలకు పంపడానికి అనుసరిస్తున్న విధానాలు చాలా అభ్యంతరకరంగా ఉన్నాయని, అమెరికా ప్రభుత్వ తీరుతో యువత జీవితం దెబ్బతిన్నట్లు అవుతున్నదని పేర్కొన్నారు. వలసదారులను గుర్తించి, వారికి కొంత సమయం ఇచ్చి సుహృద్భావ వాతావరణంలో తిప్పి పంపే ఏర్పాటు చేసి ఉండాల్సిందని, అలా కాకుండా యువతను వేధించి వెంటాడుతున్న తీరును ఖండిస్తున్నామని నారాయణ పేర్కొన్నారు.

# రాష్ట్రంలో యూరియా కొరత లేదు.. రైతులు ఆందోళన పడవద్దు

ఈ వారంలో 81,800 మెట్రిక్ టన్నుల
యూరియా రాష్ట్రానికి సరఫరా మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో యూరియా కొరతలేదని, రైతుల ఆందోళన పడాల్సిన అవసరమే లేదని, ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన దానిలో 1.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా తక్కువగా పంపినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే మార్క్‌ఫెడ్ వద్ద ఉంచిన 3.08 లక్షల మెట్రిక్ టన్నులతో అవసరం మేరకు అన్ని జిల్లాలకు సరఫరా చేస్తూ, ఎక్కడా ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను వెంటనే సరఫరా చేయాల్సిందిగా తాను ప్రత్యక్షంగా సంబంధిత కేంద్ర మంత్రికి లేఖల ద్వారా కోరామన్నారు. రాష్ట్రానికి సంబంధించిన బిజెపి పెద్దలు కూడా ఈ విషయంలో విమర్శలు మాని మన రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను వెంటనే సరఫరా చేసేలా తమ వంతు కృషి చేస్తే బాగుంటుందని, పెరిగిన విస్తీర్ణం, వినియోగం దృష్ట్యా రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని తమ వంతు బాధ్యత తీసుకుని, రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు మద్ధతు అందిస్తే మంచిదని హితవు పలికారు. గత యాసంగిలో రైతులు ఫిబ్రవరి 20 నాటికి 6.9లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొనుగోలు చేయగా, ఈసారి 8.80 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారన్నారు. గత ఏడాది ఫిబ్రవరి నెలలో 1.99 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తే, ఈ సంవత్సరం ఫిబ్రవరి 20 నాటికి 2.59 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి 8.54 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా, రాష్ట్రానికి 6.81 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని, కేంద్రంతో నిత్యం సంప్రదింపులు జరుపుతూ, ఎప్పటికప్పుడు పరిస్థితులు వివరిస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే ఢిల్లీకి వెళ్లిన రాష్ట్ర ప్రభుత్వ అధికారులు రాష్ట్రానికి కేటాయించిన యూరియా వెంటనే సరఫరా చెయ్యాలని కోరడం జరిగిందన్నారు. గత యాసంగిలో సాగైన పంటల విస్తీర్ణంతో పోల్చుకుంటే, ఈసారి నీటి వనరులు, భూగర్భ జలాలు పుష్కలంగా ఉండటంతో ముఖ్యంగా వరి, మొక్కజొన్న పంటల విస్తీర్ణంలో 5 నుండి 10 శాతం వరకు పెరిగిందని, యూరియా వాడకం కూడా గతంతో పోల్చుకుంటే ఇప్పటికే 1.9 లక్షల మెట్రిక్ టన్నులు అధికంగా వినియోగించినట్టు మంత్రి వెల్లడించారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వము పంటకాలం ప్రారంభం నుండే నిత్యం సమీక్షించుకుంటూ, రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు సరిపడ యూరియా నిల్వలను అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకున్నామని, వెస్సెల్స్ కానీ, రైల్వే వ్యాగిన్స్ కానీ రావడంలో ఎక్కడైనా, ఏదైనా జిల్లాకు ఆలస్యమైతే వెంటనే పొరుగుజిల్లాల నుండి తరలిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1.29 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, ఫిబ్రవరి 22న 3 ర్యాక్స్, 23న 7, 24న 4, 25న 7, 26న 4, 27న 5 ర్యాక్స్, 28న 4 ర్యాక్స్ మొత్తం 81,800 మెట్రిక్ టన్నులు ఈ వారంలో సరఫరా అవుతుందని తెలియజేశారు.



## బిసి రిజర్వేషన్లపై బిజెపి వైఖరి ఏంటో చెప్పాలి?

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ లేదు
రాష్ట్ర ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** బిసి రిజర్వేషన్లపై బిజెపి వైఖరి ఏంటో చెప్పాలని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేస్తాం.. పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేస్తారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందించేందుకు బిఆర్ఎస్, బిజెపిలు పరస్పరం సహకరించుకుంటున్నాయని విమర్శించారు. ముస్లింలను బిసిల్లో తాము కలపలేదని, కొన్ని ముస్లింల కులాలు ముందు నుంచే బిసిల్లో ఉన్నాయన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము పోటీ చేయట్లేదని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో పరిష్కార మార్గాన్ని సూచించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చే విధంగా పలు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. నిరుద్యోగులు 50 వేల పైచిలుకు ఉద్యోగాలు, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, రైతు భరోసా వంటి అనేక పనులు చేశామన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత గ్రూప్ 1 నోటిఫికేషన్ ఒక్కటే ఇచ్చారని, అది కాంగ్రెస్ హయాంలో మాత్రమే విడుదలైనట్లు గుర్తు చేశారు. అనవసరంగా బురదజల్లకుండా ప్రభుత్వానికి సూచనలు చేయాలన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాల జోరు!

ఓటుకు రూ.ఐదు నుండి ఆరు వేలు
ఉపాధ్యాయుల సంఘాలకు మందు, విందు
బిసి నినాదంతో మరి కొందరు అభ్యర్థులు





**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాల పర్వం సాగుతున్నది. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాగైనా గెలిచి తీరాలన్న పార్టీల మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎంత ఖర్చుకైనా వెనుకాడడం లేదన్న ప్రచారం వినిపిస్తున్నది. రాష్ట్రంలో రెండు ఉపాధ్యాయ, నియోజకవర్గం, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఈనెల 27న ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రచారాన్ని ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బిజెపి, బిఎస్పీ, స్వతంత్ర అభ్యర్థులు సామాజిక మాధ్యమాలతోపాటు ఇంటిటికీ తిరుగుతూ ముమ్మరం చేశాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఓటర్లు తక్కువ సంఖ్యలో ఉండటంతో వారిని ప్రసన్నం చేసుకొని, తమ వైపు తిప్పుకొనేందుకు అభ్యర్థులు తమ అనుచరులతో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఉపాధ్యాయ ఓటర్లకు కానుకలు అందజేస్తామని ఓ పార్టీ అభ్యర్థి అనుచరులు ఫోన్లు చేసి ప్రచారం చేయడంతో పాటు అందరినీ ఓ చోట చేర్చి మందు, విందులు ఏర్పాటు చేస్తున్నారు. హనుమకొండ జిల్లాలోని కమలాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, వేలేరులోని కొన్ని గ్రామాల్లో పట్టభద్రులకు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ ఆదిలాబాద్, మెదక్ జిల్లాల నియోజకవర్గంలో ఓటు హక్కు వేసే అవకాశం ఉండటంతో ఈ ప్రాంతాల్లోని ఓటర్లకు అటు పట్టభద్రుల కోటాలో, ఇటు ఉపాధ్యాయుల ఓటర్లలో డిమాండు పెరిగింది. వివిధ ఉపాధ్యాయ సంఘాల్లోని కొందరు ఉపాధ్యాయులు తమ వర్గంలోని ఉపాధ్యాయులు చేజారిపోకుండా పోలింగుకు ముందు విందు భోజనాలు, ఎంతో కొంత నగదు సైతం అందజేసేలా ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలిసింది. మరో ఉపాధ్యాయ నియోజకవర్గంలోని ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి తరుపున ఆయన అనుచరులు ఇప్పటికే గిఫ్ట్ రూపంలో కానుకలు ఇచ్చేందుకు రెడీ చేశారని సమాచారం. రూ.5వేలు, లేదా రూ.6వేల విలువ గల బహుమతులు లేదా నగదును కవర్లలో పెట్టి పంచేందుకు సిద్ధమయ్యారని సమాచారం. పాఠశాల సమయాల్లో ప్రచారం చేయొద్దని చెప్పినా పలు ఉపాధ్యాయ సంఘాలు పాఠశాలల్లోకి విచ్చేసి ప్రచారాన్ని బహిరంగంగా చేస్తున్నాయి.

**వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీపై గట్టిపోటీ**

వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీపై గట్టిపోటీ నెలకొన్నది. మొత్తం 12 జిల్లాల పరిధిలో ఉన్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో యుటిఎఫ్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సి రెడ్డి, బిజెపి నుంచి పులి సరోత్తంరెడ్డి, టీపీఆర్టీయూ నుంచి గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, పిఆర్టీయు నుంచి పింగిళి శ్రీపాల్ రెడ్డి, సిపిఎస్ యూ నుంచి డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, స్వతంత్ర్య అభ్యర్థులుగా మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, సుందర్‌రాజ్ యాదవ్, ఎల్.వెంకటేశ్వర్లు (ప్రజావాణి పార్టీ), ఆర్వ స్వాతి, కంటె సాయన్న పన్నాల గోపాల్ రెడ్డి, యేలె చంద్రమోహన్, చాలిక చంద్రశేఖర్, జంగిటి కైలాసం, జె.శంకర్, తలకోల పురుషోత్తంరెడ్డి తాటికొండ వెంకటరాజయ్య దామెర బాబురావు, బంక రాజు బరిలో నిలిచారు. 10 మందిలో నల్గొండ జిల్లాకు చెందిన అర్వ స్వాతి ఒక్కరే మహిళ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఏడుగురు టీచర్ ఎమ్మెల్సీ కోసం పోటీ పడుతున్నారు.

**బిసి నినాదాన్ని బలంగా వినిపిస్తున్న అభ్యర్థులు**

అభ్యర్థుల్లో కొందరు బిసి నినాదంతో ముందుకెళ్తుండగా, మరికొందరు తమకు ఉపాధ్యాయుల్లోని గౌరవాన్ని, సంఘాల ప్రాబల్యాన్ని చూసి గెలుపుపై ధీమాగా ఉన్నారు. కానీ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి బిసి నినాదాన్ని బిసి అభ్యర్థులు బలంగా వినిపిస్తున్నారు. ఈ నినాదం ఎన్నికలలో ఏమేరకు కనిపిస్తుందో వేచి చూడాల్సిందేనని చెబుతున్నారు. హనుమకొండలో ఇటీవల తీన్మార్ మల్లన్న చేత ఓ బిసి అభ్యర్థి బిసిలను గెలిపించాలని బిసిల యుద్ధభేరి సభను కూడా ఏర్పాటు చేశారు. అయితే బిసి అభ్యర్థులు కూడా ఎక్కువ సంఖ్యలోనే పోటీ చేస్తుండడంతో ఐక్యత లేకుండా పోతున్నదని, ఓట్లు చీలే అవకాశం ఉండడంతో బిసి నినాదం నెరవేరకుండా పోతుందేమోనన్న ఆందోళన కొందరు అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు.

# భూతగాదాల వల్లే రాజలింగమూర్తి హత్య

హత్య కేసు ఛేదించిన పోలీసులు
10 మంది నిందితుల్లో ఏడుగురి అరెస్ట్..
పరారీలో ముగ్గురు
ఏ8 గా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్
కొత్త హరిబాబు
మీడియాకు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే వెల్లడి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన హత్య కేసును పోలీసులు ఛేధించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య కేసులో పది మందిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నాగవెల్లి రాజలింగమూర్తిని హత్య చేసిన ఘటనలో 10 మందిపై కేసు నమోదు కాగా, ఏడుగురు రేణికుంట్ల సంజీవ్ (36), పింగిలి సెమంత్ (22), మోరే కుమార్ (35), కొత్తూరు కిరణ్ (38), రేణికుంట్ల కొమురు(60), దాసరపు కృష్ణ (45), రేణికుంట్ల సాంబయ్య (65)ను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని వెల్లడించారు. అలాగే మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు (44), పుల్ల నరేష్ (32), పుల్ల సురేష్ (35) పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ హత్యకు సహకరించి పరారీలో ఉన్న ముగ్గురిని కూడా అరెస్టు చేయడం జరుగుతుందని అన్నారు. అయితే భూమి విషయంలో తలెత్తిన తగాదాతో నిందితులు రాజలింగమూర్తిని కత్తులు, ఇనుపరాడ్లతో హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడు ఏ1 సంజీవ్‌కు భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఎకరం భూమి విషయంలో తగాదా నడుస్తుంది. మోసపూరితంగా ఆ భూమి నుండి తన పేరు మీదికి కొంత భాగాన్ని రాజలింగమూర్తి అక్రమంగా రాయించుకున్నాడని కక్ష పెంచుకొని, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో తరచుగా రాజలింగమూర్తిని చంపేస్తానని, తన భూమి మనకు దక్కుతుందని చెప్పాడు. అందుకోసం సరైన సమయం కోసం వేచి చూస్తున్నానని తన సమీప బంధువులతో చర్చించాడు. ఈ విషయంలో సహకరిస్తే ఆ భూమి నుండి అందరం పంచుకుందామని ఒప్పందం కుదుర్చుకున్నారు. పథకం ప్రకారం రాజలింగమూర్తిని ఎట్లాగైనా చంపేయాలని దాదాపు రెండు నెలల క్రితం రేణిగుంట్ల సంజీవ్, మోరే కుమారులు ఇద్దరు కలిసి వరంగల్‌లోని కాశిబుగ్గ ప్రాంతంలో రెండు కత్తులు, ఒక రాడు కొనుగోలు చేసి వాటిని తీసుకొచ్చి సంజీవ్ ఇంటిదగ్గర దాచి పెట్టారు. ఈనెల 19న సంజీవ్ కోర్టుకు పేషీకి వెళ్ళగా అక్కడ రాజలింగమూర్తి కనబడ్డాడు. ఈరోజు ఎలాగైనా రాజలింగమూర్తిని చంపుదామని వారికి చెప్పాడు. అందుకోసం దాసారపు కృష్ణ, నరేష్‌లకు రాజలింగమూర్తి కదలికలను గమనించి వెంటవస్తు తమకు సమాచారం ఇవ్వాల్సిందిగా సంజీవ్ వారిని కోరాడు. సంజీవ్, కొత్తూరు కిరణ్, మోరే కుమార్, బబ్లు ఈ నలుగురు ఇంటిదగ్గర దాచిన కత్తులు, రాడు తీసుకొని వచ్చి మృతుని ఇంటి సమీపంలో కాపుకాసి రాజలింగ మూర్తిని భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీ క్రాస్ మీద 19న సాయంత్రం 6.45 గంటల ప్రాంతంలో అంబేద్కర్ సెంటర్, కేర్ మెడికల్ షాప్ నుండి మోటార్ సైకిల్ మీద బయలుదేరి తన ఇంటికి వెళ్తుండగా ఇదే విషయాన్ని దాసారపు కృష్ణ సంజీవ్‌కు మిగతా వాళ్లకు తెలిపాడు. రాజలింగమూర్తి తన ఇంటికి సమీపంలో చేరే టర్నింగ్ వద్దకు రాగానే ఒక్కసారిగా బండికి అడ్డం తిరిగి కళ్ళల్లో కారం చల్లి, అకస్మాత్తుగా దాడి చేసి వారి వెంట తెచ్చుకున్న కత్తులు, ఇనుపరాడుతో విచక్షణా రహితంగా దాడి చేసి, పొట్ట భాగంలో కత్తులతో పొడవడంతో తీవ్ర గాయాలతో రాజలింగమూర్తి అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్పీ వివరించారు. రాజలింగమూర్తి చనిపోయాడని నిర్ధారించుకొని వెంటనే అక్కడ నుండి నలుగురు మోటార్ సైకిల్ పైన పరారు అయ్యారని అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఫైవ్ ఇంక్లైన్ చెక్ పోస్ట్ వద్ద సాయంత్రం అందరూ మాట్లాడుకొంటుంటడగా నమ్మదగిన సమాచారం మేరకు వారందరినీ పట్టుకొని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పేర్కొన్నారు. నిందితుల నుండి నేరానికి ఉపయోగించిన 2 కత్తులు,1 రాడు, 7 మొబైల్‌లు, 5 ద్విచక్ర వాహనాలను రక్తపు మరకల బట్టలను స్వాధీనపరుచుకొని, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేధించిన భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్ నేతృత్వంలో పోలీస్ బృందాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# రేపటి నుంచి 'బయో ఏషియా-2025' సదస్సు

హెచ్ఐసిసిలో రెండు రోజుల సదస్సు
50 దేశాలు.. మూడు వేల మంది ప్రతినిధులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'బయో ఏషియా2025' సదస్సు మంగళ, బుధవారాల్లో హైదరాబాద్ హెచ్ఐసిసిలో జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ప్రతిష్టాత్మకంగా బయో ఏషియా సదస్సు నిర్వహిస్తోంది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసిసి)లో వరుసగా రెండు రోజుల పాటు 22వ ఎడిషన్ సదస్సు కు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ సదస్సుకు 50 దేశాల నుంచి సుమారు మూడు వేల మంది ప్రతినిధులు పాల్గొంటారు. 25వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, క్వీన్స్ ల్యాండ్ గవర్నర్ డాక్టర్ జీనెట్ యంగ్, జి20 షెర్పా అమితాబ్ కాంత్, కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు బయో ఏషియా ప్రారంభోత్సవ వేదికపై ప్రసంగిస్తారు.
ఈ సదస్సు చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన సదస్సుగా నిలుస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రపంచ స్థాయి ఆవిష్కరణలు, ఆలోచనలన్నీ ఒకే వేదికపై పంచుకునే అరుదైన అవకాశాన్ని బయో ఏషియా అందిస్తుందన్నారు. బయో ఏషియా సదస్సుకు కొత్త సార్టప్‌ల నుంచి అంచనాలకు మించిన స్పందన వచ్చిందని పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. పేరొందిన కంపెనీలు, ప్రముఖ సంస్థలు ఈ సదస్సులో భాగస్వామ్యం పంచుకోవటం ఉత్సాహంగా ఉందని అన్నారు. ఆసియాలోనే అతిపెద్ద గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ సదస్సుగా బయో ఏషియా సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన సంస్థల అధిపతులు, సంబంధిత రంగాల్లో నిపుణులు, ఆవిష్కర్తలు ఈ వేదికపై జరిగే చర్చలు, సమావేశాల్లో పాలుపంచుకుంటారు.

**ప్రపంచస్థాయిలో 'హెల్త్ కేర్ ఇన్నోవేషన్ హబ్'గా తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు ఉంది**

వైద్య పరిశోధనలు, బయో టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ ఎక్సలెన్స్లో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో బయో ఏసియా 2025 సదస్సు లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగంలో మరో మైలురాయిగా నిలువనుంది. పరిశ్రమల వృద్ధి, సహకారం, అత్యాధునిక పరిశోధనలను ప్రోత్సహించేందుకు బయో ఏషియా సదస్సు సరికొత్త మార్గదర్శనం అందించనుంది. బయో ఏషియా 2025లో ప్రత్యేకంగా ఇన్నోవేషన్ జోన్ ను ఏర్పాటు చేశారు. కొత్త ఆలోచనలు, కొత్త ఆవిష్కరణలతో రూపొందించిన దాదాపు 700 స్టార్టప్ లు దీనికి దరఖాస్తు చేసుకున్నాయి. వీటిలో ఎంపిక చేసిన 80 స్టార్టప్లను ఈ సదస్సులో ప్రదర్శించేందుకు అవకాశం కల్పించారు. 'ఇన్నోవేషన్ జోన్'లో వీటిని ప్రదర్శిస్తారు. హెల్త్ కేర్ రంగంలో మెడికల్ టెక్నాలజీ, బయో టెక్నాలజీ, డిజిటల్ హెల్త్ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చే లక్ష్యానికి అనుగుణంగా వీటిని ఎంపిక చేశారు. కొత్త స్టార్టప్లకు ప్రపంచ స్థాయి గుర్తింపుతో పాటు, అద్భుతమైన అవకాశాలను ఈ సదస్సు అందించనుంది.

## నేడు మూడు జిల్లాల్లో సిఎం 'పట్టభద్రుల ఎంఎల్‌సి' ఎన్నికల ప్రచారం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం మూడు జిల్లాల్లో ఎన్నికల ప్రచార సభలల్లో పాల్గొననున్నారు. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా సిఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నారు. సిఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సోమవారం ఉదయం 11.30కు నిజామాబాద్ చేరుకుంటారు. అక్కడ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 2 గంటలకు మంచిర్యాలలో జరిగే ప్రచార సభలో సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. సాయంత్రం 4 గంటలకు కరీంనగర్‌కు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించనున్నారు.

## నీరా కేఫ్‌ను 'చాట్ భండార్'లా మార్చారు

మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ధ్వజం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్, నెక్లెస్‌రోడ్‌లోని నీరా కేఫ్‌ను త్వరలోనే ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బిఆర్ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆధునికీకరించిన బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన నీరా కేఫ్ కేంద్రాన్ని ప్రైవేట్‌పరం చేశారని, దీనిని సుల్తాన్‌బజార్ 'చాట్ భండార్' తరహా మార్చారని మండిపడ్డారు. నెక్లెస్ రోడ్‌లోని నీరా కేఫ్‌ను శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు పలువురు ఆదివారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిసి కార్పొరేషన్ ద్వారా రూ.20కోట్లతో గత ప్రభుత్వం నీరా పాలసీ తీసుకొచ్చిందన్నారు. ప్రైవేటు కాంట్రాక్ట్‌కు అప్పగించిన నీరా కేంద్రాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# గిరిజనులకు 'చేవెళ్ల డిక్లరేషన్' అమలుచేయాలి

తెలంగాణ గిరిజన సమాఖ్య డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం గిరిజనుకుల ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ డిమాండ్ చేశారు. గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంజయ్యనాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిజనులు అనేక ఆశలతో ప్రజాపాలనలను తీసుకొచ్చినప్పటికీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం లాగానే కొనసాగడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు ఇచ్చిన హామీలను మాత్రం నెరవేర్చడంలో విఫలమైందన్నారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడలో వైఫల్యం చెందిన కారణంగానే నాటి ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించి నేడు ప్రజాపాలన ప్రభుత్వాన్ని తీసుకువచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా చోద్యం చూడడం సరైన పద్ధతి కాదన్నారు. తక్షణమే గిరిజన సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం చేవెళ్ల డిక్లరేషన్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సమస్యల పట్ల గిరిజన తండాలు గూడెంలో ఉన్న సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా చేవెళ్ల డిక్లరేషన్ అమలు కోసం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని, గత 4 ఏళ్లు నుంచి ట్రైకార్ గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు రుణాలు మంజూరు అయినా సబ్సిడీని విడుదల చేయకపోవడం కొత్త యాక్షన్ ప్లాన్‌ను ప్రకటించకపోవడం వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అదేవిధంగా గిరిజన సంక్షేమ శాఖలో అవినీతిని అరికట్టకపోవడం గిరిజన సంక్షేమ శాఖకు ప్రత్యేక మంత్రిని కూడా ఏర్పాటు చేయకపోవడం తగదని ఆయన పేర్కొన్నారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా స్పందించి గిరిజన సమస్యల పైన తమ యొక్క నిజాయితీని చాటుకొని అభివృద్ధి సంక్షేమ పథకాలను విడుదల చేయాలని కోరారు. లేకపోతే గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు జువారి రమేష్ నాయక్, కల్లూరి వెంకటేశ్వరరావు, ఆర్.శంకర్ నాయక్, వద్యా స్వరూప నాయక్, భుక్య శ్రీనివాస్ నాయక్, దీరావత్ లింగా నాయక్, జర్పుల శివ నాయక్, లావుడియా రమాదేవి, శ్యామల లత, వెంకట్ నాయక్,జగన్ నాయక్, పాల్తియా శీను, రమాదేవి, దస్రు నాయక్, రవీందర్ నాయక్, రాము నాయక్, భానుచందర్‌పాల్గొన్నారు.



## బాలికలు ముందుకు సాగేలా ప్రోత్సహించాలి

ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ ప్యాట్రన్ ఇన్ చీఫ్ ఎం.వేదకుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బాలికలు ఎప్పుడూ ఆత్మన్యూనతకు గురికాకుండా వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న సామర్థ్యాన్ని గుర్తించి ముందుకు సాగేలా ప్రోత్సాహాన్ని అందించాలని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ ప్యాట్రన్ ఇన్ చీఫ్ ఎం.వేదకుమార్ అన్నారు. నిరుపేద బాలికలకు విద్యను అందించడమే లక్ష్యంగా టచ్ ఎ లైఫ్ ఫౌండేషన్ ఎడ్యుకేషన్ ప్రత్యేక క్యాంప్‌ను నిర్వహించింది. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్ట్ గ్రామర్ స్కూల్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఎం.వేదకుమార్, గౌరవ అతిథి బ్రిగేడియర్ ఇందర్ సేథీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.వేదకుమార్ మాట్లాడుతూ కఠోర శ్రమ, అంకితభావంతో తల్లిదండ్రులు గర్వపడేలా చేయాలని సూచించారు. టచ్ ఎ లైఫ్ ఫౌండేషన్ అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని అమ్మాయిలు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు. బ్రిగేడియర్ ఇందర్ సేథీ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమత కోసం ప్రయత్నించాలని, వారి సామర్థ్యాలను విశ్వసించాలన్నారు. 2014లో రీనా హిందోచా, విభూతి జైన్ టచ్ ఎ లైఫ్ ఫౌండేషన్ స్థాపించి హైదరాబాద్‌లోని నిరుపేద బాలికల విద్య, అభ్యున్నతి కోసం దశాబ్దకాలంగా అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది నిర్వహించినఎడ్యుకేషన్ క్యాంప్‌లో 300 మందికి పైగా నిరుపేద బాలికలు పాల్గొని విద్య, కెరీర్ అవకాశాలపై విలువైన అవగాహన కల్పించారు. ఈ ఎడ్యుకేషన్ క్యాంప్‌లో మణికొండ సురేష్ కుమార్, సందెబోయిన అభిషేక్ యాదవ్, సర్ఫరాజ్, నందు, చంద్రేష్, సాయిచైతన్య తదితరులు పాల్గొన్నారు.

# సాహితీ విహారి

# బతుకుబాటను చూపేదే ఎర్ర సాహిత్యం

'సిందూరం, రక్తచందనం,
బంధూకం, సంధ్యారాగం,
పులిచంపిన లేడినెత్తురూ,
ఎగరేసిన ఎర్రజెండా,
రుద్రాలిక నయనజ్వాలిక,
కలకత్తా కాళిక నాలిక

కావాలోయ్ నవకవనానికి' అంటూ కవిత్వ లక్షణాన్ని దాదాపు ఏడున్నర దశాబ్దాల క్రితమే స్పష్టం చేశాడు మహాకవి శ్రీశ్రీ. అప్పటికీ, ఇప్పటికీ... ఎప్పటికీ అదే సిసలైన గీటురాయి. ఎరుపు సాహిత్యమంటే హింసాత్మకమన్న దురభిప్రాయం చాలా మందిలో ఉంది. లేనివారిలోనూ ఈ భయాన్ని కల్పించే కుహనాశక్తులు ఉండనే ఉన్నాయి. అణచివేతను ఎదిరించేది.. దోపిడీని వ్యతిరేకించేది... బానిస శృంఖలాలను తెంచేసేది.. సమవాదానాన్ని, సమన్యాయాన్ని కోరుకునేదే వామపక్ష సాహిత్యం. పేదల తరపున నిలబడి పోరాడేది కమ్యూనిస్టులు కాబట్టే, రాజకీయ వామపక్షం గురించిన అవగాహన పెంపొందించుకోవడానికి కూడా ఇలాంటి సాహిత్యం అత్యవసరం. వాటి ఆధారంగానే ఆలోచనలు మారుతాయి. సమాజం పట్ల స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది. దోపిడీ వర్గాలు చేస్తున్న మోసాలు, నేరాలు, ఘోరాలు తెలుస్తాయి. సమాజానికి మంచి చేస్తున్నట్టు నటిస్తూ, పేదలను పేదలుగానే నొక్కిపెడుతున్న వైనం తెలుస్తుంది. మానవీయ సమానత్వ విలువల కోసం పోరాడే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. వామపక్ష సాహిత్య ప్రమాణిక గ్రంథాలు ఉన్నాయా? అనే ప్రశ్న తరచు వినిపిస్తునే ఉంది. సాహిత్య సమూహాల్లో చక్కర్లు కొడుతునే ఉంది. దీనికి సమాధానం అతి సులభం. ప్రజా సమస్యలపై స్పందించేది... ప్రజల పక్షాన నిలబడేది వామపక్ష సాహిత్యం. కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలు మరోసారి వామపక్ష సాహిత్య అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. పెరుగుతున్న ఆర్థిక అంతరాలను ప్రశ్నించే అక్షరాల గొంతుకలను ఆహ్వానిస్తున్నాయి. మేధోమథనానికి మరోసారి బీజాలు వేస్తున్నాయి. 'అండర్‌స్టాండింగ్ పవర్' వంటి రచనలు చేసిన నవోమ్ చోమ్‌స్కీలు నేటి అవసరం. ఈ సాహిత్యం మాటల రాజ్యంలో విప్లవం రాజేస్తుంది. చీకటికి సవాళ్లు విసురుతుంది. అణచివేత, దోపిడీ శక్తుల భరతం పడుతుంది. అందుకే, సమసమాజం కోసం కలలు కనేవారి పెన్నులు పరుగులు పెట్టాలి. శతాబ్దాల దుర్మార్గపు పోకడలను కూకటివేళ్లతో పెకళించాలి. ప్రతిఘటన ప్రతి ఒక్కరి అభిమతం కావాలంటే, స్వేచ్ఛా కిరణాలు నిరంతరంగా ప్రసరించాలంటే వెనుకబడిన వర్గాలు తిరుగుబాటు బావుటా ఎగరేయాలి. వారికి ఆ స్ఫూర్తినిచ్చేది వామపక్ష సాహిత్యం. ఈ సాహిత్యం నిరాశా తిమిరాలను తరిమికొడుతుంది. భావ దారిద్ర్య గొలుసులను బద్దలు చేస్తుంది. అరాచకాలను సహిస్తూ, అన్యాయాలను భరిస్తూ, జడపదార్థంలా మారిన వారిలో కొత్త ఉద్వేగాన్ని, ఉత్తేజాన్ని నింపి, ప్రగతిబాటలో నడిపిస్తుంది. కలకత్తా వీధుల నుంచి బెర్లిన్ సందుల వరకూ వామపక్ష సాహిత్యం అంతర్గత పోరాటాలను ప్రతిధ్వనిస్తుంది. కార్మికులు, రైతులు, పేదల రోదలను వినిపిస్తుంది. అరాచకవాద సామ్రాజ్యాల పునాదులు కుదిపేస్తుంది. ఈ సాహిత్యం సమతావాయువులను ఆహ్వానిస్తూ ఆలపించే బృందగానం. ఫైజ్ లేదా నెరూడా... అక్షరజ్వాలలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకాలే. తరతరాలకు హక్కుల కోసం పోరాడే జవసత్వాలను అందించే ఆత్మవిశ్వాసపు గుళికలే. సామాన్యులకు హక్కులు.. అణగారిన వారికి గౌరవం కమ్యూనిస్టు సాహిత్య లక్ష్యం. ఇదే ఈ సాహిత్య విధాన లక్షణం. ఒక మాట వంద మెదళ్లను కదిలిస్తుందన్న నానుడికి ఈ రచనలే నిదర్శనం. మొదటి అడుగే మనల్ని గమ్యాన్ని చేరుకునే వరకూ పరుగులు తీయిస్తుందని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు... దౌర్జన్యాలను ప్రతిఘటించే ఎన్నో ఉద్యమాలకు వామపక్ష సాహిత్యమే ఇంధనం. ఈ రచనల ప్రతి అక్షరం విప్లవ స్ఫూర్తిని అందిస్తుంది. సామాన్యుడి బతుకు ఘోషను వివరిస్తుంది. న్యాయం, సమానత్వం, హక్కుల కోసం పోరాడేలా బడుగు వర్గాలను ప్రోత్సహిస్తుంది. కొత్త ఆలోచనలను పునాది వేస్తుంది. మార్పును అన్వేషించడానికి నవీన మార్గాలను అనుసరిస్తుంది. పెట్టుబడిదారీ విధాన వైరుధ్యాలను ఎండగడుతుంది. శ్రమ దోపిడీపై అంతులేని పోరాటానికి బాధితులను సమాయత్తం చేస్తుంది. ఇలాంటి సాహిత్యమే ప్రస్తుతావసరం. మార్క్స్ లేదా ఎంగెల్స్... లెనిన్ లేదా ఆర్వెల్.. దోపిడీ తీరుతెన్నులను వివరించారు. బతుకుబాటను చూపించారు. ఇలాంటి వామపక్ష భావజాల రచనలను సగటు జీవి బతుకుల సంగ్రహావలోకనంగా చూడాలి. 'ది గ్రేప్స్ ఆఫ్ క్రోత్', 'ది జంగిల్' వంటి పుస్తకాలు పోరాటాల అవసరాన్ని, ప్రతిఘటనల తీరుతెన్నులను కళ్లకు కడతాయి. నెరూడా, బ్రెస్ట్, మయకోవ్‌స్కీ తదితరుల కవిత్వంలో న్యాయం కోసం వేసే కేకలు.. పోరాటాల పిలుపులు వినిపిస్తాయి. ధిక్కారం ఈ రచనల తత్వం. గొంతులేని వారి భావాలను దిక్కులు పెక్కటిల్లేలే వినిపించే స్వరం. 'ఎర్ర సాహిత్యం' నిరంతరం దోపిడీని వ్యతిరేకిస్తుంది. శతాబ్దాల దుష్టసంప్రదాయాల యథాతథ స్థితిని సవాలు చేస్తుంది. మార్పును డిమాండ్ చేస్తుంది. అణచివేతకు గురైన శ్రమజీవుల.. బడుగువర్గాల శక్తిని ప్రపంచానికి పరిచయం చేస్తుంది. ఈ సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాలి. జీవితంలో ఎదగాలి. ప్రజలను కొల్లగొట్టడానికి, ప్రజాధనాన్ని కాజేయడానికీ దోపిడి వర్గాలు ఎప్పుడూ ప్రయత్నిస్తునే ఉంటాయి. కొత్తకొత్త రీతులను అన్వేషించి, అమలు చేస్తునే ఉంటాయి. కాబట్టి, వామపక్ష రచనలు కూడా ఎప్పటికప్పుడు కొత్తపుంతలు తొక్కుతుంటాయి. మార్గదర్శనం చేస్తుంటాయి. కొంత మంది రచయితలు ఈ వాదనతో విభేదించవచ్చు... పాఠకుల మనసును హత్తుకునే రచనలు చేయాల్సిన అవరం లేదా? అని ప్రశ్నించవచ్చు. అన్ని రసాలు సాహిత్యంలో ఇమిడిపోవాలని వాదించవచ్చు. నిజమేగానీ, మనిషి మనిషిగా బతకగలిగిన రోజున, మిగతా అంశాలపై దృష్టిపెట్టాలి. స్వేచ్ఛ మృగ్యమై.. బతుకు భారమైనప్పుడు భావకవిత్వ హరివిల్లులు ఎందుకు? అణచివేతతో అల్లాడుతున్నప్పుడు విరహవేదలు ఎవరికి కావాలి? ఖాళీ కడుపులు ఎన్నడూ పద గాంభీర్యాలను.. భావ సౌందర్యాలను అస్వాదించలేవు. అందుకే రచయితలు వాస్తవ పరిస్థితులను గ్రహించాలి. అన్యాయానికి గురైన వర్గాల తరపున నిలమడాలి. నిర్దిష్టమైన పరిస్థితులు.. వాస్తవాలను వివరిస్తూ, బాధితవర్గాల స్వేచ్ఛకోసం కలాలు కదిలించాలి. అన్యాయాలపై అక్షరాల కొరడా ఝుళిపించాలి. కష్టాలను పట్టించుకోని సాహిత్యం కూడా సాహిత్యమా? ప్రజల శ్రేయస్సు కోరని రచనా ఒక రచనేనా?

– సత్యశ్రీ



## సమాజానికి జాయిస్ సవాళ్లు!






సుప్రసిద్ధ ఆంగ్ల రచయిత, 20వ శతాబ్దపు అత్యంత ప్రభావంతమైన రచనలు చేసిన సాహితీవేత్త జేమ్స్ జాయిస్‌ది విలక్షణమైన శైలి. మానవత్వం, మా నవ స్పృహ, గుర్తింపు కోసం ఆరాటం వంటి అంశాలు సమాజానికి సవాళ్లు విసరుతుంటాయి. అత్యంత సంక్లిష్టమైన భాషను ఉపయోగించడం జాయిల్ అలవాటు. అతని రచనలను, ఆలోచనలను అర్థం చేసుకోవడం అ నుకున్నంత సులభం కాదు. అతని రచనల్లో వస్తువు అంతర్లీనంగా ఉండి, పాఠకుడిని లోతుగా ఆలోచింపచేస్తుంది. పాత్రలు కూడా అదే విధంగా ఉంటాయి. సందర్భమే ఉనికిగా జాయిస్ కలం కదిలిపోతుంది. ప్రత్యక్షంగా కనిపించకపోయినా, లోతైన అర్థాన్నిచ్చే ప్రభావవంతమైన కథనాలకు అతని రచనలు ప్రసిద్ధి. అతని నవలల్లో వస్తువుతోపాటు, కథన వైవి ధ్యం కూడా గోచరిస్తుంది. విస్తృతమైన అవగాహనలను ప్రతిధ్వని వినిపిస్తుంది. 1922లో వచ్చిన 'యులిస్సెస్'ను ఇందుకు ఒక ఉదదాహణగా పేర్కోవచ్చు. అందులో కొన్ని సంఘటనలు లేదా పాత్రలు కనిపించవు. అందుకే తరచ వాటి ఉనికిని చాటే ప్రయత్నం జరుగుతుంది. విశ్లేషించిన కొద్దీ అతని రచనల్లోని మాధు ర్యం... ఆలోచనా పొరల్లోని మార్దవత్వం పాఠకుల ముందు కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరిస్తాయి. రోజువారీ జీవితంలో మనకు కనిపిం చే ఎన్నో సాధారణమైన సంఘటనలు అతని రచనల్లో అసాధారణమైనవిగా సాక్షాత్కరిస్తాయి. ప్రతి ఘటన వెనుక ఇంతటి లోతైన అర్థం ఉందా? అని మనల్ని మనమే ప్రశ్నించుకునే పరిస్థితిని కల్పిస్తాడు జాయిస్. అంతేకాదు, అతని రచనల్లో నాటకీయత ఉండదు. పాత్రల ద్వారా ప్రత్యక్ష చర్యలు కూడా కనిపించవు. దీనితో తరచు నవలలో భావోద్వేగం, తాత్విక చింతన బరు వు గోచరిస్తాయి. పాత్రలు వ్యక్తీకరించని భావనలను పాఠకుడే ఊహించుకుంటాయి. జ్ఞాపకాలను నెమరేసుకుంటాడు. భాష పైన కూడా అతను తనంతట తానే పరిమితులు విధించుకోవడం విచిత్రం. 'ఎ పోర్ట్రియట్ ఆఫ్ ది ఆర్టిస్ట్ యాజ్ ఎ యంగ్ మ్యాన్' ((1916), 'ఫిన్నెగాన్స్ వేక్' (1939) తదితర రచనల్లో అతను తర చు కథనాన్ని కొన్ని చోట్ల ఖాళీగా వదిలేస్తాడు. ఆ ఖాళీ అన్నది ఒక పదం కావచ్చు... కొన్ని పదాలు లేదా వాక్యాలు కూడా కావచ్చు. పాఠకులే వారివారి ఆలోచనలను బట్టి, ఊహాశక్తికి అనుగుంంగా ఆ ఖాళీలు పూర్తి చేసుకోవాలి. ఇలాంటి సవాళ్లు విరిసిన రచయితలు బ హుశా మరొకరు ఎవరూ ఉండకపోవచ్చు. ఈ విధంగా ఖాళీలు ఉన్నప్పుడు, పాఠకులే చర్చించుకుంటారు. వ్యాఖ్యానిస్తారు. ఎవరికితోచిన వివరణను వారు ఇచ్చుకుంటారు. రచయిత ఒక అభిప్రాయాన్ని అసంపూర్తిగా విడిచిపెడితే, పాఠకులు అసంఖ్యాకమైన అభిప్రాయాలను తెరపైకి తీసుకొస్తారు. ఈ విస్తారమైన చర్చకు దారితీయాలన్నదే జాయిస్ ఆంతర్యం కావచ్చు. అవుననిగానీ.. కాదనిగానీ చెప్పలేం. ఈ విధానం ఎంతో మం ది రచయితలను, కళాకారులను తీవ్రంగా ప్రభావితం చేసింది. కథన రూపంలో.. వస్తువు ఎంపికలో ప్రయోగాలు చేయాలనే స్ఫూర్తినిచ్చింది. 'కవి నిరంకుశుడు' అనే నానుడి ఎప్పటి నుంచో ఉంది. దానిని రుజువు చేశాడు జాయిస్.

## మతవాదులను భయపెడుతున్న డార్విన్లు.. మోర్గాన్లు


డార్విన్


మోర్గాన్

చార్లెస్ డార్విన్ చెప్పిన జీవపరిణామ క్రమం..... లెవిస్ హెన్రీ మోర్గాన్ వివరించిన పురాతన సమాజ నిర్మాణం... మతవాదులను బెంబేలెత్తించిన రెండు విప్లవాత్మక సిద్ధాంతాలు. వాటి ప్రకంపనలు ఇప్పటికీ కనిపిస్తునే ఉన్నాయి. డార్విన్ సిద్ధాంతాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పాఠ్యపుస్తకాల నుంచి తొలగించడమే ఇందుకు నిదర్శనం. డార్విన్ సిద్ధాంత గ్రంథం 'ఆన్ ది ఆరిజన్ ఆఫ్ స్పెసిస్' మాదిరిగానే మోర్గాన్ రాసిన 'యాన్షియంట్ సొసైటీ' కూడా మతవాదులకు మింగుడు పడడం లేదు. మత విశ్వాసాలకు విరుద్ధంగా ఉన్నాయన్న కారణంగా, ఇలాంటి గ్రంథాలను... సిద్ధాంతాలను వ్యతిరేకించడం ఏ ప్రగతికి నిదర్శనమో వారికే తెలియాలి. నిజాన్ని నిజమని అంగీకరించడానికి విశాల దృక్పథం ఉండాలి. డార్విన్ వాదులను, మోర్గాన్ మద్దతుదారులను ఏదో ఒక రకంగా వేధించగలరేమోగానీ, వాస్తవాలను మరుగునపడవేయడం మతవాదులకు సాధ్యం కాదు. డార్విన్ జీవ పరిణామక్రమం మాదిరిగానే, మోర్గాన్ 'పురాతన సమాజం' (యాన్షియంట్ సొసైటీ' కూడా ఎంతో మందిని ప్రభావితం చేసింది. సత్యాన్వేషణలో ముందడుగు వేయించింది. ఈ పుస్తకంపై కార్ల్ మార్క్స్ రాసుకున్న అభిప్రాయాలు ఆయన మరణానంతరం 'కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యం పుట్టుక' అనే గ్రంథంగా 1884లో ముద్రితమైంది. 1891 'పురాతన సమాజం' గ్రంథానికి ముందు మాట రాసిన ఫెడెరెక్ ఎంగెల్స్ మోర్గాన్ సిద్ధాంతాన్ని సమర్థించాడు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం, మార్క్స్ అదనపు విలువ సిద్ధాంతం ఎంత విలువైనవో, పితృస్వామ్య వ్యవస్థకు ఉందు, మాతృస్వామ్య గణాల ఉనికికి సంబంధించిన మోర్గాన్ పరిశోధనలు కూడా అంతే విలువైనని వ్యాఖ్యానించాడు. మనిషి పుట్టుక, సమాజ తీరుపై అప్పటి వరకూ ఉన్న ఎన్నో అంధ విశ్వాసాలకు డార్విన్, మోర్గాన్ చెక్ పెట్టారు. ముఖ్యంగా మోర్గాన్ సిద్ధాంతం కొన్ని శతాబ్దాలుగా అనుసరిస్తూ వస్తున్న సామాజిక కట్టుబాట్లను సవాలు చేసింది. మతం, కులం, వర్గం తదితర భేదాలతో సమాజాన్ని కొంత మంది ఉద్దేశపూర్వకంగా ఎలా విభజించారో వివరించిది. 'మన మూలాలు ఇవే' అంటూ బల్లగుద్ది మరీ చెప్పింది. అందుకే, మోర్గాన్ సిద్ధాంతమన్నా.. 'పురాతన సమాజం' గ్రంథమన్నా మతవాదులకు అంత ద్వేషం. లక్షల సంవత్సరాలు కొనసాగిన పరిణామ క్రమంలో మనిషి ఆలోచనలు ఏ విధంగా మారుతూ వచ్చాయో మోర్గాన్ తన సిద్ధాంతంలో పేర్కొన్నాడు. అయితే, కొన్ని శతాబ్దాల క్రితం, కొంతమంది స్వార్థంతో తీసుకొచ్చిన సామాజిక కట్టుబాట్లు మనుషులను వారికి బానిసలుగా మార్చింది. ఈ అతి కొది మంది సమూహమే 'పాలక వర్గం' లేదా 'ఆధిపత్య వర్గం' రూపంలో ఇప్పటికీ ఉంది. వారికి వాస్తవాలతో పని లేదు. నిజం తెలుసుకోవాలన్న జిజ్ఞాస అసలే లేదు. మనిషి పరిణామం... పురాతన సమాజ తీరుతెన్నులపై సిద్ధాంతాలను అంగీకరిస్తే, తమ ఆధిపత్యానికి కళ్లెం పడుతుందనే భయం వారిది. మతం పేరుతో దారుణాలు చేస్తూ, మనుషలను మధ్య ద్వేషాలను రగిలిస్తూ పబ్బం గడుపుకొంటున్న పరాన్న జీవులకు తెలిసింది అంతే. వారి ఆలోచనా పరిధి అంతకంటే ముందుకు సాగదు. వారి మెదళ్లు అంతకంటే ఎక్కువ ఆలోచించవు. స్వార్థజీవులు కాబట్టే, వారికి డార్విన్లు... మోర్గాన్లు పడరు.

## పిల్లల నేస్తం ముళ్లపూడి వెంకట రమణ



బాపు బొమ్మను... రమణ (ముళ్లపూడి వెంకట రమ ణ) రాతను ప్రత్యేకంగా పరిచ యం చేయాల్సిన అవసరం లేదు. 1931 జూన్ 28న జన్మించిన రమణ హాస్య కథలకు, బాల సా హిత్యానికీ మారుపేరు. 2011 ఫిబ్రవరి 24న భౌతింగా మన నుంచి దూరమైనప్పటికీ, ఆయన రచనలు ఎప్పుడూ గిలిగింతలు పెడుతునే ఉంటాయి. నవలలు.. కథలు... సినిమా కథలు.. హాస్య కథలు.. ఇలా రమణ కలం ఎన్నో రచనలు పండించింది. ఆయన సృష్టించిన 'బుడుగు' అందరికీ సుపరచితుడే. బాల సాహిత్యంలో ఈ పుస్తకానికి విశిష్టస్థానం ఉంది. బాపుతో కలిసి రమణ సృష్టించిన ఎన్నో సినిమా కథలు బాక్సాఫీసును కొత్తపుంతలు తొక్కించాయి. ఆయన ఆత్మకథ 'కోతి కొమ్మచ్చి' తెలుగునాట వచ్చిన ప్రముఖ రచనల్లో ఒకటి. బాపు మొట్టమొదటి సినిమా 'సాక్షి' నుంచి ఆయనతో కలిసి ప్రయాణం సాగించిన రమణ, 'పంచదార చిలక', 'ముత్యాల ముగ్గు', 'గోరంత దీపం', 'మనవూరి పాండవులు', 'రాజాధిరాజు', 'పెళ్ళిపుస్తకం', 'మిస్టర్ పెళ్ళాం', 'రాధాగోపాలం' తదితర చిత్రాలకు రచయితగా వ్యవహరించారు. చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో, తల్లితో కలిసి మద్రాసుకు తరలివెళ్లిన రమణ, అక్కడ అక్కాబావల వద్ద ఉంటూ, పిఎస్ స్కూల్‌లో 5, 6 తరగతులు పూర్తి చేశారు. అనంతరం రాజమండ్రి చేరుకొని 7,8 తరగతులు వీరేశలింగం హైస్కూల్‌లో, ఎస్ఎస్ఎల్‌సి ఆనర్స్ వరకూ కేసరీ స్కూల్‌లో చదివారు. పాఠశాల విద్యార్థిగానే రచనలు ప్రారంభించిన రమణ రాసిన 'అమ్మ మాట వినకపోతే' అనే కథ 1945లో 'బాల' అనే పత్రికలో ప్రచురితమైంది. అందులోనే 'బాల శతకం' పద్యాలు కూడా అచ్చయ్యాయి. ఆ ఉత్సాహంతోనే 'ఉదయభాను' అనే పత్రిక మొదలు పెట్టారు. ఆ పత్రికకు రమణ ఎడిటర్‌కాగా, చిత్రకారుడు బాపు. విషయ రచయిత మండలీకశాస్త్రి. 1954లో ఆంధ్ర పత్రిక డైలీలో సబ్ ఎడిటర్‌గా చేరారు. ఆ సమయంలోనే 'బుడుగు' రాశారు. రమణ రచనలన్నీ బాపు బొమ్మల కొలువులయ్యాయి. 'బుడుగు'తోపాటు 'ఋణానందలహరి', 'విక్రమార్కుని మార్కు సింహాసనం' వంటి రచనలతో లబ్ధప్రతిష్ఠుడయ్యారు. 'గిరీశం లెక్చర్లు' పేరుతో సినిమాలపై సెటైర్లు విసిరారు. రాజకీయ చదరంగం గురించి 'రాజకీయ బేతాళ పంచవింశతి'లో గొప్పగా వివరించారు. రమణ రచనలు పుస్తకాల రూపంలో వచ్చిన వాటికంటే, వివిధ పత్రికల్లో వచ్చినవే ఎక్కువగా ఉంటాయి. సినిమా కథలు, సంభాషణలు ఉండనే ఉన్నాయి. జీవితాంతం హాస్య రచనల పల్లకిమోసిన రమణ, నిస్సందేహంగా చిన్నపిల్లల నేస్తం. బాల సాహిత్యం గురించి చర్చ వచ్చినప్పుడు మొట్టమొదట ఆయన పేరే వినిపిస్తుంది.




## ఆదర్శవాది కట్టమంచి..



కట్టమంచి రామలింగా రెడ్డి 1880, డిసెంబర్ 10న, సుబ్రహ్మణ్యరెడ్డి, నారాయణమ్మ దంపతులకు జన్మించారు. ఆయనను మించిన ఆదర్శవాదులు చాలా తక్కువ. సిఆర్ రెడ్డిగా అందరికీ సుపరచితులైన కట్టమంచి ప్రతిభావంతుడైన సాహితీవేత్త. విద్యావేత్త. పండితుడు. వక్త. రచయిత. హేతువాది. రాజనీతిజ్ఞుడు. ఒక్కమాటలో చెప్పాలంటే బహుముఖ ప్రతిభాశాలి. బరోడా సంస్థానాధిపతి శాయాజీ రావు గైక్వాడ్ స్ఫూర్తితో అమెరికాలో విద్యాభ్యాసం చేసిన కట్టమంచి, అక్కడినుంచి తిరిగి వచ్చిన తర్వాత బరోడా కళాశాల వైస్‌ప్రిన్సిపాల్‌గా చేరారు. 1909లో మైసూరులో విద్యాశాఖలో చేరి 1918 నుంచి 1921 వరకు విద్యాశాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా వ్యవహరించారు. ఆజన్మబ్రహ్మచారిగా ఉన్న ఆయన, 1951, ఫిబ్రవరి 24న అనారోగ్యంతో మరణించారు. 'కవిత్వతత్వ విచారం', 'అర్థశాస్త్రం', 'ముసలమ్మ మరణము' వంటి రచనలు ఆయనకు ఎనలేని పేరుప్రఖ్యాతులు ఆర్జించిపెట్టాయి. తెలుగు సాహిత్య రంగంలో సరికొత్త ఆలోచనా రీతులను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుంది. కొత్త భావాలకు ఆయన శ్రీకారం చుట్టారు. మనోవికాసం కలిగించే గుణాత్మక విమర్శలకు కట్టమంచికే సాధ్యం. సాహిత్య సృష్టి ఒకవైపు, సాహిత్య విమర్శ మరోవైపు... రెండు రంగాల్లోనూ అసాధారణ ప్రతిభ కనబరిచిన కట్టమంచి, తెలుగు రచనా ప్రపంచాన్ని కొత్తకాంతులతో తీర్చిదిద్దారు. మాటకుమాట చెప్పడం ఆయన అలవాటు. క్షణకాలం కూడా ఆలస్యం చేయకుండా, సంభాషణలతో దెబ్బకు దెబ్బ తీయగల నేర్పు, వాదనా చాతుర్యం ఆయన సొంతం. హాస్య ప్రియత్వం, ఛలోక్తులు, చమత్కార సంభాషణా నైపుణ్యం వంటి లక్షణాలతో అందరినీ ఆకట్టుకునేవారు. 'లఘుపీఠికా సముచ్ఛయం', 'వ్యాసమంజరి', 'పంచమి', 'వేమన' తదితర రచనలు కూడా ఆయనను విలక్షణ సాహితీవేత్తగా నిలబెట్టాయి. ఆయన తెలుగులోనేకాదు... ఆంగ్లంలోనూ ఆయన చేయితిరిగిన రచయితే. 'డ్రామా ఇన్ ద ఈస్ట్ అండ్ వెస్ట్', 'స్పీచస్ ఆన్ యూనివర్శిటీ రిఫార్మ్', 'డెమోక్రసీ ఇన్ కాంటెపరరీ ఇండియా' తదితర ఆంగ్ల రచనలు చేశారు. విమర్శనా విధానాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి, 'విమర్శకాగ్రేసర చక్రవర్తి' అని పేరు తెచ్చుకున్నారు. పింగళి సూరన రచించిన 'కళాపూర్ణోదయం' కావ్యం కట్టమంచికి ఎంతో ఇష్టం. ఆ ప్రబంధం గురించి తాను రాసిన వ్యాసాన్ని తరువాత ఇంకా విస్తరించి 'కవిత్వ తత్త్వ విచారము' అనే గ్రంథంగా వెలువరించారు. బహుశా తెలుగులో ఇదే తొలి సాహిత్య విమర్శ గ్రంథం కావచ్చు. సాహితీ విమర్శలో క్రొత్త మార్గాలకు ఈ రచన మార్గదర్శకమైంది. ఆయన హాస్య చతురత, సమయస్ఫూర్తిని ఎంతోమంది, ఎన్నో సందర్భాల్లో ఉదహరిస్తునే ఉంటారు. భాషలో శ్లేషను, భావాన్ని సందర్భానుసారంగా వాడడంలో అతను దిట్ట. అతిశయానికీ, ఆత్మవిశ్వాసానికీ, సంభాషణా చతురతతో ఇబ్బందికర పరిస్థితులలోంచి తప్పించుకోవడానికీ కట్టమంచి మాటల నైపుణ్యం గొప్పగా ఉపయోగపడేది. ఉదాహరణకు, ఒకసారి పేరుమోసిన వక్తలు పాల్గొన్న, 8 గంటలు సాగిన, సైన్సు గురించిన ఒక ఉపన్యాస కార్యక్రమంలో రెడ్డి జడ్జిగా వ్యవహరించాడు. చివరకు ఆయన అన్న మాటలు.. 'ఈరోజు బోనులో ఉన్నది సైన్సు కాదు. నేను జడ్జినికాను. ఇంత సేపు పడుతుందని తెలియక న్యాయనిర్ణేతగా ఒప్పుకొన్నందున దోషినయ్యాను' అంటూ చురకలు అంటించారు. ఒకసారి మద్రాసు శాసనసభలో తన మిత్రుడైన పానగల్లు రాజాపై వచ్చిన అవిశ్వాస తీర్మానం సందర్భంగా, తన పార్టీ ఆదేశానుసారం కట్టమంచి గంటల తరబడి ఘాటుగా ఉపన్యసించారు. అయితే, తనను గతంలో ప్రశంసిస్తూ ఆయన రాసిన లేఖలను సభలో చూపేందుకు పానగల్లు రాజా ప్రయత్నించారు. ఆ సమయంలో కట్టమంచి స్పందిస్తూ, 'రాజాగారూ.. విడాకుల సమయంలో భార్యాభర్తలు తమ పాత ప్రేమలేఖలు ఎవరివి వాటికి ఇచ్చేయడం ధర్మం' అనడంతో, సభలో నవ్వులు విరిశాయి. ఒక రాజకీయ సభలో ఆయన పాల్గొన్న వేదికపై రాళ్ళు రువ్వినపుడు 'మన జస్టిస్ పార్టీవారు రాజకీయాల్లో రాతి యుగం ప్రవేశపెడుతున్నారు' అని ఘాటుగానే స్పందించారు. ఒకసారి శాసన సభ్యులను ప్రస్తావిస్తూ, 'వీరిలో చాలామంది ముద్ద మింగుటకును, ఆవులించుటకును మాత్రమే నోరు తెరిచెదరు' అంటూ విమర్శించారు. ఇలాంటి ఛలోక్తులు, చురకలు ఎన్నో.. ఎన్నెన్నో.. అన్ని రంగాల్లోనూ ఆరితేరిన కట్టమంచిని ఆయన వర్ధంతి సందర్భంగా తలచుకోవడం ప్రతి తెలుగువాడి విధి.

## ఈ వారం కవితలు

### భైరవులు

కుత్తా హిమాన్ హై
గోధా భేమాన్ హై
అనుకోవడానికి కాలం చెల్లింది....
కలికాలం కళ్ళముందు నాట్యం చేస్తున్నది
మటన్, చికెన్, ఫిష్ షాపులు
వీధి వీధిన వెల్లి విరిసినవి
ఈ దుకాణాల ముందు
జయ విజయులను మించి
గొప్ప ద్వారపాలకులుగా మన భైరవుడు

వాటి పేరు శునకాలు కావు,
గ్రామ సింహాలుగా పేరు ప్రఖ్యాతులు
వీటికి జీతం లేని పోలిసులుగా మరో బిరుదు
ఒకప్పుడు పెంటకుప్పలపై,
ప్రభోజనాల వద్ద దర్శనమిచ్చేవి,
ఏమైన దొరికితే గతికేవి,
విసిరేసిన,ఇస్తార్లను నాకేవి

ఆకాలం పోయింది..,
తన హోదా మారింది
జాగీర్దార్లను మించింది
దరిద్రానికి గుడ్‌బై చెప్పింది
ఇంటి, పంట కాపలాలను వీడింది
మనుషులతో ప్రమేయంలేని రూపమెత్తింది
గ్రామ, నగర,వీధులలో
రారాజు అవతారం దాల్చింది
వీరవిహారం చేస్తూ ఉగ్రంగా గుర్రుమంటుంది
కళ్ళనుండి వేడి నిప్పులను ఎగ చిమ్ముతున్నది
నరులను పిన్న పెద్ద తేడా లేకుండా
చెమడలు తీస్తున్నది
పాలకులను మించిన పాలన సాగిస్తున్నవి
ప్రజలకు చుక్కలు చూపిస్తున్నవి

స్వర్గం చూపించటానికి బాటలు వేస్తున్నవి
భయంకర బద్ధ శత్రువు లైనవి కారణమేమంటే?
మనం తెగ మాంసభక్షణకు
అలవాటు పడినందుకేమో....
అవి కటికవాడు విసిరేసిన మాంసముక్కలు
విరివిగా లభించినందుకేమో......
మనని కుక్కలుగా మార్చి
అవి గ్రామ సింహాలై సంబరపడి పోతుండగా
ప్రభుత్వం కళ్ళు బైర్లు కమ్మినవి
కోర్టులు ఆవులిస్తున్నవి
ఆర్డర్లు సందిస్తున్నవి....
పశువులకు బదులు జంతువులను పెంచుకున్నందుకేమో..... గుర్రాలు గుటుక్కు మన్నవి
కుక్కలు పిక్కలొలుస్తున్నవి

– నమిలి కొండ నాగేశ్వర్ రావు

### చూడు

కదలక కూర్చుంటే
ఏకాగ్రత కుదురు చూడు!
వదలక చదివితే
ఉద్యోగ సిద్ధి చూడు!

ఎంతో ఎత్తుకు ఎదిగివనీ
మిడిసిపడకు
ఎంత ఎదిగిన కాలు
నేలపైనే చూడు!

ఎప్పుడు నీమాటే
చెల్లుబాటవుతుందనుకోకు
వసంతం వదలగ
కోయిల మూగబోవు చూడు!

నిన్ను మించినవాడే లేడనీ
మిడిసిపడకు
పచ్చని వసంత కాలము
దాటి శిశిరము చూడు!

పతనం ఆరంభమైన
తరుణం కనుక్కోలేం
ఎవరు ఒకేసారి కూలిపోరు
కారణాలు చూడు!
ఏ ఊరైన పరాయిదైతే ఏముందిలే
తీరును బట్టి ఊరుంటుంది చూడు!

కుక్కే కదనీ హీనముగా చూడకు
గింత గంజికే ఎంత విశ్వాసమో
చూడు!

ఎప్పుడు తిమిరములోనే వుంటామా
ఒకరోజు వెలుగురేఖ
ప్రసరిస్తుంది చూడు!

గుడిలో జీవములేని
ప్రతిమనీ తేలిక చేయకు
దైవ నమ్మకమిచ్చే ధైర్యము చూడు!
తిట్టే వారంతా నీవారు
కారనుకోకు 'ఆనంద్'
శరత్ ఋతువులో
గ్రీష్మమే హాయి చూడు!

చిదానందం,
8801444335

### మీకు తెలుసా!

ఆంగ్ల భాషలో అతి పొడవైన పదం 'న్యుమోనోమైక్రోస్కోపిక్ సిలికోవోల్కానోకోనియోసిస్' (pneumonoul tramicroscopic silicovolcanoconiosis). ఇందులో 45 అక్షరాలు ఉన్నాయి. ఇది అగ్నిపర్వతాల నుండి వచ్చే సిలికా ధూళిని పీల్చడం వల్ల వచ్చే ఊపిరితిత్తుల వ్యాధి పేరు. ఈ పదం 'న్యుమో' (ఊపిరితిత్తులు), 'మైక్రోస్కోపిక్' (చిన్నది), 'సిలికో' (సిలికాన్),'అగ్నిపర్వతం' (బూడిద మరియు లావాతో కూడిన పర్వతం), 'ఓసిస్' (వైద్య పరిస్థితి) వంటి వ్యక్తిగత అర్థాలతో కూడిన చిన్న పదాలతో రూపొందింది. కాగా, హిప్పోపోటోమోన్‌స్ట్రోసెస్క్విపెడాలియోఫోబియా (Hippopotomonstrosesquip pedaliop hobia) అనే పదంలో 36 అక్షరాలు ఉన్నాయి. 'పొడవైన పదాల పట్ల భయం' అని ఈ పదానికి అర్థం. పొడవైన పదం అంటే భయపడడానికి పొడవైన పదాన్ని ఖాయం చేయడం విచిత్రం.







## ఫ్యామిలీ ప్లానింగ్‌తో తగ్గిన పార్లమెంట్ సీట్లు

### తమిళనాడు సిఎం స్టాలిన్ వెల్లడి

**చెన్నై :** కుటుంబ నియంత్రణ కారణంగా పునర్విభజనలో తమిళనాడు పార్లమెంట్ సీట్లు తగ్గనున్నాయని డిఎంకె అధ్యక్షుడు, సిఎం ఎం.కె.స్టాలిన్ తెలియజేశారు. కుటుంబ నియంత్రణ కారణంగా ఇటీవల తమిళనాడు జనాభా తగ్గింది. దీనితో పునర్విభజనలో పార్లమెంట్ సీట్లు తగ్గే అవకాశం ఉంది. ఈ విషయాన్ని గతంలో స్టాలిన్ ప్రస్తావిస్తూ పునర్విభజనపై ప్రజలు ఆలోచించాలని, 16మంది సంతానం 16 రకాల సంపదలను నెలవన్న తమిళ సూక్తిని గుర్తు తెచ్చుకోవాలన్నారు. ఆదివారం స్టాలిన్ తన కొలతూర్ నియోజకవర్గంలో పార్టీ సీనియర్ కార్యకర్త వివాహం సందర్భంగా తమిళ ప్రజలు తమ పిల్లలకు తమిళ పేర్లను పెట్టుకోవాలని సూచించారు. కుటుంబ నియంత్రణను పాటిస్తూనే ఎంతమంది సంతానాన్ని కనాలనే విషయాన్ని నిర్ణయించుకోవాలన్నారు. తమిళనాడు ప్రస్తుతం 39 లోకసభ సీట్లను కలిగి ఉంది. పునర్విభజనతో సీట్ల తగ్గింపునకు తమిళనాడు ఏమాత్రం సుముఖంగా లేదు.



## మసీదు అలంకరణకు అనుమతి కోరిన యాజమాన్యం

**సంభల్ :** ఉత్తరప్రదేశ్ సంభల్‌లోని షాహి జమ మసీదు పునర్నిర్మాణానికి, అలంకరణకు మసీదు యాజమాన్యం భారత పురావస్తు శాఖ(ఎఎస్ఐ) అనుమతి కోరింది. పవిత్ర రంజాన్ మాసం సమీపిస్తున్నందున మసీదులో కొంత భాగం పునర్నిర్మించడంతో పాటు రంగులవేసి అలంకరించేందుకు అనుమతి ఇవ్వాలని మసీదు యాజమాన్యం కోరింది. నిర్వహణ పనులకోసం అనుమతి ఇవ్వాల్సిందిగా ఎఎస్ఐకు లేఖ రాసినట్టు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు జఫర్ అలి విలేకరులకు తెలిపారు. శతాబ్దాలనుంచి మసీదు నిర్వహణకు ఎఎస్ఐ అనుమతి తీసుకుంటున్నామని, ప్రస్తుత పరిస్థితులలో శాంతిభద్రతల నేపథ్యంలో అనుమతి కోరినట్టు తెలిపారు. ఇప్పటివరకు ఎలాంటి అభ్యంతరాలు ఎదురుకాలేదని చెప్పారు. ఎఎస్ఐ అనుమతి కోరడంపై వివరణ ఇస్తూ తరతరాలుతా కొనసాగుతున్న శుభ్రత, రంగులు వేయడం, అలంకరించడం వంటి అంశాలపై అనుమతి కోసం లేఖ రాసినట్టు తెలిపారు. రంజాన్ వేడుకల నేపథ్యంలో ఎఎస్ఐనుంచి ఎటువంటి అభ్యంతరాలు ఉండవని ఆశాభావం వ్యక్తంచేశారు.

## సినిమాలో అవకాశాలు ఇప్పిస్తానని అత్యాచారం

### నలుగురిపై కేసు నమోదు

**థానే :** సినీ పరిశ్రమలో మంచి నటనా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి మహిళపై (34) పలు మార్లు అత్యాచారం చేసిన వ్యక్తిపై ఇక్కడి పోలీసులు కేసు నమోదు చేసినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. మహారాష్ట్రలోని థానే నగరంలోని మాజివాడ ప్రాంతంలో నివసిస్తున్న షెడ్యూల్డ్ కులానికి చెందిన బాధితురాలిని బెదిరించి బ్లాక్ మెయిల్ చేసినందుకు మరో మహిళ, ఆమె భర్త, వారి కుమార్తెను కూడా ఈ కేసులో నిందితులుగా చేర్చినట్లు వారు తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని పోలీసులు తెలిపారు. నిందిత మహిళ దాదాపు మూడు సంవత్సరాల క్రితం బాధితురాలిని సంప్రదించి, సినీ పరిశ్రమలో ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులతో తనకు సంబంధాలు ఉన్నాయని చెప్పిందని ఇక్కడి కపూర్‌బావడి పోలీస్ స్టేషన్ అధికారి ఒకరు తెలిపారు. పెద్ద స్టార్‌గా చేస్తానని హామీ ఇచ్చిన తర్వాత, బాధితురాలిని ఆ మహిళ సింగపూర్‌కు తీసుకెళ్లింది. అక్కడ ఆమెను ఒక వ్యక్తికి పరిచయం చేసింది. ఆ వ్యక్తి బాధితురాలిని సింగపూర్‌లోని తన ఇంటికి తీసుకెళ్లి ఆమెకు మత్తు పానీయాలు ఇచ్చి అత్యాచారం చేశాడు. వివిధ సందర్భాల్లో ముంబై, ఇతర ప్రదేశాలలోని హోటళ్లలో ఆమెపై అత్యాచారం చేశాడని అధికారి తెలిపారు. నిందితురాలు వాటిని వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించిందని చెప్పారు. నిందితురాలు, ఆమె భర్త, ఆమె కుమార్తె బాధితురాలికి పదేపదే ఫోన్ చేసి, ఆమెను వేధించి, బెదిరించారని పోలీసులు తెలిపారు. నిందితుడు బాధితురాలిని ఆమె కులం పేరుతో కూడా దుర్భాషలాడాడని అధికారి తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా, నలుగురు నిందితులపై అత్యాచారం, క్రిమినల్ బెదిరింపులు, ఇతర అభియోగాలకు సంబంధించిన చట్టపరమైన నిబంధనల కింద, అలాగే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు శనివారం పోలీసులు తెలిపారు. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని వారు తెలిపారు.

# ‘ఎఐ’లో భారత్ పురోగతి

- సైన్స్ అంశాల్లోనూ ముందుంది
- అంతరిక్ష రంగంలో దినదినాభివృద్ధి సాధిస్తోంది
- ‘మన్‌కీ బాత్’లో ప్రధాని నరేంద్రమోదీ



**న్యూఢిల్లీ :** జాతీయ సైన్స్ దినోత్సవం (ఫిబ్రవరి 28న) సందర్భంగా ప్రతి ఒక్కరు పరిశోధన కేంద్రాలు లేదా నక్షత్రశాలలను సందర్శించి సైన్స్‌కు సంబంధించిన అంశాలను తెలుసుకోవాలని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. అంతరిక్షం, సైన్స్ అంశాలతో పాటు భారత్ కృత్రిమ మేధ అంశంలోకూడా పురోగతి సాధిస్తోందని మోదీ పేర్కొన్నారు. మన్‌కీ బాత్ కార్యక్రమం సందర్భంగా మోదీ ఈ విషయం తెలియజేశారు. ఇటీవల తాను పారిస్‌లో కృత్రిమ మేధపై జరిగిన సదస్సులో పాల్గొన్నపుడు మన దేశం ఆ రంగంలో సాధించిన ప్రగతిని ప్రశంసించారని తెలిపారు. బోర్డు పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి వత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలని, తాను ప్రవేశపెట్టిన ‘పరీక్షా పే చర్చ’ కార్యక్రమానికి అన్ని రంగాలనుంచి ప్రశంసలు వస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న చాంపియన్స్ ట్రోఫీతో దేశమంతటా క్రికెట్ వాతావరణం నెలకొన్నదన్నారు. అయితే ఇపుడు క్రికెట్ గురించి కాకుండా అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన సెంచరీ గురించి చెబుతానన్నారు. ఇటీవల ఇస్రో 100వ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిందని, అంతరిక్ష రంగంలో భారత్ దినదినాభివృద్ధి సాధిస్తోందనడానికి ఇది నిదర్శనమన్నారు. అంతరిక్ష ప్రయోగాలలో మన దేశం ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నదని, కానీ మన శాస్త్రవేత్తలు వాటన్నిటినీ దాటుకుంటూ విజయాలు సాధించారన్నారు. రాకెట్ లాంచింగ్ వెహికల్స్ తయారీ, చంద్రయాన్, మంగళయాన్, ఆదిత్య ఎల్–1, ఒకేసారి 104 శాటిలైట్లను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టడం తదితర ప్రయోగాలలో ఇస్రో అవిరళ కృషి ఎనలేనిదన్నారు. గత పదేళ్లలో విదేశీ శాటిలైట్లు సహా మొత్తం 460 శాటిలైట్లను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టామన్నారు. మహిళల తిరుగులేని శక్తిని అందరూ గౌరవించాలని, అందుకు సూచనగా తన సామాజిక ఖాతాలద్వారా పలు రంగాలలో పేరుగాంచిన మహిళల విజయాలను, అనుభవాలను అందజేయనున్నట్టు మోదీ వెల్లడించారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవంనాడు తన ఖాతాలలో వారికి సంబంధించిన సమాచారం వెల్లడించనున్నట్టు తెలిపారు. ఆ మహిళలు తాము సాధించిన ఘనతలను, అనుభవాలను ఆ ఖాతాలలో వివరిస్తారన్నారు. వివిధ రంగాలలో పెరుగుతున్న మహిళల పాత్రను ప్రశంసిస్తూ ప్రతి ఒక్కరూ మహిళల తిరుగులేని శక్తిని గ్రహించాలన్నారు. వివిధ రంగాలలో నిష్ణాతులైన ఏడుగురు మహిళలకు సంబంధించిన సమాచారాన్ని మోదీ తమ సామాజిక ఖాతాలలో అందజేయనున్నారు. అంతరిక్ష రంగంలో ఇటీవల మహిళల పాత్ర పెరగడం గమనార్హమన్నారు. మరోసారి మహిళల పాత్ర గురించి వివరిస్తూ దేశ చరిత్రలో జాతీయ పతాకం ప్రాధాన్యతను వెల్లడించిన హన్స మెహతా గురించి ప్రస్తావించారు. త్రివర్ణ పతాకంలోని కాషాయ రంగు త్యాగానికి ప్రతీక అని, దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహిళల త్యాగానికి గుర్తుగా ఆ రంగును స్వీకరించాన్న అంశాన్ని హన్స మెహతా వెలుగులోకి తెచ్చారన్నారు. దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర విలువైనదని ఆమె చెప్పిన మాటలు నేడు నిజమయ్యాయన్నారు. ఏ రంగాన్ని పరిశీలించినా మహిళల విశిష్ట పాత్ర కనిపిస్తుందన్నారు. మహిళల ఎనలేని శక్తికి గుర్తింపుగా మార్చి 8న తన సామాజిక మాధ్యమాల ఖాతాలను వారికి అంకితం చేస్తున్నానన్నారు. ఈ ప్రక్రియలో పాలుపంచుకోవాలనుకునే మహిళలు తమ అనుభవాలు, అభిప్రాయాలను ‘నమో యాప్’ ద్వారా భాగస్వాములు కావచ్చన్నారు. స్థూలకాయం వల్ల కలిగే దుష్పరిణామాలను మోదీ మరోసారి ప్రస్తావించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే దేశంకూడా దృఢంగా, ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రతి పదిమందిలో ఎనిమిదిమంది స్థూలకాయంతో బాధపడుతున్నారని, గత అయిదేళ్లలో ఇది రెట్టింపు అయిందని పరిశోధనలు చెబుతున్నాయన్నారు. పిల్లలో ఇది నాలుగు రెట్లు పెరగడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ప్రజలు తమ నూనె వాడకాన్ని పది శాతం తగ్గించుకోవాలని, ప్రతి పదిమంది ఇతరులకు ఈ విషయాన్ని తెలపాలని, ఆ పదిమంది మరో పదిమందికి తెలిపితే స్థూలకాయం సమస్యను పరిష్కరించవచ్చన్నారు. ఈ సందర్భంగా ప్రధాని ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా సహా పలువురు ప్రముఖుల ఆడియో సందేశాన్ని వినిపించారు. ప్రధాని మోదీ వన్యప్రాణుల సంక్షరణ ప్రాధాన్యతను కూడా వివరించారు. పలు వన్య ప్రాణులు మన దేవతల వాహనాలని, వాటిని సంరక్షించుకునే సాంప్రదాయం మనదన్నారు. గిరిజన ప్రజలు ఇందులో ముఖ్యపాత్ర పోషిస్తున్నారన్నారు. వారివల్లనే కర్ణాటకలో పులుల సంతతి పెరిగిందన్నారు. గుజరాత్‌లోని గిర్ ఆసియా సింహాల పరిరక్షణ ప్రాంతం ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. మన దేశంలో వైవిధ్యమైన వన్యప్రాణులు ఉన్నాయని, వాటిని పరిరక్షించుకోవడం మన బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా అండమాన్ నికోబార్ దీవులలో ‘డీర్ ఉమన్’గా పేరుగాంచిన అనురాధ రావుగురించి మోదీ ప్రస్తావించడం గమనార్హం.

## ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఆతిశీ



**న్యూఢిల్లీ :** మాజీ ముఖ్యమంత్రి, కల్కాజీ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆతి శీ ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్షనేతగా ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన పార్టీ శాసనసభాపక్షభే టీలో ఆప్ ఎమ్మెల్యేలు ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా బా ధ్యతలు చేపట్టిన తొలి మహిళగా ఆతిశీ ని లిచారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన 22 మంది శాసనసభ్యులతో పాటు ఆప్ సుప్రీం అరవింద్ కేజ్రీవాల్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆప్ ఢిల్లీ యూనిట్ కన్వీనర్ గోపాల్ రా య్ మాట్లాడుతూ ఆప్ ఎమ్మెల్యేల ఏకాభిప్రాయంతోనే ఆతిశీని శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నామన్నారు. తనను ప్రతిపక్ష నేతగా ఎన్నుకున్నందుకు పార్టీ చీఫ్, శాసనసభ్యులందరికీ ఆతిశీ కృతజ్ఞతలు తెలిపారు. ఇక సభలో సభలో బలమైన ప్రతిపక్షం పాత్ర ఏమిటో ఆప్ చూపిస్తుంది. అన్ని సమస్యలను పూర్తి శక్తితో లేవనెత్తుతుంది. ముఖ్యంగా, మార్చి 8 నాటికి నగర మహిళలకు రూ. 2,500 అందిస్తానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. రేఖ గుప్తా నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఈ వాగ్దానాన్ని నెరవేర్చేలా చేస్తామని మేము హామీ ఇస్తున్నాము’ అని ఆతిశీ పేర్కొన్నారు. ఢిల్లీ అసెంబ్లీ తొలి సమావేశం సోమవారం ప్రారంభం కానుంది. మూడు రోజుల సమావేశంలో గత ఆ ప్ ప్రభుత్వ పనితీరుకు వ్యతిరేకంగా పెండింగ్‌లో ఉన్న కాగ్ నివేదికలను సభలో ప్రవేశపెడతామని అధికార బిజెపి ప్రభుత్వం తెలిపింది. కాగ్ నివేదికలను ప్రవేశపెట్టడం గురించి అతిషి మాట్లాడుతూ, ఇది ఒక సాధారణ ప్రక్రియ అని, తాను ఈ నివేదికలను సిఎంగా సభకు పంపానని అన్నారు. కాగా, ఎక్స్‌లో కేజ్రీవాల్ పోస్టు చేస్తూ సభలో ఆప్ నాయకురాలిగా ఎన్నికైనందుకు ఆతిశీని అభినందిస్తున్నానన్నారు. ఢిల్లీ ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఆప్ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఫిబ్రవరి 5న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకు 48 స్థానాలు గెలుచుకుని, ఢిల్లీలో ఆప్‌ను అధికారం నుంచి బిజెపి గద్దె దించింది. కేజ్రీవాల్, మనీష్ సిసోడియా సహా పలువురు పార్టీ అగ్ర నాయకులు ఈ ఎన్నికల్లో ఓడిపోయారు.

## 32 మంది భారత మత్స్యకారులను అరెస్టు చేసిన శ్రీలంక

**కొలంబో :** తమ ప్రాదేశిక జలాల్లో అక్రమంగా చేపల వేట సాగిస్తున్నారన్న ఆరోపణలపై శ్రీలంక అధికారులు ఆదివారం 32 మంది భారత జాలర్లను అరెస్టు చే శారు. ఐదు చేపలు పట్టే పడవలను సీజ్ చేసినట్లు నేవీ తెలిపింది. ఉత్తర మన్నార్ సముద్ర ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యే క ఆపరేషన్‌లో భారత మత్స్యకారులను అరెస్టు చేసినట్లు శ్రీలంక నేవీ ఒక ప్రకనటలో పేర్కొంది. శ్రీలంక జలాల్లో విదేశీ ఫిషింగ్ బోట్ల అక్రమ చేపల వేట పద్ధతులను అరికట్టడానికి నావికాదళం క్రమం తప్పకుండా గస్తీ, కార్యకలాపాలను కొనసాగిస్తుందని, స్థానిక మత్స్యకారుల జీవనోపాధిపై ఆ పద్ధతుల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుంటుందని ఆ ప్రకటన తెలిపింది. అరెస్టు చేసిన మత్స్యకారులను, వారి పడవలను తలైమన్నార్ పీర్‌కు తీసుకువచ్చామని, అక్కడ వారిని చట్టపరమైన చర్యల కోసం మన్నార్ ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగిస్తామని నావికాదళం తెలిపింది. ఈ సంవత్సరం ఇప్పటివరకు శ్రీలంక జలాల్లో వేటాడినందుకు 131 మంది భారతీయ మత్స్యకారులను నేవీ అరెస్టు చేసి, 18 ఫిషింగ్ బోట్లను అ దుపులోకి తీసుకుందని ఆ ప్రకటన తెలిపింది. భారతదేశం, శ్రీలంక మధ్య సం బంధాలలో మత్స్యకారుల సమస్య వివాదాస్పదమైనది. శ్రీలంక నావికాదళ సి బ్బంది పాక్ జలసంధిలో భారత మత్స్యకారులపై కాల్పులు జరిపి, శ్రీలంక ప్రాదేశిక జలాల్లోకి అక్రమంగా ప్రవేశించిన అ నేక సంఘటనలలో వారి పడవలను స్వా ధీనం చేసుకున్నారు. 2024లో శ్రీలంక జలాల్లో వేటాడినందుకు ద్వీప దేశ నావికాదళం 529 మంది భారతీయ మత్స్యకారులను అరెస్టు చేసింది.

## వయనాడ్ బాధిత నిర్వాసితుల నిరసన ప్రదర్శన

### నిరసనకారులను అడ్డుకున్న పోలీసులు, చురాల్‌మలాలో తీవ్ర ఉద్రిక్తత



**వయనాడ్ (కేరళ) :** వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి ప్రకృతి బీభత్సం సృష్టించిన ఘటన(2024సంవత్సరం)లో నిర్వాసితులై ప్రాణాలతో ఉన్న వారికి పునరావాసం కల్పించడంలో తీవ్రజాప్యం జరగడాన్ని ఆక్షేపిస్తూ ప్రదర్శన నిర్వహిస్తున్న నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో హిల్ జిల్లా చురాల్‌మలాలో ఆదివారం ఉదయం ఉద్రిక్తత నెలకొంది. కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో ఉదయం 9గంటలకే ఆందోళనకారులు తాత్కాలిక గుడిసెలు నిర్మించుకోవడంతో నిరసన ప్రారంభమైంది. ఆ తర్వాత నిర్వహించిన ప్రదర్శనను పోలీస్ బృందం చురాల్‌మలాలోని బెయిలీ బ్రిడ్జి వద్ద అడ్డుకుందని టివి ఛానళ్లలో ప్రసారం అయిన దృశ్యాల ద్వారా వెల్లడైంది. ఈ నిరసన ప్రదర్శన జనశబ్దం యాక్షన్ కమిటీ (జెఎస్ఎసి) నాయకత్వంలో నిర్వహించబడింది. కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో నిరసన చేపట్టడానికి పోలీసులు అనుమతించకపోవడంతో నిరసనకారులు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఇదిఇలాఉండగా, పీపుల్స్ యాక్షన్ కమిటీ (జనకీయ యాక్షన్ సమితి) సోమవారం వయనాడ్ కలెక్టరేట్ ముందు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించింది. నిరసనకారులు పునరావాసాన్ని వేగవంతం చేయాలని, కేంద్ర ప్రభుత్వం నుంచి 5 సెంట్లకు పైగా భూమిని వారికి కేటాయించి సమగ్ర ఉపశమన ప్యాకేజీని అందజేయాలని డిమాండ్ చేసింది. నిరసనకారులు అందరూ కొండచరియలు విరిగిపడ్డ చురాల్‌మలా ప్రాంతంలో బైఠాయించి నిరసన చేపడుతున్నారని టివి చానెళ్లు వెల్లడించాయి. చురాల్‌మలా, ముండక్కై కొండచరియలు విరిగిపడ్డ నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెండవ ముసాయిదా జాబితాలో 81కుటుంబాల పేర్లు ఉన్నాయి. కాగా దీంతో పునారావసం పొందుతున్న కుటుంబాల జాబితాలో మొత్తం సంఖ్య 323కు చేరుకుంది. విపత్తు ప్రభావిత ప్రాంతంలో నివాసయోగ్యంగా లేని ఇళ్లను గుర్తించిన వారి జాబితాను అధికారులు ప్రచురించారు. మొదటి దశలో 242కుటుంబాల జాబితాను విడుదల చేసింది. ప్రాణలతో బయటపడిన నిర్వాసితులు నిరసన ప్రకటించిన తర్వాత శనివారం అర్ధరాత్రి ముసాయితా జాబితాను ఖరారు చేసింది.అంతకుముందు కేరళ ప్రభుత్వం కొండచరియలు విరిగిపడి ప్రకృతి బీభత్సం సృష్టించిన ఘటనలో ప్రాణాలతో ఉన్న నిర్వాసితులకు సమగ్ర ఉపశమన ప్యాకేజీని ఆమోదించింది. 2024 జులై 30న వయనాడ్ జిల్లాలోని చురాల్‌మలా, ముండక్కై ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడ్డ ఘటనలో దాదాపు 200మందికి పైగా మరణించగా అనేక మంది క్షతగాత్రులైన విషయం తెలిసిందే. చురాల్‌మలా, ముండక్కై రెండు ప్రాంతాలలో ఇళ్లు అన్నీ దాదాపు తుడిచిపెట్టుకుపోయాయి.

## ఏప్రిల్ 8’9న అహ్మదాబాద్‌లో ఎఐసిసి భేటీ



**న్యూఢిల్లీ :** బిజెపి ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ఎదురయ్యే సవాళ్లు, రాజ్యాంగంపై దాడి, పార్టీ భవిష్యత్తు రోడ్ మ్యాప్‌ను రూపొందించడానికి ఏప్రిల్ 8, 9 తేదీల్లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఎఐసిసి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ఆదివారం ప్రకటించింది. రానున్న సమావేశాలు కీలకమైన చర్చలకు వేదికగా మాత్రమే కాకుండా, సామాన్య ప్రజల ఆందోళనలను పరిష్కరించేందుకు, దేశం కోసం బలమైన ప్రత్యామ్నాయ దృక్పథాన్ని ప్రదర్శించేందుకు కాంగ్రెస్ పార్టీ సమష్టి సంకల్పాన్ని పునరుద్ఘాటించేందుకు కూడా ఉపయోగపడతాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఇన్‌ఛార్జ్ ఆర్గనైజేషన్ కె సి వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ముఖ్యమైన సమావేశం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ఎఐసిసి ప్రతినిధులను ఒకచోట చేర్చి, ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ఎదురయ్యే సవాళ్లు, బిజెపి రాజ్యాంగం, దాని విలువలపై నిరంతరం దాడిపై చర్చించి, పార్టీ భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తుంది అని వేణుగోపాల్ అన్నారు. ఏప్రిల్ 8న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశం 9న ఎఐసిసి ప్రతినిధుల సమావేశం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ రెండు సమావేశాలకు కూడా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షత వహిస్తారని వేణుగోపాల్ చెప్పారు. సమావేశాలకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకురాలు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ ఆఫీస్ బేరర్లు, పార్టీ సీనియర్ నాయకులు, ఇతర ఎఐసిసి ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. 1924 కాంగ్రెస్ సమావేశంలో మహాత్మా గాంధీ అధ్యక్షతన 100వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన బెళగావి నిర్వహించిన సిడబ్ల్యుసి సమావేశంలో (నవ సత్యాగ్రహ బైఠక్) ఆమోదించిన తీర్మానాల కొనసాగింపుగా ఈ ఎఐసిసి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. మహాత్మా గాంధీ, డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ వారసత్వాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడం, రక్షించడం, ప్రోత్సహించడం తక్షణ అవసరాన్ని గుర్తించి, జనవరి 26, 2025, జనవరి 26, 2026 మధ్య, కాంగ్రెస్ సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్ర అనే భారీ ప్రజా ప్రచారాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు వేణుగోపాల్ చేశారు. రాబోయే సమావేశాలు కీలకమైన చర్చలకు వేదికగా మాత్రమే కాకుండా, సామాన్య ప్రజల ఆందోళనలను పరిష్కరించేందుకు, దేశం కోసం బలమైన ప్రత్యామ్నాయ దృక్పథాన్ని ప్రదర్శించేందుకు కాంగ్రెస్ పార్టీ సమష్టి సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తాయని అని ఆయన అన్నారు.

## వారిది బానిస భావజాలం

### ప్రధాని మోదీ మండిపాటు

**న్యూఢిల్లీ :** ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాపై విమర్శలు చేసినవారిపై ప్రధాని మో దీ విరుచుకుపడ్డారు. కుంభమేళాను విమర్శించే వారిది బానిస భావజాలమని, విదేశీ శక్తుల ప్రభావంతో వారు దేశ మత, సాంస్కృతిక కట్టుబాట్లను విమర్శిస్తున్నారని అన్నారు. కుంభమేళా ఐక్యతకు ప్రతీక అని మోదీ అన్నారు. ఆదివారం మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్‌లో శ్రీభాగేశ్వర్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శంకుస్థాపన సందర్భంగా మోదీ మాట్లాడారు. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో ఒక క్యాన్సర్ ఆస్పత్రినికూడా ఏర్పాటు చేయనున్నారు. భాగేశ్వర్ ధామ్ మధ్యప్రదేశ్‌లోని ఒక ప్రముఖ యాత్రా స్థలం. హనుమాన్ భక్తులు వేలాదిగా ఇక్కడకు వస్తుంటారు. ‘ఇటీవలి కాలంలో కొందరు నాయకులు మన మతాన్ని అపహాస్యం చేస్తున్నారు. వారు మన ఐక్యతను చెడగొట్టాలని, ప్రజల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. దేశ ఐక్యతను, మత విశ్వాసాలను దెబ్బతీసేందుకు విదేశీ శక్తులు కూడా వీరికి సహకరించిన సందర్భాలు ఉన్నాయి’ అని మోదీ పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తొక్కిసలాట నేపథ్యంగా కుంభమేళాను మృత్యు మేళాగా పేర్కొన్న సందర్భంగా మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. హిందు మత విశ్వాసాలను వ్యతిరేకించేవారు ముసుగు వేసుకుని శతాబ్దాలుగా ఈ దేశంలో నివసిస్తున్నారన్నారు. అటువంటి బానిస భావజాలం ఉన్నవారు మన విశ్వాసాలపై, ఆలయాలపై, సాధువులపై, సంస్కృతి సంప్రదాయాలపై దాడులు చేస్తున్నారని, మన పండుగలు, సంస్కృతి, విశ్వాసాలను అపహాస్యం చేస్తూనే ఉన్నారని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్గతంగా అభివృద్ధి చెందుతున్న మన సంస్కృతి, సంప్రదాయాలపై బురద చల్లడమే వారి పని అన్నారు. మహా కుంభ మేళా సందర్భంగా డాక్టర్లు, వలంటీర్లు, పారిశుధ్య కార్మికుల సేవలను మోదీ ప్రశంసించారు. వారి సేవలను కుంభమేళాను సందర్శించిన యాత్రికులు కూడా మెచ్చుకున్నారన్నారు. హిందు దార్శనికులు యోగా, సైన్స్ ప్రాముఖ్యతను వెల్లడించారని, ప్రపంచమంతా నేడు యోగాను అనుసరిస్తున్నదని, యోగావల్ల మన దేశ కీర్తి నలుదిశలా వ్యాపించిందన్నారు. ‘సబ్ కా సాథ్ సబ్ కా వికాస్’తోపాటు ‘సబ్ కా ఇలాజ్, సబ్ కా ఆరోగ్య’ సూత్రాన్ని కూడా పాటిస్తానని మోదీ అన్నారు. రానున్న మూడేళ్లలో దేశవ్యాప్తంగా అన్ని జిల్లాలలో క్యాన్సర్ డేకేర్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. దేశ ప్రజలకు సేవ చేసేందుకే తానున్నాని మోదీ తెలిపారు. భాగేశ్వర్ ధామ్ పీఠాధిప ధీరేంద్ర శాస్త్రి సహకారంతో రెండేళ్లో రూ.218 కోట్ల వ్యయంతో క్యాన్సర్ ఆస్పత్రిని నిర్మించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ సిఎం మోహన్ యాదవ్, ధీరేంద్ర శాస్త్రికూడా ప్రసంగించారు.

## భారత్ ఎన్నికలకు అమెరికా ఫండ్

### అక్రమ ‘ముడుపుల పథకం’: ట్రంప్



**వాషింగ్టన్ :** భారత్‌లో ఓటింగ్ శాతం పెంచడంకోసం అమెరికాలో వసూలు చేసే పన్నుల సొమ్మును ఫండ్‌గా ఇవ్వాల్సిన అవసరం లేదని డోనాల్డ్ ట్రంప్ మరోసారి విమర్శించారు. ఇదొక అక్రమ ముడుపుల పథకం(కిక్‌బ్యాక్ స్కీమ్) అని బైడెన్ ప్రభుత్వాన్ని విమర్శించారు. భారత్‌కు ఎన్నికల సహాయం కింద 21 బిలియన్ డాలర్లు బైడెన్ ప్రభుత్వ యంత్రాంగం కేటాయించిందనీ, ఆ సొమ్ము ఇవ్వాల్సిన అవసరం లేదని అన్నారు. యుఎస్‌ఎయిడ్ (అంతర్జాతీయ అభివృద్ధికి అమెరికా సంయుక్త రాష్ట్రాల ఏజన్సీ)పై విమర్శలు చేసిన తర్వాత దాని కొనసాగింపుగా మరోసారి ట్రంప్ భారత్ ప్రస్థావన తీసుకువచ్చి 21 మిలియన్ డాలర్ల కేటాయింపు గురించి ధ్వజమెత్తారు. సిపిఎసి (సంప్రదాయ రాజకీయ కార్యాచరణ సదస్సు)లో ఆయన మాట్లాడుతూ, “ఆ సహాయం భారత్‌కు చేయాల్సిన అవసరం ఏమిటి? మనం ఎందుకు పాత పద్ధతులలో బ్యాలట్ పత్రాల విధానంలోకి మారిపోకూడదు? వారి ఎన్నికలతో మాకు సహాయం చెయ్యనివ్వండి, సరేనా! అలాచేస్తే బాగోదా? వారి ఎన్నికలకోసం మన సొమ్ము అవసరం లేదు” అన్నారు. ఇంతకుముందు కూడా ఒక సమావేశంలో బైడెన్ ప్రభుత్వాన్ని ఇదే విషయంపై దునుమాడుతూ, భారత్‌లో మరెవరినో స్వప్రయోజనాలకోసం గెలిపించడానికి లంచం సొమ్ముగా దీన్ని సమకూర్చినట్లుందని విమర్శలు చేశారు.

అదేవిధంగా బంగ్లాదేశ్‌కు చేస్తున్న యుఎస్‌ఎయిడ్‌ను కూడా తీవ్రంగా తప్పుపట్టారు. గత ప్రభుత్వం బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య రాజకీయ ముఖచిత్రాన్ని అభివృద్ధి చేయడంకోసం 29 మిలియన్ డాలర్లు నిధి కేటాయించింది, మన సహాయంతో వారు సమూలంగా మౌలిక వ్యవస్థలనే మార్చేసేవామపక్ష కమ్యూనిస్టులకు ఓట్లు వేసుకుంటారు” అని విమర్శించారు. ఐతే భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ న్యూఢిల్లీలో శనివారం ఒక కార్యక్రమంలో యుఎస్‌ఎయిడ్ గురించి ప్రస్తావిస్తూ, ఒక మంచి విశ్వాసంతో, విశ్వసనీయ కార్యకలాపాల నిమిత్తం అమెరికా నిధిని భారత్‌లోకి అనుమతించాం, ఐతే భారతదేశంలో ఆ నిధులతో అవిశ్వాల కార్యకలాపాలు జరుగుతున్నాయని అమెరికావారు సూచన చేశారు, వారు చెప్పినదాన్నిబట్టి ఈ విషయాలను ఖచ్చితంగా పరిశీలించాల్సిందే అనిపిస్తోంది, మేం పరిశీలిస్తాం, ఒకవేళ అందులో ఏదైనా తప్పుగనుక ఉంటే, ఎవరు ఇలాంటి అవిశ్వసనీయ కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నారు? అనే విషయాన్ని యావత్ దేశం తెలుసుకోవాలని నేను కోరుకుంటున్నాను” అని ఎస్.జైశంకర్ అన్నారు. అదేవిధంగా ఈ విషయంపై కాంగ్రెస్‌పార్టీ కూడా స్పందిస్తూ, “మీరు మీ ప్రియమైన స్నేహితుడు (ట్రంప్)తో మాట్లాడండి, ఈ ఆరోపణలను తీవ్రంగా తిరస్కరించండి” అని సలహా చెప్పింది. అదేవిధంగా గురువారంనాడు అమెరికాలో జరిగిన రిపబ్లికన్ గవర్నర్ల సంఘం సమావేశంలో కూడా ట్రంప్ మాట్లాడుతూ, భారతదేశానికి 21 మిలియన్ డాలర్లు నిధులు ఓటింగ్ పెంచడంకోసం ఇవ్వడం ఒక అవినీతి పథకమంటూ బైడెన్ ప్రభుత్వంపై విమర్శలు కొనసాగించారు. ఎలాన్ మస్క్ సారథ్యంలో ఉన్న డాడ్జ్ (అమెరికా ప్రభుత్వ సామర్థ్య విభాగం) విభాగ సమావేశంలో కూడా ట్రంప్ మాట్లాడుతూ, అమెరికాలో పన్నుల కింద ప్రజలు చెల్లిస్తున్న సొమ్ము ఈ విధంగా దారి మళ్ళిపోతోందని విమర్శించారు. ఈ నిధుల కేటాయింపును రద్దుచేస్తున్నట్లు ఈనెల 16న డాడ్జ్ ప్రకటించింది.

## విసి, అధ్యాపకులకు జ్యుడిషియల్ కస్టడీ

### పరీక్షలలో అవినీతి చర్యలకు పాల్పడిన నేపథ్యం

**గౌహతి :** పరీక్షలలో అవినీతి చర్యలకు పాల్పడిన నేపథ్యంలో యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మేఘాలయ వైస్ చాన్సలర్ మహబాబుల్ హక్, మరో అయిదుగురు అధ్యాపకులకు జ్యుడిషియల్ కస్టడీ విధించారు. అస్సాంలోని శ్రీభూమి జిల్లాలోని స్థానిక కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి ఆదేశించింది. శనివారం రాత్రి ఆలస్యంగా విచారించిన కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. హక్, పథకండి జిల్లాలోని ఒక విద్యాలయానికి చెందిన అయిదుగురు అధ్యాపకులు పరీక్షలలో కొందరు విద్యార్థులు అక్రమాలకు పాల్పడేందుకు అంగీకరించారన్న ఆరోపణల నేపథ్యంలో నేపథ్యంలో పోలీసులు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. వర్సిటీ విసి ఇఆర్‌డి పేరిట పలు విద్యా సంస్థలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం 12వ తరగతి పరీక్షల సందర్భంగా విసి, అయిదుగురు అధ్యాపకులు అవినీతి చర్యలకు మద్దతు ఇవ్వడంతో ఇతర విద్యార్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను ఏడు రోజుల కస్టడీకి అభ్యర్థించగా, కోర్టు వారిని జ్యుడిషియల్ కస్టడి విధించినట్టు న్యాయవాది ఒకరు తెలిపారు. హక్ అక్రమాలపై సిఎం హిమంత బిశ్వ శర్మ స్పందిస్తూ హక్ అక్రమాలపై గతంలో ఎన్నో ఆరోపణలు వచ్చాయన్నారు. పరీక్షలలో మెరుగైన మార్కులు పొందేందుకు హక్ అవినీతి చర్యలకు పాల్పడినట్టు ఫిర్యాదుల వచ్చాయన్నారు. వైద్య విద్య ప్రవేశ పరీక్షలలోనూ హక్ అక్రమాలకు పాల్పడ్డాడన్నారు. హక్ ఒబిసి సర్టిఫికెట్‌కూడా నకిలీదేనని, అధికారులు దానిని రద్దు చేసినట్టు శర్మ వెల్లడించారు. ఫ్లడ్ జిహాద్‌లో కూడా హక్ హస్తమున్నట్టు వెల్లడైందని సిఎం శర్మ పేర్కొన్నారు.

## డబుల్ న్యుమోనియా... మృత్యువుతో పోరాడుతున్న పోప్ ఫ్రాన్సిస్



**రోమ్ :** కేథలిక్ చర్చ్ అధిపతి పోప్ ఫ్రాన్సిస్ (88) ఆరోగ్యపరిస్థితి విషమంగానే ఉందని వాటికన్‌సిటీ వర్గాలు ఆదివారంనాడు ప్రకటించాయి. గడచిన వారం రోజులుపైగా ఆయన రోమ్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. 88 ఏళ్ళు వయసుగల పోప్ ఫ్రాన్సిస్ డబుల్ న్యుమోనియా కారణంగా మృత్యువుతో పోరాడుతున్నారు. ఊపిరి అందక శ్వాసతీసుకోలేకపోయారు. దీంతో ఆక్సిజన్ సరఫరా పెంచారు. ఐతే ఆయన ఆరోగ్యం విషమంగా ఉన్నప్పటికీ గడచిన రాత్రి ప్రశాంతంగా ఆయన నిద్రపోయారని వాటికన్‌సిటీ ప్రకటించింది. ఈనెల 14న మొదటిసారి ఆయనను ఆసుపత్రిలో చేర్చారు.ఆయన ప్రధానంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. గడచిన 12 సంవత్సరాలుగా ఆయన రోమన్ కేథలిక్ చర్చ్ నాయకుడుగా కొనసాగుతున్నారు. ఇప్పటికి చాలా సార్లు ఆయన ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకున్నారు. ఐతే ఈసారి తాను తిరిగి సజీవంగా వచ్చే అవకాశం లేదని పోప్ గట్టిగా నమ్ముతున్నారట! నిబంధనల ప్రకారంఒక లేఖద్వారా పోప్ తనపదవికి రాజీనామా చేయవచ్చు. ఈ ఏడాది కేథలిక్ చర్చ్ జూబిలీ ఇయర్ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు వాటికన్‌సిటీని సందర్శించనున్నారు. ఈ ఏడాదిలో పోప్‌కు ఊపిరిసలపనంతగా కార్యక్రమాలు ఉంటాయి. ఈ పరిస్థితుల్లో ఆయన అనారోగ్యం విషమస్థితిలో ఉంది. ఆయన కోలుకోవాలని భక్తులు ప్రార్థనలు చేస్తున్నారు. ప్రపంచంలో అతిచిన్న దేశమైన వాటికన్‌సిటీలో పోప్ మరణానంతరం అంత్యక్రియలు ఎలా జరపాలన్న విషయంపై లిఖితపూర్వక కసరత్తు జరుగుతోందన్న వార్తలు వెలువడ్డాయి. సాధారణంగా ఇలాంటి వారికి సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో అంత్యక్రియలు జరుగుతాయి. ఆయన తర్వాత వారసుడు ఎవరన్న విషయం, వారసుడి ఎంపిక చాలా సంక్లిష్టమైన అంశంగా ఉంటుంది.రోమన్ కేథలిక్‌కు చెందిన ఏ పురుషుడైనా పోప్ కావడానికి అర్హుడే. ఆయన స్థానాన్ని ఎవరు భర్తీచేస్తారన్న విషయం అత్యంత ఆసక్తికరంగా మారింది.



## విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

**ప్రజాపక్షం/కోదాడ:** విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీతరామయ్య రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం కోదాడకు వచ్చిన సందర్భంగా వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పెండింగ్‌లో ఉన్న డిఎలు, పిఆర్‌సి, ఆరోగ్య భద్రత పథకం అమలు చేయాలని, విశ్రాంత ఉద్యోగుల సంఘంకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని వారి దృష్టికి తీసుకవెళ్లారు. అదే విధంగా మార్చిలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే పెన్షనర్ల క్రీడా సాంస్కృతిక ఉత్సవాలకు రావాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా స్పందించిన మంత్రి వీలైనంత తొందరలో పెన్షనర్ల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధా న కార్యదర్శి బొల్లు రాంబాబు, వేనేపల్లి శ్రీనివాసరావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** కొంగరకాలన్ ఇండస్ట్రీ ఏరియా హైద్రాబాద్‌లోని ప్రముఖ ఎంఎన్‌సి ఐఫోన్ కంపెనీలోని ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని రుచిత అసోసియేట్ సభ్యులు విజయ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌కెఎల్‌కె డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల లోపు నిరుద్యోగులు యువత పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లమా అర్హులని తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఉద్యోగానికి ఎంపికైన వారికి నెలకు రూ. 15171 వేతనంతో పాటు డ్యూటీలో రెండు సార్లు భోజనం, ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉద్యోగాల నియామకం ఉంటుందని, ఆసక్తిగల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గోడను కూల్చినవారిపై చర్యలు

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** అక్రమంగా తన ఇంటి గోడను కూల్చి సిసిరోడ్డు వేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు దాసరి మైసయ్య కోరారు. ఆదివారం మండలంలోని గ్రామంలోని ఆయన నివాస ప్రహారిగోడను ధ్వంసం చేసిన ప్రదేశంలో మీడియాతో మాట్లాడారు. 2004లో 304 సర్వే నెంబర్ భూమినని కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం చేసుకున్నట్లు తెలిపారు. గత కొంత కాలంగా గ్రామానికి చెందిన కొందమంది వ్యక్తులు తమ ఇంటి గోడను తొలగించి అక్కడ నుండి అక్రమంగా రోడ్డు వేయాలని ప్రయత్నిస్తుంటే అధికారులు, కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. ఈ విషయమై ఎంపిడిఓతో పాటు మండల అధికారులకు కోర్టు నుంచి రోడ్డు వేయవద్దని నోటీసులు సైతం ఇచ్చామన్నారు. అయినా గ్రామానికి చెందిన దాసరి శ్రీను, పోకల వరుణ్, సూరారపు యుగేందర్, దాసరి నర్సయ్య, మేడి లచ్చయ్య, జయమ్మ, పుష్ప, నిర్మల, సుశీలతో పాటు కొంత మంది తాము ఇంట్లో లేని సమయం చూసి గోడను తొలగించి 9ఫీట్ల వెడల్పుతో రోడ్డును పోశారని వాపోయారు. అక్రమ రోడ్డును తొలగించి ఈ చర్యకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోని తనకు న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవద్దని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు.

## మదర్‌డైరీ ఆస్తులు అమ్మడం సరైనది కాదు



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం ఆస్థులను అమ్మి అప్పులు కట్టేందుకు పాలక వర్గం తీర్మానించడం సరైనది కాదని సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రావణ్‌కుమార్ అన్నారు. నల్గొండ జిల్లా చిట్యాల పట్టణ సిపిఐ సమితి సమావేశం ఆదివారం పట్టణంలో జరిగింది. ఈ సమావేశానికి ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాడి రైతులు శ్రమించి లాభాల ద్వారా ఆర్జించిన ఆస్థులను అమ్మడం దారుణమన్నారు. పాలకులు లాభాలను స్వాహా చేయడం కారణంగానే సంఘం నష్టాల ఊబిలోకి వెళ్ళిందని, నష్టాలకు కారకులైన వారిని గుర్తించి వారి నుండి రికవరీ చేసి నష్టాలను పూడ్చాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకుని మదర్‌డైరీకి ప్రత్యేక గ్రాంట్ ఇచ్చి ఆదుకోవాలని శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఎండి అక్బర్, నాయకులు వెంపటి శ్రీనివాస్, దేశగాని బాలరాజు, గుండాల సత్తయ్య, దండిగ నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## మూఢ నమ్మకాల వ్యతిరేక చట్టం చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర ప్రభుత్వం మూఢ నమ్మకాల వ్యతిరేక చట్టం తీసుకురావాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. ఈనెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకోని సైన్స్ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జేవీవీ ఆధ్వర్యంలో పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని విద్యార్థులోని భయాలు, మూఢ నమ్మకాలను తొలగించడానికి సైన్స్ ప్రదర్శనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం సైన్స్ ఇచ్చిన ఒక విప్లవం అన్నారు. ప్రతి రంగంలో సైన్స్ పాత్ర ఎంతో గొప్పదని దాన్ని వినియోగించుకోని విద్యార్థులు సైన్స్ దృక్పదాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కోలా శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గంగాధరి భద్రయ్య, కళాశాల ఇన్‌చార్జి నాగకల్యాణి, కోటేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాల తనిఖీ



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి :** జిల్లాలో టీజీసెట్ 2025 గురుకుల ప్రవేశ పరీక్షల సందర్భంగా నిర్వహించిన పలు పరీక్ష కేంద్రాలను జిల్లా అదదనపు కలెక్టర్ నర్సింగ రావు తనిఖీ చేశారు.ఇటిక్యాల, ఎర్రవల్లిలోని తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల,కళాశాలలో పరీక్షల నిర్వహణ తీరును సమీక్షించి,ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలలో నిబంధనలను,మార్గదర్శకాలను అమలు చేయాలన్నారు.

# కన్నుల పండువగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

### భారీ సంఖ్యలో భక్తులు... ఉత్సవంలో పాల్గొన్న ప్రముఖులు...



**ప్రజాపక్షం/ హాలియా:** గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతి సంవత్సరం చివరి రోజు అయిన ఆదివారం భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కన్నుల పండువగా నిర్వహించారు. వేల సంఖ్యలో పాల్గొన్న భక్తులు చేసిన ఆంజనేయస్వామి స్మరణతో హాలియా మార్మోగి పోయింది. ఈ విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలలో ప్రముఖుల హాజరుతో ఉత్సవాలకు మరింత ఆకర్షణగా మారింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ప్రత్యేక పూజలు తన కుమారులు ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డిలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఈ భక్తాంజనేయ స్వామి ఆలయంతో తనకు ఉన్న అనుభవాలను పంచుకోవడం ఉత్సవాలలో పాల్గొన్న వారికి మరింత ఆసక్తిని కలిగించింది.ఆంజనేయ స్వామి ఆరాధనతో ప్రతి ఒక్కరిలో శక్తి, ధైర్యం, బలం చేకూరుతుందని, వారు రామునికి శిష్యునిగా వజ్ర సంకల్ప బలం కలిగిన వ్యక్తిగా ప్రత్యేకతను చాటుకున్నారని ఆయన అన్నారు. నంది వెలుగు బాలాజీ గురుకుల్ స్వామి, రేపల్లె, సపతి ప్రసాద్ ఆధ్వర్యంలో పూర్ణాహుతి, సంప్రోక్షణ నిర్వహించి అనంతరం స్వామివారి నిజరూప దర్శనం భక్తులకు కలగజేశారు. ఈ ఉత్సవాలలో ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, హనుమాన్ ఉపాసకుడు ఎం.ఎస్ రామారావు మనవడు డాక్టర్ శ్రీనివాస్ స్వామి హనుమాన్ చాలీసా గురించి వివరించారు. సాయంత్రం హాలియా పురవీధుల్లో డప్పు వాయిద్యాలు, కోలాటాల నడుమ స్వామి వారి శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో రామాలయ చైర్మన్ మేడిపల్లి మోహన్ రావు, కార్యనిర్వాహకులు చిట్టిపోల్ యాదగిరి, కాకునూరి నారాయణ గౌడ్, మలిగిరెడ్డి లింగారెడ్డి, తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, బుసిరెడ్డి పాండురంగారెడ్డి, ఎడవల్లి అనుపమ నరేందర్ రెడ్డి, కుందూరు వెంకటరెడ్డి, చింతల చంద్రారెడ్డి, పేలపూడి బాలకృష్ణ, గౌని రాజ రమేష్ యాదవ్, వీరమల శ్రీనివాస్, కుకడపు రమేష్, కార్యదర్శి వర్కాల సుధాకర్ రెడ్డి, కోశాధికారి రేపాల వెంకన్న, వెంపటి శ్రీనివాస్, నిమ్మల లక్ష్మారెడ్డి , చెన్ను వెంకటనారాయణ రెడ్డి, ఆంజనేయ స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శిలాజ ఇంధన పొదుపుతో పర్యావరణ పరిరక్షణ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** శిలాజ ఇంధన పొదుపుతో పర్యావరణ కాలుష్యం తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ సేల్స్ అధికారి దిలీప్‌నాయక్ అన్నారు. కేంద్ర పెట్రోలియం శాఖ ఆదేశాల మేరకు ఇండియన్ గ్యాస్ ఏజెన్సీల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యం కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం అందరు సైకిల్‌ను వినియోగించాలని, సొంత వాహనాలకు బదులుగా వీలైనంత వరకు ప్రజా రవాణా సాధనాలను వినియోగించాలని కోరారు. సైకిల్ ర్యాలి పట్టణంలోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నుంచి సాగర్ రోడ్డు మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో గ్యాస్ డీలర్లు గుంటూరు రామారావు, సీహెచ్.మధు, గ్యాస్ డెలివరి బాయ్స్, సిబ్బంది పాల్గొన్నారు.



# బంగారం దొంగలు అరెస్ట్

### రూ.2 లక్షల 30 వేల బంగారం స్వాధీనం
### శుభకార్యాలయాలకు వెళితే జాగ్రత్తగా ఉండాలి
### హుజూర్‌నగర్ సిఐ చరమంద రాజు




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** వేసవి కాలంలో ఎక్కువగా దొంగతనాలు జరుగుతాయని అందువల్ల ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని హుజూర్‌నగర్ సీఐ జి. చరమంద రాజు అన్నారు. ఇటీవలె వరుస దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదివారం హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి దొంగతనాలకు పాల్పడిన దొంగల వివరాలను సీఐ వెల్లడించారు. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన షేక్. నాగుల్ మీరా,వీసా గోపి అనే ఇద్దరు వ్యక్తులు,నడిగూడెం మండలం సిరిపురం గ్రామానికి చెందిన షేక్. అక్బర్ అనే వ్యక్తి ముగ్గురు కలిసి హుజూర్‌నగర్ పట్టణంలోని దద్దనాల చెరువు సమీపంలోని ఒక ఇంట్లో బంగారు వస్తువులు దొంగిలించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని మఠంపల్లి మండలం సుల్తాన్‌పూర్ తండాలోని ఒక ఇంట్లో కూడా బంగారు వస్తువులు దొంగతనం చేయడం జరిగిందని, రంగంలోకి దిగిన పోలీసులు టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా ఆముగ్గురు దొంగలను పట్టుకోవడం జరిందని సీఐ తెలిపారు. హుజూర్‌నగర్,మఠంపల్లి లలో ఆ ముగ్గురు దొంగలు దొంగతనం చేయబడిన బంగారు వస్తువులైన రెండు వరుసల పుస్తెల తాడు,రెండు ఉంగరాలు,రెండు పుస్తెలు,ఒకజత చెవి కమ్మలు,ఒక లాకెట్‌లను సదరు దొంగల నుండి స్వాధినం చేసుకోవడం జరిగిందని సీఐ వివరించారు. మొత్తం బంగారం నాలుగు తులాల,నాలుగు గ్రాముల,300 మిల్లీ గ్రాముల బంగారం విలువ సుమారు రూ.2,30,000 ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సదరు దొంగలు కోదాడ టౌన్,కోదాడ రూరల్, అనంతగిరి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో కూడా పలు దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. తాళం వేసిఉన్న ఇండ్లనే టార్గెట్‌గా చేసుకుని ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడటం జరుగుతుందన్నారు. అందుకే వేసవి సేలవులలో టూర్‌లు,వివిధ పనుల నిమిత్తం ఊళ్ళకు వెళ్ళేవాళ్ళు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని, ఊరు దాటినా తమకు సమాచారం తెలియజేయాలని అలా చేయడం ద్వారా తమ ఇండ్లల్లో దొంగతనాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా బంగారు అభరణాలు ధరించి శుభకార్యాలయాలకు వెళ్లే మహిళలు తమ బంగారు అభరణాల విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలన్నారు. చాకచక్యంగా దొంగలను పట్టుకున్న మఠంపల్లి ఎస్సై పి.బాబు,ఐడీ పార్టీ సిబ్బంది నాగరాజు,శంభయ్యలను సీఐ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బలరాంరెడ్డి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్‌ను ఢీకొట్టిన పెళ్లి బస్సు: ఒకరు మృతి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పెళ్లికి వెళ్లి వస్తున్న ఓ ప్రైవేట్ బస్సు ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో ఒక మహిళ మృతి చెందగా 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మిర్యాలగూడ పట్టణంలోని అద్దంకి నార్కట్‌పల్లి రహదారిపైత చింతపల్లి బైపాస్ వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నెల్లూరుకు చెందిన పలువురు హైద్రాబాద్‌లో పెళ్లి వేడుకకు హాజరై తిరిగి హైద్రాబాద్ నుంచి నెల్లూరుకు వేగా ట్రావెల్ బస్సులో ప్రయాణమయ్యారు. మిర్యాలగూడ మండలం వాటర్ ట్యాంక్ తండాకు చెందిన నూనె సైదా సునీత దంపతులు పెన్‌పహాడ్ మండల కేంద్రానికి ట్రాక్టర్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలోనే వెనుక నుంచి బస్సు ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్‌పై ప్రయాణం చేస్తున్న నూనావత్ సునీత(40) అక్కడికక్కడే మృతిచెందగా ట్రాక్టర్ డ్రైవర్ నూనావ్ సైదాకు తీవ్ర గాయాలు అయ్యాయి. బస్సులో ప్రయాణం చేస్తున్న నెల్లూరుకు చెందిన ఉమర్, రాజశేఖర్, శైలజ, రాధా, అఖిల, శివరామకృష్ణ, సురేందర్‌రావులతోపాటు బస్సు డ్రైవర్ క్లీనర్లకు గాయాలయ్యాయి. కాగా ట్రాక్టర్ డ్రైవర్ సైదాతోపాటు మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. గాయపడిన వారిని మిర్యాలగూడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సైదా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

## వైద్యం చేయొద్దు అనడం సరైంది కాదు

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** ఐఎంఏ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ వారు ఆర్‌ఎంపీలు వైద్యం చేయొద్దు అని అనడం విడ్డూరంగా ఉందనీ ఆ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి లు అన్నారు. ఆదివారం పట్టణంలోనీ అద్దంకి బైపాస్ రోడ్డులో ఉన్న సుశ్రిత గ్రామీణ వైద్యు ల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో, గూడలలో తండాలలో మారుమూల ప్రాంతానికి వెళ్లి ఆర్‌ఎంపీలుగా వైద్యం అందిస్తూ వారికి ఆరోగ్య సలహాలు ఇస్తున్న మమ్మును ఐ ఎం ఏ, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ వారు ఆర్‌ఎంపీలు వైద్యం చేయొద్దు అని అనడం సరైంది కాదన్నారు. ప్రజా సేవ చేయడంలో ముందుంటామని ఎంతోమంది ప్రాణాలను కాపాడమని భవిష్యత్తులో కాపాడుతామని రాత్రనకా పగలనకా వారు చికిత్స మేరకు ఎప్పుడంటే అప్పుడు వారి గడపని తడతాం అన్నారు. అలాంటి మమ్ములను వైద్యం చేయొద్దు అనడం వారికి సమజసం కాదనీ 428 జీవో కొనసాగించి గత ప్రభుత్వాలు ఆర్‌ఎంపీలుగా శిక్షణ ఇచ్చారని ధ్రువీకరణ పత్రాలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. హనుమంతరావు బ్రహ్మచారి, లింగరాజు గౌడ్ నసిరుద్దీన్ యాదగిరి మునీర్ నరసింహ ఆర్‌ఎంపీలు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తా




ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్లుబెల్లి నర్సిరెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** వరంగల్‌ఖమ్మంనల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు తమకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ, ఎమెల్సీ అభ్యర్థి అల్లుబెల్లి నర్సిరెడ్డి కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టిఎస్‌యుటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో తనను ఎమ్మెల్సీగా గెలిపించిన నాటి నుండి నేటి వరకు శాసన మండలిలో ఉపాధ్యాయుల గొంతుకగా పని చేశానని చెప్పారు. ఉపాధ్యాయులకు 30శాతం ఫిట్‌మెంట్ పిఆర్‌సి సాధించడంతో పాటు కాంట్రాక్టు, ఓట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికి పిఆర్‌సి ప్రకారం 30శాతం వేతనాల ఉపెంచడానికి కృషి చేశానని తెలిపారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలపై సిఎంతో చర్చించి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయించానన్నారు. పాఠశాలల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించేలా ప్రభుత్వాన్ని ఒప్పించినట్లు తెలిపారు. జూనియర్ లెక్చరర్స్ బదిలీలు, కాంట్రాక్ట్ లెక్చర్స్ రెగ్యూలరైజేషన్, గెస్టు లెక్చర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు చెప్పారు. వీటితో పాటు మరెన్నో సమస్యల పరిష్కారానికి తన 6 సంవత్సరాల పదవీకాలంలో పోరాటాలు చేశానని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో విద్యారంగ అభివృద్ధి, అధ్యాపకులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. ఈనెల 27న జరిగే ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు రామనర్సయ్య, పుప్పాల వీరన్న, సిహెచ్ భిక్షం, కె శ్రీనివాస్, జి వెంకటేశ్వర్లు, ఎం పూర్ణచంద్రరావు, ఎన్ సోమయ్య, అనిల్ కుఆర్, జె యాకయ్య, శ్రీనివాస్ రెడ్డి, ఆడం, రమేష్ పాల్గొన్నారు.

## స్వచ్ఛ భారత్ సృష్టి కర్త గాడ్గే బాబా



**ప్రజాపక్షం/ ఎర్రవల్లి :** స్వచ్ఛ భారత్ సృష్టికర్త సంత్ గాడ్గే బాబా జయంతిని ఆదివారం ఎర్రవల్లి మండల కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల సభ్యులు ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు ఆకేపోగు రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కీర్తనలతో మనసుల్ని, మరో వైపు చీపురుతో విధులను శుభ్రం చేసిన మహా బహుజన యోధుడు సంతు గాడ్గే బాబా అని అన్నారు. అంటరాని వారికోసం దేశంలో ధర్మశాల నిర్మించి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కి అప్పగించడం జరిగిందన్నారు. బహుజన్ సమాజ్ పార్టీతోనే సంత్ గాడ్గే బాబా ఆశ యాలను నెరవేరడం జరుగుతుందని సందర్భంగా ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షుడు మణికుమార్, నగేష్, శాంతి రాజు, రామారావు, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

## అడ్డూ అదుపు లేకుండా మద్యం విక్రయాలు

### పట్టించుకోని అధికార యంత్రాంగం

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో అడ్డు అదుపు లేకుండా ప్రతి కిరాణ దుకాణంలో మద్యం విక్రయాలు యదేచ్ఛగా జరుగుతుండడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి. మండల కేంద్రంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు పెరిగిపోవడంతో మందు బాబులకు సమయంతో సంబంధం లేకుండా ఏ సమయంలోనైనా మద్యం దొరకడంతో సామన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంకో పక్కా యదేచ్ఛగా దుకాణాలలో నిషేదిత గుట్కాలు కూడా విక్రయించడం జరుగుతుందని విటన్నింటిని నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వ్యాపారులు ఇదే అదునుగా చేసుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న వైనం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై, నిషేదిత గుట్కాలను విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని మండల వాసులు అధికారులను కోరుతున్నారు.

## ఉపాధ్యాయులు సమాజానికి దిక్సూచీలు



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** మనం ఎంతో మన వాటా అంత కావాలనే నినాదంతో ముందుకు పోదాం అని బహుజనుల ప్రతినిధిగా నిలబడుతున్న పూల రవీందర్ ని గెలిపించి బహుజన వాదాన్ని నిలబెడదామని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చక్ర హరి రామరాజు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపూలే బిసి భవన్ లో బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్ని బిసి కులాల అధ్యక్షులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పూల రవీందర్ ఏ రాజకీయ పార్టీ మద్దతు లేకుండానే బహుజన వాదం మీదనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నారనీ ఈ ఎన్నిక బహుజనవాదానికి ఆధిపత్య కులాలకు మధ్య జరుగుతున్న ఎన్నిక అన్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ గౌరవ అధ్యక్షులు కంది సూర్యనారాయణ కోశాధికారి నల్ల సోమ మల్లన్న సీనియర్ ఉపాధ్యక్షుడు కేశ బోయిన శంకర్ ముదిరాజ్ నకిరేకంటి కాశయ్య గౌడ్ పసుపులేటి సీతారాములు జె ఆది నారాయణ వాసుదేవుల వెంకట నరసయ్య శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల ఆరాధ్య దైవం సేవలాల్



**ప్రజాపక్షం/ హాలియా:** గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ సేవలు నేటి యువతకు ఆదర్శప్రాయమని నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి లు అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం హాలియాలోని చైతన్య ఫంక్షన్ హాల్ లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నగర్ సాగర్ నియోజకవర్గ స్థాయిలో ఉన్న గిరిజన ప్రముఖులు, నాయకులు ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే జై వీర్ రెడ్డిలు మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత ఇస్తుందని తెలిపారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవలాల్ మహారాజ్ గిరిజనుల అభ్యున్నతికి చేసిన సేవలు ఎప్పటికీ మరువలేవని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి,మాజీ సెల్ఫీ నేత కుందూరు జానారెడ్డి, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, స్కైలాబ్ నాయక్, భగవాన్ నాయక్, కేతావత్ బిక్ష నాయక్, ఇస్లావత్ రామచంద్రనాయక్, పాండు నాయక్, భాస్కర్ నాయక్, బాబురావు నాయక్, సర్దార్ నాయక్ పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులు ఇతరులకు ఆదర్శంగా నిలవాలి

**ప్రజాపక్షం/కోదాడ:** ఆర్యవైశ్యులు సామాజిక సేవా కార్యక్రమాల్లో అగ్రభాగన నిలుస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని టిటిడి కళ్యాణ మండపంలో జిల్లా కార్యవర్గ పదవుల నియామకం కోసం ఆర్యవైశ్య సంఘం కోదాడ పట్టణ అధ్యక్షులు పయిడిమర్రి నారాయణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లా కార్యవర్గాన్ని పూర్తి చేసుకుని త్వరలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం భవన నిర్మాణం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పయిడిమర్రి నారాయణరావు, చల్లా శ్రీకాంత్, అశోక్, బొమ్మిడి అశోక్, మాజీ అధ్యక్షులు అనంతరాములు, బండారు రాజా, కుక్కడపు బాబు, సత్యనారాయణ, జగిని ప్రసాద్ పాల్గొన్నారు.



## టిఎన్‌టియుసి నాయకులకు సన్మానం



ప్రజాపక్షం/బూర్గంపాడు: సారపాక సెంటర్‌లో ఆదివారం ఐటిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ఐటిసి ఎన్నికల్లో వరుసగా రెండో సారి గెలిచిన టిఎన్‌టియూసి మిత్రపక్షాల నాయకులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా టిఎన్‌టియూసి రాష్ట్ర నాయకులు పోటు రంగారావు, అధ్యక్షులు కనకమేడల హరిప్రసాద్, జనరల్ సెక్రటరీ గాదె రామకోటిరెడ్డి, ఛైర్మన్ గల్లా నాగభూషయ్య, సెక్రటరీ జనరల్ జీవన్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐటిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కోదండరాంకు మంత్రి పదవి ఇవ్వాలి

ప్రజాపక్షం/బూర్గంపాడు: తెలంగాణ జన సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంఎల్‌సి కోదండరాంకి మంత్రి పదవి ఇవ్వాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టిజెఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మూలా నాగిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మట్లాడుతూ మంత్రి వర్గంలోకి కోదండరాంను తీసుకొని మంత్రి ఇవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని, అదే విధంగా కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలను డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం కోదండరాం ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. తెలంగాణలో అనేక ఉద్యమాలు అనేక పోరాటాలు చేసిన వ్యక్తి, మహనీయుడు కోదండరాంని తెలిపారు.

## నేడు వైరాలో రైతు సంఘ సమావేశం

ప్రజాపక్షం/వైరా : తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా మహాసభలు వైరాలో జరగనున్నాయని ఈ నేపథ్యంలో సన్నాహాక సమావేశం సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు కమ్మ వారి కళ్యాణ మండపంలో జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు లు తెలిపారు. ఈ సమావేశంలో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తదితరులు పాల్గొంటారని వారు తెలిపారు.

## ఒత్తిడికి గురికాకుండా పరీక్ష రాయాలి



ప్రజాపక్షం/పాల్వంచ : విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. నవభారత్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ పాఠశాల్లో ఆదివారం నిర్వహించిన టిజి సెట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. తెలంగాణ గురుకుల విద్యాలయాల్లో 5 నుండి 9 తరగతులకు సంబందించి ఎస్‌సి, ఎస్‌టి, బిసి గురుకులాల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు తాగునీటిని అందుబాటులో ఉంచాలని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 640 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 444 మంది మాత్రమే రాసినట్లు కలెక్టర్ చెప్పారు.

## 8కేజీల గంజాయి పట్టివేత



ప్రజాపక్షం/ మధిర : భువనేశ్వర్ నుండి ముంబై వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తరలిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు మధిర రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించి 8కేజిల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సిఐ జె.రామ్మూర్తి తెలిపారు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నందు తనిఖీలు చేపట్టగా అందులో రెండు బ్యాగులు అనుమానస్పదంగా కన్పించాయని, వాటిని తెరిచి చూడగా అందులో ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు, సుమారు 8 కేజిల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మధిర ఎక్సైజ్ పరిధిలో నాటుసారా, మాదక ద్రవాలకు సంబంధించిన ఎటువంటి సమాచారం తెలిసినా ఎక్సైజ్‌శాఖకు సమాచారం అందించాలని, వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జి.జనార్ధన్‌రెడ్డి, సిబ్బంది ఎస్‌డిరజాలి, ఎస్‌కె.రియాజ్, ఎస్‌కె.ముస్తఫా, బి. నాగరాజు పాల్గొన్నారు.

## కల్లూరు విద్యార్థులకు 'ఆర్‌టిసి' కష్టాలు



ప్రజాపక్షం/కల్లూరు : కల్లూరు మండలం కేంద్రంకు నలు దిక్కుల గ్రామీణ ప్రాంతాల విద్యార్థినీ విద్యార్థుల వారు కల్లూరు మండల కేంద్రంలో ఉన్న పాఠశాలలు, కళాశాలలకు చేరాలంటే ఆర్టీసీ బస్సుల్లో రావాల్సి ఉంది. అయితే ఆర్టిసీ బస్సులు సమయపాలన పాటించనందన ఆర్టీసీ బస్టాండ్‌కు బదులు, కళాశాలలు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండటంవల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం బస్సులు కోసం ఎదురుచూసే సమయంలో నిలిచేందుకు నిలువ నీడ లేనందున తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం సమయంలో, సాయంత్రం సమయంలో రెండు కిలోమీటర్ల మేర విద్యార్థులు నడిచి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం పాత బస్టాండ్‌కు వచ్చి దింపి పోతే మంచిదని లేదా గతంలో అదేవిధంగా మధిర డిపో వారు చేశారని ఇప్పుడు ఎన్నిసార్లు మధిర డిపోకు తెలియపరచిన పెడచెవిన పెడుతున్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు మండల కేంద్రం నుండి మళ్లీ ఇంటికి వెళ్లాలంటే బస్సులు ఫుల్‌గా కిక్కిరిసి ఉండటం వల్ల గృహాలకు వెళ్లలేని పరిస్థితి. ఉదయం, సాయంత్రం సమయాలలో అందరూ ఒకేసారి వెళ్ళటం రావడం వలన ఆధార్ కార్డు అనుమతితో బస్సులు ఫుల్లుగా ఉండటం వల్ల చాలీచాలని బస్సులతో ఇబ్బందులు పడుతున్నట్లు వారు పేర్కొంటున్నారు.

# కార్యదర్శుల వెతలు 'ఇంతింత కాదయా'!

విధులు భారమై సతమతమవుతున్న కార్యదర్శులు

విధులు వదిలి పూర్తిగా సర్వేల పనిలోనే

బదిలీలలో అధికారుల చేతివాటం



ప్రజాపక్షం/ఖమ్మం : గ్రామస్థాయిలో పనిచేసే ఒకే ఒక ఉద్యోగి పంచాయతీ కార్యదర్శి. గతంలో ఉన్న విఆర్‌వోలు, విఏవోలు లేకపోవడంతో ఇప్పుడు పని భారమంతా పంచాయతీ కార్యదర్శులపైనే పడింది. వాస్తవానికి గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్యం, త్రాగునీరు, వీధి దీపాలతో పాటు పన్నులు వసూలు చేయడం, వ్యాపార, నూతన భవనాలకు అనుమతులు ఇవ్వడం వారి విధులు. వాటితో పాటు ఇటీవల కాలంలో జనన, మరణ ధృవపత్రాలు, పెళ్లికి సంబంధించిన ధృవపత్రాలు అందజేయడం అప్పగించారు. ఇంత వరకు బాగానే ఉన్న ఇటీవల కాలంలో ఈజిఎస్, సర్వేలు, లబ్దిదారుల ఎంపిక పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. ఈజిఎస్‌లో పనిచేసే కూలీలకు పనులు అప్పగింత, మస్టర్లు వేయడం, రిజిస్టర్ల నిర్వహణ పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. ఒక్క ఈజిఎస్‌కు సంబంధించి ఏడు రిజిస్టర్లను నిర్వహించాల్సి ఉండగా గ్రామ పంచాయతీకి పరిమితమై మరో ఏడు రిజిస్టర్లను నిర్వహించాల్సి ఉంది. ఇటీవల కాలంలో ఇంటింటి సర్వే, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డు లబ్దిదారుల సర్వేను కూడా గ్రామ పంచాయతీ కార్యదర్శులకే అప్పగించారు. ప్రతి రోజు ఏదో ఒక ఉన్నతాధికారి సమీక్ష నిర్వహించడం ప్రతి రోజు వివిధ సర్వేలు, పన్నుల వసూళ్లు మొదలైన వాటికి నివేదికలు అందజేయడం చేయాల్సి వస్తుంది. రైతు భరోసాకు సంబంధించి కూడా పంచాయతీ కార్యదర్శులకే అప్పగించారు. పంటల సర్వేలోనూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాలు పంచుకోవాల్సి వస్తుంది. ఇటీవల కాలంలో సాగునీరు ఎద్దడి నెలకొన్న నేపథ్యంలో ఆయకట్టు చివరి భూములకు సాగునీటిని అందించేందుకు పంచాయతీ కార్యదర్శులే కృషి చేయాలని అదనపు బాధ్యతను అప్పగించడం కార్యదర్శులకు గోరుచుట్టుపై రోకలి పోటు అన్న చందంగా తయారైంది. చిరుద్యోగి అయిన బాధ్యతలు మాత్రం ఎక్కువగా ఉన్నాయి. కార్యదర్శులకు సంబంధించి ఏ చిన్న తేడా వచ్చిన రకరకాల విచారణల పేరుతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్న ఆవేదన వ్యక్తమవుతుంది. పంచాయతీ కార్యదర్శుల నుంచి మొదలు ఆ శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులతో నేరుగా ఆర్థిక సంబంధాలు కలిగిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు మాత్రం ఇష్టానుసారంగా వ్యవహరించిన పట్టించుకునే నాధుడే లేడ న్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ఫిర్యాదు వస్తే పండుగే :

గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సంబంధించి ఏదైనా ఫిర్యాదు వస్తే ఆ శాఖలోని ఇద్దరు ముగ్గురు అధికారులకు పండగేనట. విచారణ పేరుతో కార్యదర్శులను పీల్చి పిప్పి చేస్తున్నారని వాపోతున్నారు. ఇటీవల ఓ కార్యదర్శి అవినీతి బయటపడిన సందర్భంలో అందాల్సినవి అందడంతో అసలు విషయాన్ని బయటకు పొక్కనివ్వకుండానే చూశారని ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో చేతులు మారాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఫిర్యాదు నిజమా కాదా అన్న విచారణ కంటే ముందే సమర్పించుకోవాల్సి వస్తుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులు ఏ కారణంగానైనా బదిలీ కోరుకుంటే సంబంధిత అధికారులకు పండగేనట. ఇటీవల ఓ పంచాయతీ కార్యదర్శి బదిలీ విషయంలో అరలక్ష రూపాయలు చేతులు మారాయట. దీనికి తోడు విలేకరులకు విషయం ఎలా తెలిసిందన్న ప్రశ్న తరచూ సమావేశాల్లో వినిపిస్తుంది. బయటకు పొక్కకుండా చూసుకోవాలంటూ తగు సూచనలు ఇస్తున్నారట. అత్యంత కీలకమైన ఈ శాఖపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

## రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్




ప్రజాపక్షం/ఖమ్మం : దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సమావేశాలు మార్చి 10 నుంచి 12 వరకు వేములవాడలో జరగనున్నాయని వాటిని జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ కోరారు. ఈ సమావేశాల్లో దళిత హక్కులపై చర్చించి పోరాట కార్యాచరణ రూపొందించుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి సమావేశం జిల్లా కన్వీనర్ వెంగళ ఆనందరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మారుపాక అనిల్‌కుమార్ మాట్లాడుతూ 2014 నుంచి ఇప్పటివరకు బడ్జెట్‌లో దళితులకు కేటాయిస్తున్న అంకెల్లో మార్పులు వస్తున్నాయి కానీ అమలుకు మాత్రం నోచుకోవడం లేదన్నారు. దళితులకు కేటాయించిన బడ్జెట్‌లో సగం కూడా ఖర్చు చేయడం లేదని సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంకెలు పెంచితే దళితులకు ఉపయోగం జరగదని కేటాయించిన నిధులు ఖర్చు చేస్తేనే ప్రయోజనం కలుగుతుందని ఆయన తెలిపారు. ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి దళితులకు కేటాయించిన నిధులను ఖర్చు చేయాలన్నారు. చెవేళ్ల డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. బిజెపి ప్రభుత్వం దళితుల పట్ల కక్ష పూరిత వైఖరితో వ్యవహరిస్తుందని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులకు రక్షణ లేదని అనిల్‌కుమార్ ఆరోపించారు. ఈ సమావేశంలో డిహెచ్‌పిఎస్ నాయకులు యోబు, గోపి తదితరులు పాల్గొన్నారు.

## పోటాపోటీగా ఎమ్మెల్సీ ప్రచారం

ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు

ప్రజాపక్షం/ఖమ్మం : నల్లగొండ వరంగల్ ఖమ్మం ఉపాధ్యాయ శాసన మండలి స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో పోటా పోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మొత్తం 19 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. రెండు ప్రధానమైన యూనియన్లకు సంబంధించి అభ్యర్థులు రంగంలో ఉండగా బిజెపి బలపర్చిన అభ్యర్థితో పాటు బిసి కార్డుతో మరో మాజీ ఎంఎల్‌సి రంగంలో ఉన్నారు. గతంలో ఈ స్థానాన్ని యుటిఎఫ్ బలపర్చిన అలుగుబెల్లి నర్సిరెడ్డి గెలిచారు. మరల ఆయన తిరిగి రంగంలో ఉన్నారు. గతంలో పిఆర్‌టియు నుంచి పోటీ చేసిన పూల రవీందర్‌ను కాదని పిఆర్‌టియు శ్రీపాల్‌రెడ్డిని రంగంలోకి దించింది. హర్షవర్థన్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తుండగా బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సరోత్తమ్‌రెడ్డి కూడా గతంలో పిఆర్‌టియు రాష్ట్ర బాధ్యులుగా పనిచేశారు. పోటీలో ఉన్న ప్రధాన అభ్యర్థుల్లో నలుగురు గతంలో పిఆర్‌టియులో పనిచేసిన వారే. శ్రీపాల్‌రెడ్డి, హర్షవర్థన్‌రెడ్డి, పూల రవీందర్, సరోత్తమ్‌రెడ్డిలు పిఆర్‌టియు బాధ్యులుగా వ్యవహరించారు. సరోత్తమ్‌రెడ్డిని బిజెపి బలపరుస్తుండగా మిగిలిన రాజకీయ పార్టీలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల గురించి అంతగా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. గతంలో పిఆర్‌టియు నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన పూల రవీందర్ ఇప్పుడు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి బిసి కార్డును ఉపయోగిస్తున్నారు. బిసి కుల సంఘాలు పూల రవీందర్‌ను బలపరుస్తున్నాయి. ఉమ్మడి నల్లగొండ వరంగల్ ఖమ్మం జిల్లాలో పిఆర్‌టియు బాధ్యులు బయటపడి పూల రవీందర్‌ను బలపర్చక పోయినప్పటికీ కొంతమేర పిఆర్‌టియు నుంచి ఓటు బదిలీ అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధికంగా 11,355 ఓట్లు ఉండగా తర్వాత స్థానంలో నల్లగొండ జిల్లాలో 8,331, ఖమ్మంజిల్లాలో 6,111 ఓట్లు ఉన్నాయి. అత్యధిక ఓట్లు ఉన్న వరంగల్ జిల్లాపై ప్రధాన అభ్యర్థులు దృష్టిసారించారు. బిజెపి అభ్యర్థికి సంబంధించి పెన్షన్ విధానంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి ప్రతికూల పరిస్థితులను సృష్టిస్తున్నది. ప్రధానమైన పెన్షన్ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఉపాధ్యాయుల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొన్నది. అయినప్పటికీ వరంగల్ జిల్లాలో బిజెపి అభ్యర్థి సర్వోత్తమరెడ్డి కొంత ప్రభావం చూపుతారన్న ప్రచారం జరుగుతుంది. పిఆర్‌టియు యూనియన్ పరంగా బలంగా ఉన్నప్పటికీ గతంలో పిఆర్‌టియులో పనిచేసిన పలువురు బరిలో నిలవడంతో పిఆర్‌టియు ఓటును బరిలో ఉన్న అభ్యర్థులు ఎంత మేరకు చీలుస్తారన్న దానిపై ఫలితం ఆధారపడి ఉంటుందన్న ప్రచారం జరుగుతుంది.

పిఆర్‌టియు మాత్రం ఒకరిద్దరు వ్యక్తులుగానే ఇతరులకు మద్దతునిస్తున్నారని సంఘం మొత్తం శ్రీపాల్‌రెడ్డికి దన్నుగా నిలిచిందని ప్రచారం జరుగుతుంది. యుటిఎఫ్ సంస్థాగత నిర్మాణమే అలుగుబెల్లి నర్సిరెడ్డికి ప్రధాన మద్దతు. అరమరికలు లేకుండా యుటిఎఫ్ నాయకులు తమ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తున్నారు. అధికార యంత్రాంగం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఖమ్మం జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకునేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని అధికార యంత్రాంగం తెలిపింది. ఖమ్మంజిల్లాలో 4,089 ఓట్లు ఉండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,022 ఓట్లు ఉన్నాయి. ఈ నెల 27న ఎన్నికలు జరగనుండగా ఓట్ల లెక్కింపు మార్చి మూడున జరగనుంది. మరో మూడు నాలుగు రోజులు అవకాశం ఉండడంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు అన్ని ప్రయత్నాలు చేసే అవకాశం ఉంది.

## పరీక్షలంటే భయమొద్దు




ప్రజాపక్షం/భద్రాచలం : పరీక్షలంటే భయం వద్దని, హాయిగా సంతోషంగా, ధైర్యంగా రాసి మంచి మార్కులు సాధించుకోవాలని గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు మణెమ్మ అన్నారు. ఆదివారం ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా ప్రోత్సహాక పరీక్ష కేంద్రం ఏజిహెచ్‌ఎస్ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డిడి మాట్లాడుతూ మీలో దాగున్న నేపుణ్యాలను, ప్రతిభను వెలికి తీసి నిర్భయంగా పరీక్షలు రాసి ఉత్తమ ర్యాంకులు తెచ్చుకుని మంచిపేరు సంపాదించాలన్నారు. ఈ పరీక్షలు పదో తరగతి తర్వాత, రాసే కాంపిటేషన్ పరీక్షలు జేఇఇ, నీట్, ఎంసెట్ రాయడానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. పరీక్షా కేంద్రంలోని పిల్లలకు ఎవరు సహకరించవద్దని, వారి సొంతగానే పరీక్షను రాసేలా చూడాలన్నారు. గ్రూప్ పరీక్షలు ఏ విధంగా ప్రకడ్బందీగా నిర్వహిస్తారో ఆ విధంగా చూడాలని ఆదేశించారు. అనంతరం పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గురుకుల ఆర్‌సిఓ నాగార్జున రావు మాట్లాడుతూ పరీక్షా హాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లరాదని, పిల్లలకు వచ్చే సందేహాలను తీర్చరాదని, వేరే పాఠశాల నుండి వచ్చిన విద్యార్థుల టీచర్లు ఎవ్వరూ పరీక్షా హాల్లోనికి రావద్దని, ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుభద్ర, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ పట్టణంలో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటి సిఎం మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర మంత్రులు అందరూ అభివృద్ధి సంక్షేమంతో పాటు పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం మండల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకి శాలువతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్, కల్లూరు ఎఎంసి చైర్మన్ బాగం నీరజ చౌదరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.



**దేవాలయ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే**

తల్లాడ మండలం పాత పినపాక గ్రామంలో శ్రీశ్రీశ్రీ సోమలింగేశ్వరస్వామి దేవాలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ఆదివారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పార్టీ ముఖ్య నాయకులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా పాత పినపాక గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం శ్రీను ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, పినపాక గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు న్యాయం చేయండి

కూసుమంచిలో ఘనంగా ఉద్యమకారుల సమావేశం



ప్రజాపక్షం/కూసుమంచి :తెలంగాణ ప్రజల ఆకాంక్ష, ఉద్యమకారుల త్యాగాలు, బలిదానాల పునాదులపై ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రాన్ని గతంలో పాలించిన బీఆర్‌ఎస్ పార్టీ ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం చేసిందని, ఇప్పుడు పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు అండగా ఉండాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య కోరారు. కూసుమంచి మండల కేంద్రంలోని ఎస్ఆర్ బ్రదర్స్ ఫంక్షన్‌హాల్‌లో ఉద్యమకారుల జేఏసీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ, మిగులు బడ్జెట్‌గా ఉండే తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చడమే కాకుండా తెలంగాణ ద్రోహులను అందలమెక్కించి, ఒక నియంతగా అప్రజాస్వామిక ధోరణిలో మాజీ సీఎం కేసీఆర్, టిఆర్ఎస్ పరిపాలనను ఉందన్నారు. మేనిఫెస్టోలో పలు హామీలు గుప్పించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి 15 మాసాలు దాటిన పూర్తిస్థాయిలో హామీల అమలుకు ప్రయత్నాలు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికీ సమయం మించిపోలేదని, తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడమే కాకుండా వారికి ఇస్తామన్న 250 గజాల స్థలాన్ని, పెన్షన్లను పంపిణీ చేసేందుకు వెంటనే కార్యాచరణ ప్రణాళిక ఏర్పాటుకు, అదేవిధంగా దీనిపై టైం బాండ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు అంశంపై గత 15 మాసాలుగా ఎలాంటి కార్యాచరణ ప్రారంభించకపోవడంపై తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు తెలంగాణ ఉద్యమకారులు శ్రీకారం చుట్టే పరిస్థితిని కల్పించకపోవడమే కాంగ్రెస్ పార్టీకి మంచిదని హితవు పలికారు. అనంతరం పమ్మి రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటాపాటా అందర్నీ అలరించింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ రామిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కోతి మాధవి రెడ్డి, రాష్ట్ర నాయకులు అన్వర్ పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు తుల్జా రెడ్డి, డిజిటల్ మీడియా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, రాష్ట్ర కోశాధికారి చంద్రన్న ప్రసాద్, కళాబృందం రాష్ట్ర నాయకులు పాలకుర్తి కృష్ణ, అంబాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని చెట్లు కనుమరుగు

ప్రజాపక్షం/వైరా : వైరా మున్సిపాలిటీ పరిధిలోని పల్లిపాడు సమీపంలో ఉన్న నేషనల్ హైవేపై రోడ్డు ప్రక్కన ఉన్న చెట్లకు పూర్తిగా రక్షణ లేకుండా పోయింది. ఎంతోమందికి చల్లని నీడనందించే పచ్చని చెట్లను రోజు రోజుకు నరికి వేస్తున్నారు. పల్లిపాడు సమీపంలో పల్లిపాడు, కొణిజర్ల మధ్య ఉన్న రోడ్లకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లు వేసవికాలం ఎంతోమందికి స్వేదనిస్తున్నాయి. అలాంటి చెట్లు రోజురోజుకు కనుమరుగవుతున్నాయి. ఇటీవల బంకు నిర్మాణం కోసం అడ్డు వచ్చిన చెట్లను సైతం తొలగించి వేశారు. ఆదివారం మరల చెట్లను నరకడం ప్రారంభించారు. అధికారులు కేవలం చెట్లు నరికిన తర్వాత వచ్చి ఆ చెట్లు నరికిన విషయాన్ని ఎవరైనా చెబితే తెలుసుకున్న తర్వాత ఫైన్ వేయడం జరుగుతుంది. తప్ప పూర్తిస్థాయిలో పచ్చని నీడనిచ్చే చెట్లను ఎందుకు నరుకుతున్నారు అని వారిపై ఎక్కడ చర్యలు తీసుకోవడం గాని కేసులు పెట్టడం గాని చర్య లేదు. చెట్లు నరుకుతున్న వారిని ఫైన్‌లు వేసుకుంటూ పోతే చివరికి ఒక పచ్చని చెట్టు కూడా మిగలదు.

## బేతుపల్లి చేపల సొసైటీలో లుకలుకలు!

నాలుగేళ్లుగా పైసా ఆదాయం లేదటా..?

గత సంవత్సరం రూ. 60 లక్షలు చేపలు అమ్మినా నగదు డిసిసిబిలో జమ కాలేదని ఆరోపణలు





ప్రజాపక్షం/సత్తుపల్లి : కోట్ల టర్నోవర్ కలిగిన బేతుపల్లి గంగారం చేపల చెరువు సొసైటీలో అక్రమాలు బట్టబయలవుతున్నాయి. మూడు సంవత్సరాల క్రితం నూతన కమిటీ ఏర్పడిన నాటి నుండి ఖర్చు తప్ప ఆదాయం లేదంటూ సొసైటీలోని కొందరు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తుండడంతో లుకలుకలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. రూపాయి ఆదాయం రాలేదంటూ కమిటీ బాధ్యులు లెక్కలు చూపుతున్నట్లు, అలుగు పారి చేపలు మొత్తం వెళ్ళిపోయినట్లు సొసైటీ వారు లెక్కలలో చూపుతున్నారనే గుస,గుసలు వినిపిస్తున్నాయి. గత మూడు సంవత్సరాలుగా ఖర్చు తప్ప పైసా ఆదాయం లేదని, వరదలతో నష్టాలు వస్తున్నాయని కాకి లెక్కలు చూపుతూ అవకతవకలకు పాల్పడుతున్నారని ఇదెక్కడి చోద్యమంటూ సొసైటీలోని కొందరు తలలు పట్టుకుంటున్నారు. బేతుపల్లి చెరువుకు 1970 నుండి అలుగు పారుతుందని, ఈ చెరువుకు చుట్టుపక్కల ఉన్న పది చెరువుల నుండి వరద నీరు ప్రవహిస్తుందని, ఒక్క చెరువులో చేపలు పోతే మరి పది చెరువుల నుండి వస్తున్న చేపలు ఏమవుతున్నాయని సొసైటీలోని బాధ్యులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. 18 సంవత్సరాలుగా పోనీ చేపలు, ఈ మూడు సంవత్సరాల్లోనే బయటకు ఏ విధంగా పోతున్నాయని ప్రశ్నిస్తున్నారు. 350 మంది సభ్యులు ఉన్న ఈ సొసైటీలో చాలామందికి వలలు విసరటం కూడా రాదని, మత్స్య శాఖ ఏడి అండతోనే కొందరు అక్రమాలకు తరలేపుతున్నారని విమర్శిస్తున్నారు. గత సంవత్సరం సుమారు రూ.50 నుండి 60 లక్షల చేపలు అమ్మకాలు జరిగాయని, అంత పెద్ద మొత్తంలో అమ్మకాలు జరిగిన డిసిసిబి బ్యాంకులో గల ఖాతాలో నగదు జమ చేయాల్సి ఉన్న నగదు జమ కాలేదని, ఈనెల 20న చేపలు పట్టి అమ్మకాలు జరిపారని ఆ నగదు కూడా ఖాతాలో జమ చేయలేదని, కనీసం సొసైటీలోని సభ్యులతో సమావేశం కూడా ఏర్పాటు చేసి ఆదాయం ఖర్చుకు సంబంధించిన వివరాలు తెలపలేదని సొసైటీలను సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు చేపలు కొనేందుకు చెరువు వద్దకు వెళితే సొసైటీలోని కొందరు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, బేతుపల్లి చెరువు ఆయకట్టు చుట్టుపక్కల రైతులకు, గ్రామాలలోని ప్రజలకు సైతం చేపలు అమ్మకుండా, గంటల తరబడి నిలబెడుతూ, బయటకు అమ్ముతున్నారని రైతులు, ప్రజలు మండిపడుతున్నారు. తక్షణమే బేతుపల్లి చెరువు సొసైటీపై జిల్లా అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఫోకస్

# ఆరోగ్యం



## కేన్సర్ చికిత్సలో కొరియా కొత్తపుంతలు

అత్యంత అరుదైన సందర్భాల్లో తప్ప నయంకాని వ్యాధిగా పేర్కొనే కేన్సర్‌కు ఉత్తమ చికిత్స అందించడంలో దక్షిణ కొరియా వినూత్న ప్రయోగాలతో కొత్త పుంతలు తొక్కుతున్నది. ప్రొఫెసర్ క్యాంగ్‌హ్యూన్ చో నేతృత్వంలో, కొరియా అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ టెక్నాలజీ (కెఎఐఎస్‌టి) శాస్త్రవేత్తలు కేన్సర్ కణాలను నాశనం చేయకుండా, వాటిని ఆరోగ్యకరమైన కణాలుగా



మార్చే ప్రక్రియను అభివృద్ధి చేస్తున్నారు. సాధారణంగా కేన్సర్ కణాలను కిమోథెరపీ ద్వారా నాశనం చేస్తారు. ఆ సమయంలో, చుట్టుపక్కల ఉన్న ఆరోగ్యకరమైన కణాలు కూడా నశిస్తాయి. ఈ సమస్యను అధిగమించడంపై కెఎఐఎస్‌టి శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. పెద్దపేగు కేన్సర్ కణాలను నాశనం చేయకుండా, వాటిని పునరుత్పత్తి చేసే అద్భుత ప్రక్రియను ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ఈ విప్లవాత్మక విధానం పరమాణు స్విచ్‌లను లక్ష్యంగా చేసుకోవడానికి అత్యాధునిక జన్యు నమూనాను ప్రభావితం చేస్తుంది. జన్యు స్థాయిలో కేన్సర్ దూకుడు స్వభావాన్ని సమర్థవంతంగా తిప్పికొడుతుంది. కేన్సర్ కణాలతోపాటు ఆరోగ్యకరమైన కణాలను కూడా విచక్షణారహితంగా నాశనం చేయడం వల్ల తీవ్రమైన దుష్ప్రభావాలను కలిగించే కిమోథెరపీ, రేడియేషన్ వంటి సాంప్రదాయ చికిత్సా విధానాల కంటే కొత్త పద్ధతి ద్వారా మెరుగైన చికిత్స అందించవచ్చని సైన్స్ మ్యాగజైన్‌లో కొరియా శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఈ వినూత్నమైన పద్ధతి వల్ల కేన్సర్ కణాల చుట్టుపక్కల ఉండే ఆరోగ్యకరమైన కణాజాలాలకు నష్టం చాలా తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. కేన్సర్ కణాలను నిర్మూలించడం కంటే, వాటిని రీప్రోగ్రామింగ్ చేయడం ద్వారా ఈ సాంకేతికత ఉత్తమ ఫలితాలనిస్తుందని వివరించారు. కాగా, దీని వల్ల అత్యంత ఖరీదైన, ఎక్కువ సైడ్‌ఎఫెక్ట్స్ ఉండే మందులపై ఆధారపడాల్సిన పరిస్థితి కొంత వరకు తగ్గుతుంది. కేన్సర్ చికిత్స కేవలం ధనవంతులకు మాత్రమే పరిమితం కాకుండా, సామాన్యులకు కూడా అందుబాటులోకి వస్తుంది. ఈ చికిత్సా విధానం పూర్తిస్థాయిలో అమలుకావడానికి లోతైన పరిశోధన, విస్తృతమైన అధ్యయనం అవసరం. ఏదిఏమైనా, కొరియా శాస్త్రవేత్తల ప్రకటన కేన్సర్ బాధితులకు కొత్త ఆశలు కల్పిస్తున్నది.

## అన్నం మంచిదే!

చాలా మంది అన్నం (వరి ధాన్యం) తినడం వల్ల అనారోగ్యం తప్పదని అనుకుంటారు. ముఖ్యంగా మధుమేహం (సుగర్) ఉన్నవారు వరికి బదులు గోధుమ, సజ్జలు, రాగులు, మక్కజొన్నలు, జొన్నలు వంటి ధాన్యాలను వాడడం తెలిసిందే.



అన్నంలో ఎక్కువగా ఉండే పిండి పదార్థాల వల్ల ఊబకాయం వస్తుందన్న అభిప్రాయం కూడా విస్తృత ప్రచారంలో ఉంది. అయితే, కొన్ని అధ్యయనాల ప్రకారం, అన్నం తినడం వల్ల అనర్థాలు ఊహించిన స్థాయిలో లేవు. నిజానికి బరువు పెరగడానికి పిండిపదార్థాలుకాదు.. శరీరంలో అదనంగా పేరుకుపోయే క్యాలరీలవల్ల. మెదడు, కండరాలు, కణాలు ఆరోగ్యంగా ఉండాలంటే పిండిపదార్థాలు అత్యవసరం. శరీరానికి శక్తినిచ్చేది కూడా పిండిపదార్థాలే. కాబట్టి అన్నాన్ని మరీ చులకన చేయడం భావ్యం కాదు. మన దేశంతోపాటు, చైనా, జపాన్, ఫిలిప్పీన్స్ తదితర దేశాల్లోనూ వరి ప్రధాన ఆహారం. అయితే, ఆ దేశాల్లో ఊబకాయులు ఇతర దేశాలతో పోలిస్తే తక్కువ. వరి బియ్యం వండి తినడం వల్ల, అందులోని గంజి ఒక పొరమాదిరి పని చేసి, పెద్దపేగు కేన్సర్‌ను అడ్డుకుంటుంది. పాలిష్ పట్టని బియ్యంలో అధికంగా ఉండే పీచుపదార్థం వల్ల మలబద్ధక సమస్య తగ్గుతుంది. ఏదైనా అతి చేస్తే సమస్యలు తప్పవు. అన్నం కూడా అతిగా తింటే ఆరోగ్యం స్థానంలో అనారోగ్యం వచ్చిచేరుతుంది. అందుకే, తిండి విషయంలోనూ హద్దులు తప్పవు.

## 'అరటి'తో లాభాలెన్నో..

అన్ని సీజన్లలోనూ లభించే అరటి పండును కేవలం ఒక పండు మాదిరికాకుండా, అనేక పోషక విలువలున్న ఆహారంగా పేర్కోవాలి. సాధారణంగా 125 నుంచి 200 గ్రాముల బరువు తూగే అరటి పండులో అనేక పోషక పదార్థాలు ఉన్నాయి. అర్ధపావు మేక మాంసంలో, సగం కోడిగుడ్డులో, 400 గ్రాముల ఆవుపాలలో ఎంత వక్తి ఉంటుందో, దాదాపు అంతటి శక్తి ఒక అరటి పండులో ఉంటుంది. పండుపైన ఉండే దళసరి తొక్క సూక్ష్మ క్రిములను, విషపదార్థాలను అడ్డుకుంటుంది. పెరిగే పిల్లలు, వృద్ధులకు అరటి పండు ఉత్తమ ఆహారం. సమర్థవంతమైన ఆహార ఔషధం. మోస్తరు సైజుగల అరటిపండు సుమారు 100 క్యాలరీల శక్తినిస్తుంది. అరటి పండులో కొవ్వు పదార్థం చాలా తక్కువ.



ఈ కారణంచేత దీనిని కామెర్లలోను, ఇతర కాలేయపు వ్యాధుల్లోను నిరభ్యంతరంగా వాడుకోవచ్చు. ఈ పండులో పొటాషియం మోతాదు చాలా ఎక్కువ. అందుకే, మూత్రపిండాల సమస్య ఉన్నవారు ఈ పండును తినడం మంచిది కాదు. అరటి పండు కఫాన్ని పెంచుతుందని ఆయుర్వేదం చెప్తుంది. అందుకే దగ్గు, జలుబు, ఆస్మా వంటి కఫ ప్రధాన వ్యాధుల్లో దీనిని వాడకపోవడమే ఉత్తమం. కాగా, అరటి పండు తిన్న తర్వాత ఏలక్కాయ (ఇలాచీ) లేదా రెండుమూడు లవంగాలు లేదా మిరియాలు తింటే కఫ దోషం తగ్గుతుందని అంటారు.

పచ్చి అరటిలో కార్బోహైడ్రేట్లు గంజి రూపములో ఉంటాయి. పండుతున్న కొద్దీ ఇవి చక్కర (సుగర్)గా మార్పుచెందుతాయి. పూర్తిగా మాగిన అరటిలో 12 శాతం చక్కర ఉంటుంది. వందగ్రాముల అరటి పండులో 70.1 గ్రాముల నీరు, 1.2 గ్రాముల ప్రోటీన్లు, 0.3 గ్రాముల కొవ్వుపదార్థాలు, 27.2 గ్రాముల పిండిపదార్థాలు, 17 మిల్లీ గ్రాముల కాల్షియం, 0.4 మిల్లీ గ్రాముల ఇనుము, 37 మిల్లీ గ్రాముల సోడియం, 88 మిల్లీ గ్రాముల పొటాషియం, 0.16 మిల్లీ గ్రాముల రాగి, 0.2 మిల్లీ గ్రాముల మాంగనీసు, 0.15 మిల్లీ గ్రాముల జింక్, 0.004 మిల్లీ గ్రాముల క్రోమియం, 78 మైక్రో గ్రాముల కెరోటిన్, 0.08 మిల్లీ గ్రాముల రైబోఫ్లెవిన్, 7 మిల్లీ గ్రాముల 'సి' విటమిన్, 0.05 మిల్లీ గ్రాముల థయామిన్, 0.5 మిల్లీ గ్రాముల నియాసిన్, 116 కిలో కాలరీల శక్తి ఉంటాయి. అరటి పండ్లలోని అధిక పొటాషియం బిపిని తగ్గిస్తుంది. శరీరంలోని విషపదార్థాల (టాక్సిన్స్)ను తొలగిస్తుంది. ఇందులోని ట్రిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ శరీరంలో ప్రవేశించగానే సెరటోనిన్‌గా రూపాంతరం చెంది, ఒత్తిడిని నియంత్రిస్తుంది. అరటిపండులోని పొటాషియం శరీర కండరాల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. డైటింగ్ చేస్తున్నవాళ్లు ఒకపూట భోజనం లేదా టిఫిన్ మానేసి అరటిపండు, వెన్న తీసిన పాలు తీసుకుంటే శరీరానికి కావలసిన పోషకాలన్నీ అందుతాయని అంటారు. జీర్ణసంబంధమైన సమస్యలకూ అరటిపండు మంచి ఔషధంలా పనిచేస్తుంది. జబ్బుపడినవాళ్లు దీన్ని తింటే తొందరగా కోలుకుంటారు. పచ్చి అరటి కాయలు విరేచనాలనూ, పండినవి మలబద్ధాన్నీ, అల్సర్ల నూ అరికడతాయి. అరటిపండ్లలో కణోత్పత్తిని ప్రోత్సహించే గుణం, జీర్ణాశయం గోడలకున్న సన్నటి పొర నాశనం కాకుండా కాపాడుతుంది. అరటిలోఉండే 'బాన్‌లెక్' అనే రసాయనం ఎయిడ్స్ వైరస్‌పై శక్తిమంతంగా పోరాడుతుందని శాస్త్రవేత్తలు తేల్చారు. అరటిలోని లెక్టిన్ రసాయనం వైరస్‌ను శరీరంలో ప్రవేశించనీయకుండా అడ్డుకుని ఇన్‌ఫెక్షన్‌ను నిరోధిస్తుంది. ఈ రసాయనం ప్రోటీన్‌పై పరచుకుని హెచ్ఐవీ జన్యుపదార్థం మూసుకుపోయేలా చేస్తుంది. అరమగ్గిన అరటిలో క్యాలరీలు తక్కువగా ఉండి శక్తి వినియోగాన్ని క్రమబద్ధీకరిస్తుంది. చిన్నపాటి కాలిన గాయాలను మాన్పించే గుణం అరటిగుజ్జుకు ఉంది.



ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## టోల్‌గేట్ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరికి నిరసన, ధర్నా



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** చిల్లేపల్లి టోల్‌గేట్ యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ నేడు(సోమవారం)టోల్‌గేట్ వద్ద జరిగే అఖిలపక్ష ధర్నాలో సిపిఐ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ టోల్‌గేట్ పాయింట్ మొదలుకొని 20కిలోమీటర్ల వరకు అన్ని రకాల ఫోర్‌వీలర్లు ఉచిత ప్ర యాణ సౌకర్యం గతంలో కల్పించినట్లుగా ఇప్పుడు కల్పించాలని డి మాండ్ చేశారు. ఈ విషయమై అధికారులకు వినతిపత్రం సమర్పించిన స్పందించడం లేదన్నారు. సిపిఐ నాయకులు, ప్రజా సంఘాల సభ్యులు ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సిపిఐ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివా స్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రావుల సత్యం, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను, సోమగాని వెంకటేశ్వర్లు, రేఖ ఉపేందర్, కొండ అంజయ్య పాల్గొన్నారు.

## లేబర్ కోడ్లతో కార్మికుల హక్కులకు విఘాతం



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** కేంద్రం నాలుగు లేబర్ కోడుల అమలుతో కార్మికుల హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని ఎఐటియూసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నర్సింహ అన్నారు. వనపర్తి ఎఐటియూసి జిల్లా ఆఫీసులో కె. శ్రీరాం అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్మికులు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం నాలుగు కోడలుగా విభజించి ఏప్రిల్ 1 నుంచి అమలుకు పూనుకుందన్నారు. పారిశ్రామికవేత్తలకు కార్మికుల శ్రమను దోచి పెట్టేందుకే కోడులను తెచ్చిందన్నారు. కోడ్లను అమలు చేస్తేకార్మికులు సమ్మె చేసే హక్కు కోల్పోతారన్నారు. ప్రస్తుతం కార్మికులు రోజుకి 8 గంటల పని చేస్తున్నారని, 12 గంటలు పని చేయవాల్సి వస్తుందన్నారు. వంద మంది సభ్యులు ఉంటేనే సంఘం ఏర్పాటు చేసుకోవాల్సి వస్తుందన్నారు. గ్రామాలలో ప్రతి రంగంలో మంది కార్మికులు లభించరన్నారు. లేబర్ కోడ్ల అమలుఆ దేశంలోని కార్మిక సంఘాలన్ని వ్యతిరేకిస్తుయన్నారు. బిజెపికి అనుబంధ కార్మిక సంఘమైన బిఎంఎస్ కూడా రెండు కోడ్ల అమలను వ్యతిరేకిస్తోందన్నారు. కార్మికులు ఎఐటియూసి కింద సంఘటితమైన పోరాడాలన్నారు. మార్చి 29,30 తేదీల్లో ఎఐటియుసి క్లాసులను వనపర్తిలో నిర్వహించాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం హమాలీ సంఘం జిల్లా మహాసభలను వనపర్తిలో జరపాలన్నారు. ఎఐటియుసి వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి కె. మోష , ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు టి. శ్రీహరి, ఉపాధ్యక్షుడు కె. శ్రీరాం, ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, సహయ కార్యదర్శులు శ్యాంసుందర్ , లక్ష్మమ్మ, గౌరవ అధ్యక్షులు భరత్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపికి తొత్తులు.. బిఆర్ఎస్ నాయకులు



సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** రాష్ట్రంలో బిఆర్ఎస్ నాయకులు బిజెపికి తొత్తులుగా మారారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు విమర్శించారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన పార్టీ జిల్లా సమితి సమావేశానికి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయకుండా మతోన్మాదులకు సహకరిస్తున్నదని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులకు పరోక్షంగా సహకరిస్తూ వారి గెలుపుకు మద్దతునిస్తున్నారని అన్నారు. మరోవైపు ప్రజా వ్యతిరేకను నిండా మూటగట్టుకున్న బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కాంగ్రెస్ పార్టీకి కమ్యూనిస్టులు సహకరిస్తున్నారని కమ్యూనిస్టులపై అక్కసు వెళ్లగక్కుతున్నారని అన్నారు. నిత్యం ప్ర జాసమస్యలపై పోరాడే కమ్యూనిస్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత కెసిఆర్‌కు లేదన్నారు. దేశంలో సిపిఐ ఆవిర్భావం జరిగి వందేళ్ల పూర్తి అవుతున్న సందర్భంగా గ్రామ గ్రామాన సిపిఐ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ క్రమంలో సభ్యత్వ సేకరణ సకాలంలో పూర్తి చేసి మార్చిలోగా గ్రామ గ్రామాన సిపిఐ శాఖా మహాసభలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా శాఖ, మండల మహాసభలు పూర్తి చేసుకుని మే నెలాఖరులోగా జిల్లా పార్టీ మహాసభలు నిర్వహించుకోవాలని అన్నారు. ఈ సమావేశానికి మంచాల రమాదేవి అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మ ణ్, ఉట్కూరి రాములు, మునిగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్, జక్కు రా జు గౌడ్, బత్తిని సదానందం, కొట్టెపాక రవి, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, రాసమల్ల దీనా, కండె నరసయ్య, కామెర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డిని గెలిపించండి

సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పిలుపు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని గెలిపించి శాసనమండలికి పంపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పట్టభద్రులకు పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో వివిధ ప్రజాసంఘాలలో పనిచేస్తున్న పట్టభద్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం నరేందర్‌రెడ్డి నిరంతరం కృషి చేయడంతో పాటు నిరుద్యోగుల నిర్మూలన కోం, అన్ని రంగాల ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల సాధన కోసం పూర్తి స్థా యిలో మాట్లాడే చొరవ ఉన్న నాయకుడని తెలిపారు. సమస్యలపై అవగాహన లేని ఎంతో మంది ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, బిజెపి ఇతర పార్టీ ల అభ్యర్థులు ఎన్నికలప్పుడు మాత్రమే కనబడుతారని, ఎన్నికల్లో గెలుపు కోసం ఎన్ని అడ్డదారులైనా తొక్కుతారన్నారు. అలాంటి వారిని ఓడించాలన్నారు. సిపిఐ మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించడమే లక్ష్యంగా సిపిఐ శ్రేణులతో పాటు ప్రజాసంఘాల వారంతా పట్టుదలతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మా ట్లాడుతూ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా స్థానికుడైన తనను గెలిపిస్తే ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తానని, సమస్యల పరిష్కారంలో ముందుంటానని తెలిపారు. సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల బాబు, కౌన్సిల్ సభ్యులు పంజాల శ్రీనివాస్, అందె చిన్న స్వామి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బోనగిరి మ హేందర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శి కనకం సాగర్, కేశబోయిన రాము, నాయకులు శ్యామ్, వినయ్, స్వప్న, మానస, రజిత, లక్ష్మి, సుజా త, మాధురి, సురేష్, కిరణ్, అజయ్, సాయి, వెంకటేష్ తదితరులున్నారు.

## మతతత్వ రాజకీయాలు దేశానికి ప్రమాదకరం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** మతకత్వ రాజకీయాలు దేశానికి అత్యంత ప్రమాదకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. ఆదివారం జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్‌తో కలసి శ్రీరాంపూర్ శాఖ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాంతంలో సిపిఐ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి పనిచేస్తుందని తెలిపారు. అమరజీవి పి నర్సయ్య స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తుందని పేర్కొన్నారు. 100 సంవత్సరాల శతజయంతి ఉత్సవాలు దేశవ్యాప్తంగా ఘనం గా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు. దేశంలో బిజెపి మతతత్వ రాజకీయాలను ప్రేరేపించడం ఈ దేశ రాజకీయ అస్తిత్వానికి చాలా ప్రమాదకరమని తెలిపారు. మేకల దాసు, లింగం రవి, పూజారి రామన్న, మిర్యాల రాజేశ్వరరావు, ముస్కే సమ్మయ్య, కొట్టే కిషన్ రావు, కొత్తపల్లి మహేష్, సంఘం సదానందం, సురేష్, చిలుక రామచందర్ లు పాల్గొన్నారు.

## రాజకీయ నిబద్ధత కలిగిన వ్యక్తి అంజయ్య

వర్ధంతి సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మంచికంటి అంజయ్య రాజకీయ నిబద్దత కలిగిన నాయకుడని పార్టీలో చురుకైన పాత్ర పోషించాడని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. మండలపరిదిలోని తనికెళ్ల సిపిఐ కార్యాలయంలో ఆదివారం మంచికంటి అంజయ్య 4వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశాడని రెండు సార్లు తనికెళ్ల సిపిఐ కార్యదర్శిగా పనిచేశాడని కొనియాడారు. గ్రామ ఉపసర్పంచ్‌గా కూడా పని చేసి పార్టీకి మంచి పేరుప్రతిష్టలు తీసుకొచ్చాడని పేర్కొన్నారు. అం జయ్య వ్యక్తిగత ప్రయోజనాలుకంటే పార్టీ ప్రయోజనానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారని అన్నారు. రాజకీయ విలువలు రోజురోజుకు తగ్గిపోతున్నాయని అధికార దాహానికి అలవాటు పడిన కొంతమంది నాయకులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీలో నిస్సిగ్గుగా చేరుతున్నారని అన్నారు. అలాంటి వారికి పార్టీ సిద్ధాంతంతో పనిలేదని వారిదల్లా ఒకటే సిద్దాంతం అధికారాన్నిఅడ్డుపెట్టుకొని వ్యక్తిగతంగా సంపాదించుకోవడమే వారి సి ద్దాంతం అని అన్నారు. రాజకీయాలు రోజురోజుకు దిగజారుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కమ్యూనిస్టుపార్టీలు బలపడుతున్నాయని ప్రజల్లో అపోహాలున్నాయని వామపక్ష పార్టీలు ఎందుకు బలహీనపడుతున్నాయి పార్టీలో చీలికలు రావడంవలనే బలహీన పడుతున్నాయని వామపక్షపార్టీలు అన్ని ఐక్యంగా కలిసి పనిచేస్తే ఎప్పటిలాగేనే బలపడతాయని అన్నారు. సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు యర్రా బాబు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, పివిరావు, కొణపర్తి విష్ణుమూర్తి, లేడిబోయిన గోపాల్‌రావు, గడల భాస్కర్‌రావు, పాపిట్ల ఏసు, గడల శ్రీను, పెదమళ్ల రత్తమయ్య, కవిడ వీరభద్రం, అంజయ్య సోదరుడు మంచికంటి వెంకటేశ్వర్లు , అంజయ్య కుమారులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవెన శంకర్

శ్రీరాంపూర్‌లో సిపిఐ నూతన కార్యాలయ ప్రారంభం



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** నస్పూర్ మండలం శ్రీరాంపూర్ శాఖలో సిపిఐ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవెన శంకర్ ముఖ్య అతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ లక్ష్యమని తెలిపారు. ప్రజల సమస్యలను అధికారులకు, ప్రభుత్వానికి తెలియజేస్తూ, వాటికి పరిష్కారం చూపించేలా కార్యాలయం ఉపయోగపడాలన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్, రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి, జిల్లా సమితి సభ్యులు ముస్కే సమ్మయ్య, మిర్యాల రాజేశ్వరరావు, కొట్టే కిషన్ రావు, సంఘం సదానందం, చిలుక రాంచందర్, దొడ్డిపట్ల రవీందర్, శ్రీరాంపూర్ శాఖ కార్యదర్శి పూజారి రామన్న, సహాయ కార్యదర్శి కొత్తపల్లి మహేష్ తదితర నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు

సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి రాజిరెడ్డి



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని సిపిఐ సీనియర్ నాయకులు, జిల్లా మాజీ కార్యదర్శి అకిరెడ్డి రాజిరెడ్డి విమర్శించారు. మార్చి 22న మెదక్ లోని టిఎన్జీవో భవన్‌లో నిర్వహించే దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్ పిఎస్) జిల్లా మూడో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం మెదక్ పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ దళితులకు బడ్జెట్ లో వాటాగా కేటాయించాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. దళితులు ఆర్థికంగా ఎదుగేందుకు ఇవ్వాల్సిన సబ్సిడీ రుణాలు ఇవ్వడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రయివేట్ రంగంలో దళితులకు రిజర్వేషన్లు కల్పించాలని అయన డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మార్చి 22న మెదక్ లోని టిఎన్జీవో భవన్‌లో డిహెచ్పిఎస్ జిల్లా మూడవ మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యేసు రత్నం,అనిల్ కుమార్‌లు హాజరువుతున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో దళిత హక్కుల పోరాట సంఘం జిల్లా నాయకులు సంగమేశ్వర్, సంతోష, లక్ష్మణ్,కిషన్, గౌతమ్,దశరథ్ పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/లక్ష్మ ణచందా :** లక్ష్మ ణచందా మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఆదివారం హనుమత్ పంచయత్ ధ్వజ, యంత్ర, శిఖర, నవగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి తన సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిన్నయ్య, రవి, అద్వాల రమేష్, ముత్యం రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నా

## ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోవాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలలో భాగంగా ఈ నెల 27న జిల్లాలో జరుగనున్న పోలింగ్‌లో అర్హత గల ఓటర్లు తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంల వరకు పోలింగ్ జరుగుతుందని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు పోలింగ్ రోజు సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని, ప్రైవేట్ సంస్థలలో పనిచేసే ఉద్యోగులు, అధికారులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా విధులలో వెసలుబాటు కల్పించడం జరగడం గానీ సెలవు దినం ఇవ్వడం జరుగుతుందని, ఆయా సంస్థల యాజమాన్యాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సహకరించాలని కోరారు.

## శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం ప్రముఖ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25,26,27 తేదీలలో మూడు రోజులు భక్తుల రద్దీని బట్టి బస్సులు నడుపుతామని ఆమె తెలిపారు. నిర్మల్ డిపో నుండి వేములవాడకు 30 బస్సులను నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇట్టి ప్రత్యేక బస్సులు అదనపు చార్జీతో నడపబడతాయని, మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు ఉచిత ప్రయాణ సౌకర్యం అనుమతించ బడుతుందని డిపో మేనేజర్ తెలిపారు. గ్రామానికి బస్సులు అవసరం ఉన్న వారు 9959226003, 9492767879 ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి తెలిపాలన్నారు.

## ప్రజలకు న్యాయం చేయని బిఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు : ఎంపి అరవింద్

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యను గెలిపించాలని ఎంపి అరవింద్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి అరవింద్ మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్లు పాలించిన బిఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలకు ఉపాధ్యాయులకు, పట్టభద్రులకు ఎలాంటి న్యాయం చేయలేదన్నారు.

# ఇక వరుస పరీక్షలు..



పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థులు

ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు పూర్తయ్యాయి. మార్చి 5 నుంచి థియరీ అధికారులు పరీక్షలు పకడ్బందీగా నిర్వహించే పనిలో ఉన్నారు. ఈ విద్యా సంవత్సరంలో సిలబస్‌లు కూడా అనుకున్న సమయంలో పూర్తిచేసి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు. ఈ మేరకు విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్నారు. అదేవిధంగా మార్చి 21 నుంచి 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమవుతాయి. ప్రీ ఫైనల్ పరీక్షలతో పాటు రోజువారీగా పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ విద్యార్థులు, పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సమాయత్తమవుతున్నారు. ఒత్తిడిలో ఉన్న విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని, విశ్వాసాన్ని నింపుతున్నారు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 లక్షలకు పైగా విద్యార్థులు వివిధ రకాల పరీక్షలకు సిద్ధమయ్యారు. మార్చి 5 నుండి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయి. జూన్ 15న నీట్, పీజీతో పరీక్షల సీజన్ ముగియనుంది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులంతా పరీక్షలపై దృష్టి సారించారు. భవిష్యత్తును నిర్ణయించే పరీక్షలు కావడంతో ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ముఖ్యమైన ప్రవేశ పరీక్ష ఇసెట్ సెట్. ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ పరీక్ష ప్రధానమైనది. ఐఐటి జాతీయ ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు సాధించాలంటే జెఇఇ పరీక్ష రాయాలి. తొలి విడత సెషన్ ఇప్పటికే పూర్తయింది. రెండో విడత ఏప్రిల్ ఒకటి నుంచి 8 వరకు జరుగుతుంది. ఐఐటీలో ప్రవేశానికి నిర్వహించే జెఇఇ అడ్వాన్స్‌డ్ మే 18న జరుగుతుంది. డిగ్రీ, పిజి డిప్లమా కోర్సులో ప్రవేశానికి పరీక్షలు వరుసగా ఉన్నాయి. ఐసెట్ జూన్ 8,9 తేదీల్లో జరగనున్నాయి. పిజి, ఇసెట్ జూన్ 16 నుంచి 19వరకు జరుగుతాయి. ఎడ్ సెట్ జూన్ 1న జరుగుతుంది. లా సెట్ ప్రవేశ పరీక్ష జూన్ 6న జరుగుతుంది. పిఇ సెట్ జూన్ 11 నుంచి 14 వరకు నీట్ యూజీ మే 4న నీట్ పిజి జూన్ 15న జరుగుతుంది. ఆయా కోర్సులలో ప్రవేశించాలకు రాత పరీక్షలే ముఖ్యం. ఈ క్రమంలోనే విద్యార్థులు అహర్నిశలు పుస్తకాలతో కుస్తీ పడుతూ శ్రమిస్తున్నారు. ప్రశ్నాపత్రాల తయారీ, కేంద్రాల పరిధిలో పోలీస్ స్టేషన్లకు ప్రశ్నపత్రాలు బండిల్స్ తరలింపు, పరీక్షల నిర్వహణ, ఆ తర్వాత మూల్యాంకం, అనుకున్న సమయంలో ఫలితాలు ప్రకటన, వెంటనే అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభం, తదితర పనులలో విద్యాశాఖ అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఈ క్రమంలోనే అధికారులు ఎవరి పరిధిలో వారు ముందుకు సాగుతున్నారు. పరీక్షల నిర్వహణలో ఏమాత్రం లోపాలు జరిగినా చట్టపరంగా చర్యలు తీసుకుంటారు. ఈ నేపథ్యంలో అధికారులు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించి మెరిట్ విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. మూల్యాంకనం విషయంలో కూడా అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలి. లేని పక్షంలో మెరిట్ విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఎంతో కాలం కష్టపడి అహర్నిశలు చదివిన విద్యార్థులు నష్టపోకుండా ఉండాలంటే పకడ్బందీగా పరీక్ష లు నిర్వహించక తప్పదు. ఈ క్రమంలోనే అధికారులు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షల నిర్వహణపై దృష్టి సారించారు. పరీక్షల నిర్వహణలో ప్రధానమైన భూమిక విద్యాశాఖ ది కాగా, పోలీస్, రెవెన్యూ, రవాణా, వైద్య శాఖల అధికారులు సహకరించాల్సి ఉంటుంది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు వారు హాజరై ఆయా పరీక్షల నిర్వహణపై ఆధారపడి ఉన్నందున అధికారులు అత్యంత జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

## నిధుల దుర్వినియోగాన్ని నివారించడమే సిసిఆర్ లక్ష్యం



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** ప్రభుత్వ పథకాలు, నిధులు దుర్వినియోగం కాకుండా చూడడమే సిసిఆర్ లక్ష్యమని సిసిఆర్ బృందం ప్రతినిధులు తెలిపారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం వెల్టూరు గ్రామ పంచాయితీలో జనరల్ నిధులో దుర్వినియోగం అవుతున్నాయని గ్రామ ప్రజలు కౌన్సిల్ పర్ సిటిజన్ రైట్స్(సిసిఆర్) దృష్టికి తీసుకువచ్చారు. సమాచార హక్కు చట్టం ప్రకారం జిల్లా కలెక్టర్‌కు గ్రామ పంచాయతీ రికార్డుల పరిశీలనకు సిసిఆర్ సంస్థ తరపున దరఖాస్తు చేశారు. గ్రామ పంచాయతీ రికార్డుల తనిఖీకి కలెక్టర్ అనుమతి ఇవ్వడంతో సిసిఆర్ సంస్థ తరపున దరఖాస్తు చేశారు. తనిఖీకి కలెక్టర్ అనుమతి ఇవ్వడంతో ఆదివారం సిసిఆర్ ప్రతినిధులు సోల్కంపల్లి ప్రభు, ఎండి ఆహ్మద్, సాయిలు, చరణ్ కాంత్, రత్నాకర్, చంద్రకాంత్, అశోక్ కుమార్, కాకర్ల సుందరాంగుడు, మణికంఠ, అశోక్, రాము, మైపాల్, సుబాష్‌లు పంచాయతీల రికార్డులను పరిశీలించారు తనిఖీలో నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించి ఆధారాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించి పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో మెజార్టీయే లక్ష్యం

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జయప్రకాశ్ రెడ్డి



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి భారీ మెజార్టీయే లక్ష్యంగా పనిచేయాలని సంగారెడ్డి నియోజకవర్గ ముఖ్య నేతలకు టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్‌రెడ్డి దిశనిర్దేశం చేశారు. సంగారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి భారీఅధిక్యం వచ్చేలా పనిచేయాలని కోరారు. సంగారెడ్డి శివారులోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేతలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ అన్నివర్గాలకు ప్రాధాన్యమిచ్చే పార్టీ కాంగ్రెస్ అని వివరించారు. సంగారెడ్డి పేరు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు వెళ్లేలా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో భారీ అధిక్యం సాధించి కాంగ్రెస్ సత్తా చాటాలన్నారు. ప్రతి నేత, కార్యకర్త తమ పరిధిలో ఉన్న పట్టభద్రుల వద్దకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబదించి సంగారెడ్డి నియోజకవర్గానికి పార్టీ కేటాయించిన ఇన్చార్జీలు శ్రీ హరి ముదిరాజ్, నరసింహారెడ్డిలతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలన్నారు. పట్టభద్రులతో సమావేశాలు నిర్వహిస్తు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రతి కార్యకర్త తన వంతుగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పనిచేయాలన్నారు. ఎన్నికల ప్రచారానికి సంబందించి ఏ సమస్య ఉన్నా డిసీసీ అధ్యక్షురాలు, టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో సిడిసి చైర్మన్ రాంచందర్, నాయక్, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్‌కుమార్, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు జార్జి సదాశివపేట, పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సంగమేశ్వర దేవాలయంలో పనుల పరిశీలన

సంగారెడ్డి పట్టణంలో గల సంగమేశ్వర దేవాలయంలో మరమ్మతుల పనులను టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి వరకు పనులు పూర్తి చేయాలని దేవాలయ సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో పాజీ అనంతకిషన్, కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేష్ ముదిరాజ్, సుధాకర్, శ్రీహరి పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గురుకుల 'సెట్' పరీక్ష





**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** స్థానికంగా ఉన్న సోఫీనగర్ లోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో గురుకుల ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలలోని పలు గదులను తనిఖీ చేశారు.పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి అందుబాటులో ఉన్న మందుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఎటువంటి ఆటంకాలు లేకుండా గురుకుల ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.విద్యార్థులకు కల్పించిన మంచి నీటి,తదితర వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డానియల్, అధికారులు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ ప్రతినిధి:** కొమురం భీం జిల్లాలో టిజి సెట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో టిజి సెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు 10 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 3,893 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా 98.33 శాతంతో 3,828 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకునేందుకు వీలుగా ఆర్‌టిసి ఆధ్వర్యంలో బస్సులు నడిపించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** మహార్ కుల సమస్యలు, ఎస్‌సి వర్గీకరణ అంశంపై తెలంగాణ మహార్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి దీపక్, నేతకాని మహార్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ నేతృత్వంలో మంత్రి శ్రీధర్‌బాబుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. కరీంనగర్‌లో మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన నేతకాని మహార్ కుల సంఘాల నాయకులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారు కలిసి మహార్ సామాజిక సమస్యలపై మంత్రికి వివరించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మహార్ కుల ధ్రువీకరణ పత్రాలు ఆర్‌డిఒ ద్వారా జారీ చేయబడుతున్నాయని, వీటిని తహసీల్దార్ ద్వారా నేరుగా జారీ చేయాలని మహార్ నాయకులు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. మహార్ విద్యార్థులు, ఉద్యోగార్థులు కుల ధ్రువీకరణ పత్రం పొందడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యలో ప్రవేశాలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని వీటిని నివారించేందుకు కృషిచేయాలని మంత్రిని కోరారు. నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు, వర్గీకరణ విధానం, సామాజిక న్యాయం వంటి అంశాలపై వివిధ ప్రాంతాల నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు. సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా మంత్రి తెలిపినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహార్ కుల సంఘాల ప్రముఖులు, నేతకాని మహార్ సాంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రజాప్రభుత్వానికి అండగా నిలవాలి

పట్టభద్రులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ పిలుపు



**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** 56 వేల ఉద్యోగాలు కల్పించి ప్రజాప్రభుత్వానికి అండగా నిలవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పట్టభద్రులను కోరారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ఆదివారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టభద్రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులకు, పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటూ ముందుకు సాగుతుందన్నారు. రానున్న రోజుల్లో నిరుద్యోగులకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**బాన్సువాడ :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్సీ అబ్యర్తి నరేందర్ రెడ్డికి మద్దతుగా ఎమ్మెల్సీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ పట్టబద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో ప్రభుత్వ ఉద్యోగుల కోసం నిరుద్యోగులు ఆరాటపడ్డప్పటికి గత ప్రభుత్వం ఉద్యోగాల ప్రకటన చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 56 వేల ఉద్యోగాలను కల్పించడం జరిగిందన్నారు. నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను పట్టభద్రులకు వివరించి కాంగ్రెస్ అభ్యర్తికి మద్దతుగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పి ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు దయానంద్, పట్టణ అధ్యక్షుడు రమేష్, సచిన్, సత్యనారాయణ, షౌకత్, రాజేందర్, సాగర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**గజ్వేల్ :** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డిని గెలిపిస్తే నిరుద్యోగులు, యువత ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు మార్గం సుగగమవుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున పెద్ద ఎత్తున నోటిఫికేషన్లు వేయడంతో పాటు ఇప్పటికే 56 వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని తెలిపారు. పట్టణంలోని మహిళా భవనం వద్ద సూర్య నమస్కారాల బృందాన్ని, ప్రజ్ఞాపూర్ చెరువు కట్ట పైన, ఐఓసి గ్రౌండ్ వద్ద వాకర్లను కలిసి మరియు హౌసింగ్ బోర్డులో క్రీడాకారులతో కలిసి నరేందర్‌రెడ్డిని ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రాములు గౌడ్, నాయకులు సుకెందర్ రెడ్డి, ఉడెం శ్రీనివాస్ రెడ్డి, సమీర్, జంగం రమేష్ గౌడ్, శివ రెడ్డి, గాడిపల్లి శ్రీను, అజ్గర్, నేత నాగరాజు, దయాల యాదగిరి, అరుణ్, ప్రమోద్, సత్యం, శ్రావణ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ పట్టణంలోని ఎస్‌పిఎం గ్రౌండ్‌లో నిర్వహించిన మార్నింగ్ వాక్ సందర్భంగా పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో భాగంగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంఎల్‌సి దండే విఠల్ విద్యావంతులతో కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ, వారి గెలుపులో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాసన మండలిలో పట్టభద్రుల హక్కులను కాపాడేందుకు పాటుపడతామని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.







# క్రీడ



9 వేల పరుగులు చేసిన బ్యాటర్‌గా రోహిత్ శర్మ..

## పాక్‌పై టీమిండియా
# ఘన విజయం



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమిండియా జోరు కొనసాగుతోంది. గ్రూప్‌ఏలో భాగంగా దాయాదీ పాకిస్థాన్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 49.4 ఓవర్లలో 241 పరుగులకు కుప్పకూలింది. సౌద్ షకీల్(76 బంతుల్లో 5 ఫోర్లతో 62) హాఫ్ సెంచరీతో రాణించగా.. మహమ్మద్ రిజ్వాన్(77 బంతుల్లో 3 ఫోర్లతో 46), కుష్దిల్ షా(39 బంతుల్లో 2 సిక్స్‌లతో 38) కీలక ఇన్నింగ్స్ ఆడారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్(3/40) మూడు వికెట్లు తీయగా.. అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా తలో వికెట్ తీసారు. హార్దిక్ పాండ్యా(2/31)కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం లక్ష్యచేధనకు దిగిన భారత్ 42.3 ఓవర్లలో 4 వికెట్లకు 244 పరుగులు చేసి గెలుపొందింది. విరాట్ కోహ్లీ(111 బంతుల్లో 7 ఫోర్లతో 100 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగగా.. శ్రేయస్ అయ్యర్(67 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 56) హాఫ్ సెంచరీలతో రాణించారు. శుభ్‌మన్ గిల్(52 బంతుల్లో 7 ఫోర్లతో 46) కీలక ఇన్నింగ్స్ ఆడారు. పాకిస్థాన్ బౌలర్లలో షాహిన్ షా అఫ్రిది(2/61) రెండు వికెట్లు తీయగా.. అబ్రర్ అహ్మద్, కుష్దిల్ షా తలో వికెట్ పడగొట్టారు.

**శుభ్‌మన్ గిల్ బాదుడు..**

క్రీజులోకి విరాట్ కోహ్లీ రాగా.. శుభ్‌మన్ గిల్ దూకుడుగా ఆడి ఒత్తిడిని తగ్గించాడు. మరోవైపు విరాట్ కోహ్లీ తనదైన సింగిల్స్, క్విక్ డబుల్స్‌తో స్ట్రైక్ రొటేట్ చేశాడు. హ్యారీస్ రౌఫ్ బౌలింగ్‌లో ట్రేడ్ మార్క్ బౌండరీలతో కోహ్లీ అంతర్జాతీయ వన్డేల్లో 14 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ఇక హాఫ్ సెంచరీకి చేరువైన శుభ్‌మన్ గిల్న్ అబ్రర్ అహ్మద్ స్టన్నింగ్ డెలివరీతో క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో రెండో వికెట్‌కు నమోదైన 69 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

**రోహిత్ దూకుడు..**

242 పరుగుల సాధారణ లక్ష్య ఛేదనకు దిగిన భారత్‌కు ఆశించిన శుభారంభం దక్కలేదు. కానీ కెప్టెన్ రోహిత్ శర్మ దూకుడుగా ఇన్నింగ్స్‌ను ఆరంభించడం భారత్‌కు కలిసొచ్చింది. బ్యాటింగ్‌కు కష్టంగా ఉన్న వికెట్‌పై హిట్ మ్యాన్ ఆరంభం నుంచే తనదైన శైలిలో చెలరేగాడు. క్రీజులో కాసేపే ఉన్నా.. ఓ భారీ సిక్సర్‌తో పాటు మూడు బౌండరీలు బాది భారత ఇన్నింగ్స్‌ను ఘనంగా ప్రారంభించాడు. పుల్ షాట్‌తో అతను కొట్టిన భారీ సిక్సర్ ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. దూకుడుగా ఆడుతున్న రోహిత్ శర్మ(15 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 20)ను షాహిన్ షా అఫ్రిది స్టన్నింగ్ యార్కర్‌తో క్లీన్ బౌల్డ్ చేశాడు..



## చరిత్ర సృష్టించిన కోహ్లీ

ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భారత్, పాక్ మధ్య దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో కీలక మ్యాచ్ జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి పాకిస్థాన్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లు అద్భుతంగా రాణించారు. ఈ క్రమంలో 49.4 ఓవర్లలో పాక్ 241 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ కీలక మ్యాచ్‌లో భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఓ రికార్డును అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో పాక్ ఆటగాడు నసీమ్ షా క్యాచ్ పట్టడంతో వన్డేల్లో భారత్ తరపున అత్యధిక క్యాచ్‌లు పట్టిన క్రికెటర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు వన్డేల్లో విరాట్ కోహ్లీ 157 క్యాచ్‌లు పట్టాడు. ఇంతకు ముందు మహ్మద్ అజారుద్దీన్(156) పేరు మీదున్న రికార్డును కోహ్లీ అధిగమించాడు. భారత క్రికెట్ చరిత్రలో విరాట్ కోహ్లీ గొప్ప ఫీల్డర్‌గా నిలిచిపోయాడు. అంతర్జాతీయ క్రికెట్ పరంగా చూస్తే.. వన్డేల్లో అత్యధిక క్యాచ్‌లు పట్టిన మూడో క్రికెటర్‌గా విరాట్ కోహ్లీ నిలిచాడు. తొలి స్థానంలో శ్రీలంకకు మహేల జయవర్ధనే(218) ఉండగా.. రెండో స్థానంలో రికీ పాంటింగ్(160) ఉన్నాడు. త్వరలోనే విరాట్ కోహ్లీ రికీ పాంటింగ్‌ను కూడా అధిగమించే అవకాశం ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక క్యాచ్‌లు పట్టిన టాప్ 5 ఆటగాళ్లలో విరాట్ కోహ్లీ నిలవడం విశేషం. విరాట్ కోహ్లీ భారత జాతీయ క్రికెట్ జట్టుకు అన్ని ఫార్మాట్లలో అత్యుత్తమ ఫీల్డర్లలో ఒకడు. జట్టు తరపున అరంగేట్రం చేసినప్పటి నుంచి ఫీల్డ్‌లో చాలా దూకుడుగా ఉన్నాడు.

**భారత్ తరపున వన్డేలలో అత్యధిక క్యాచ్‌లు పట్టిన ఆటగాళ్లు వీరే..**

- *విరాట్ కోహ్లీ157
- *మహ్మద్ అజారుద్దీన్156
- *సచిన్ టెండూల్కర్140
- *రాహుల్ ద్రవిడ్124
- *సురేష్ రైనా102

# రీల్



## అన్నయ్యతో తమ్ముడు పోటీకి వస్తాడా?

మన టాలీవుడ్ మెగా బ్రదర్స్ మెగాస్టార్ చిరంజీవి అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లలో ఒకరు ఫుల్ లెంగ్త్ సినిమాల్లో బిజీగా ఉంటే మరొకరు సినిమాలు అలాగే పాలిటిక్స్‌లో కూడా బిజీగా ఉన్నారు. అయితే ఈ ఇద్దరు స్టార్స్ నటించిన అవైటెడ్ సినిమాలు రిలీజ్ కి ఇపుడు సిద్ధంగా ఉన్నాయి. అవే పవన్ నటించిన హరిహర వీరమల్లు అలాగే చిరు నటించిన విశ్వంభర. అయితే ఈ రెండు సినిమాలు కూడా ఈపాటికే విడుదల కావాల్సినవి కానీ అలా ఆలస్యం అవుతూ వచ్చాయి. ఇక వీరమల్లు సినిమా ఆల్రెడీ మార్చ్ 28కి రిలీజ్ అని అంటున్నారు కానీ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అప్పటికి కష్టమే అని కూడా వినిపిస్తుంది. మరో పక్క అన్నయ్య చిరు విశ్వంభరని మేకర్స్ మే రిలీజ్ కి అనుకుంటున్నారనీ బజ్ ఉంది. అయితే ఇపుడు ఇదే మే నెలకి తమ్ముడు హరిహర వీరమల్లు కూడా షిఫ్ట్ అవుతుంది అని తెలుస్తుంది. మరి ఇందులో ఎంతవరకు నిజం ఉంది అనేది తెలియాలి అంటే వీటిపై ఒక సాలిడ్ క్లారిటీ రావాల్సిందే అని చెప్పాలి.

## అజిత్‌కు తప్పిన ప్రమాదం..



తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ స్పెయిన్‌లో జరుగుతున్న రేసింగ్‌లో పాల్గొన్నారు. ఐతే, ఆయనకు పెను ప్రమాదం తప్పింది. ఆయన కారు ప్రమాదానికి గురైంది. మరో కారును తప్పించే క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడం విచారకరం. పైగా అజిత్ కారు ట్రాక్‌పై పల్టీలు కొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే ఆయన సురక్షితంగా దాని నుంచి బయటకు రావడంతో ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోను అజిత్ రేసింగ్ టీమ్ ఇన్‌స్టా వేదికగా పోస్ట్ చేశారు. తాను క్షేమంగా ఉన్నారని అజిత్ తెలిపారు. ఇక ఈ ప్రమాదంలో హీరో అజిత్ తప్పు ఏమీ లేదని.. ఇతర కార్ల వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని అక్కడి అధికారులు తెలియజేశారు. అన్నట్టు ప్రమాదం జరిగిన కొంత సమయానికి ఆయన బయటకు వచ్చి.. అభిమానులతో ఫొటోలు దిగడం అక్కడి వారిని ఆకట్టుకుంది. ఈ ప్రమాదం వీడియో చూసిన అభిమానులు.. అప్రమత్తంగా ఉండమని తమ హీరోకు సలహాలు ఇస్తున్నారు. కాగా గడిచిన రెండు నెలల వ్యవధిలో అజిత్‌కు జరిగిన రెండో ప్రమాదం ఇది. జనవరి నెలలో దుబాయ్ గ్రాండ్ ప్రీ రేస్ కోసం సాధన చేస్తుండగా ఆయన కారు సమీపంలోని గోడను బలంగా ఢీ కొట్టిన సంగతి తెలిసిందే.

## ఛాన్స్ వస్తే ముద్దు సీన్స్ ఓకే
### రీతూవర్మ



మజాకా'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు నటి రీతూ వర్మ. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఆన్ స్క్రీన్ ముద్దు సన్నివేశాలకు తాను వ్యతిరేకం కాదన్నారు. అవకాశం వస్తే కిస్, హగ్ సన్నివేశాల్లో యాక్ట్ చేస్తానని అన్నారు. 'ముద్దు సన్నివేశాలకు సంబంధించిన చిత్రాల్లో నాకు అవకాశం రాలేదు. కథ డిమాండ్ చేస్తే అలాంటి సన్నివేశాల్లో యాక్ట్ చేయడానికి నేను ఏమాత్రం ఇబ్బందిపడను. ఈ అమ్మాయి ఇలాంటి పాత్రలు చేయదని కొంత మంది ఓ నిర్ణయానికి వచ్చేస్తారు. ఆ కారణంతోనే నా వద్దకు అలాంటి కథలు రావడం లేదు అనుకుంటా'' అని రీతూవర్మ చెప్పారు. తన గత చిత్రం 'స్వాగ్' ఫెయిల్యూర్‌పై మాట్లాడుతూ.. ''ఆ సినిమా అందరికీ సంబంధించినది కాదని మేము ముందు నుంచే అనుకున్నాం. ఆ కథలో ఉన్న తీవ్రత చాలామందికి అర్థం కాలేదు. అయినా, ఫర్వాలేదు. ఎందుకంటే, మనం నటించే అన్ని సినిమాలు ప్రేక్షకులు ఆదరించాలని లేదు కదా. ఒక నటిగా ఆ సినిమా చేసినందుకు నేను మాత్రం సంతృప్తిగానే ఉన్నా'' అని అన్నారు. 'పెళ్లి చూపులు 2' గురించి ఆమె మాట్లాడారు. ''పెళ్లి చూపులు' నాకు ప్రత్యేకమైన చిత్రం. స్నేహితులంతా కలిసి చిన్న బడ్జెట్‌లో సినిమా చేశాం. ఫలితం ఎలా ఉంటుందనేది మేము ఎప్పుడూ ఊహించలేదు. ఒక మంచి సినిమా చేస్తున్నామనే నమ్మకంతో దానిని పూర్తి చేశాం. రిలీజ్ అయ్యాక అది మా అందరి జీవితాలను మార్చేసింది. విజయ్ దేవరకొండ ఇంత పెద్ద స్టార్ అవుతాడనుకోలేదు. కానీ, అతను తప్పకుండా సక్సెస్ అవుతాడనుకునేదాన్ని. తరుణ్ భాస్కర్ ప్రస్తుతం 'ఈ నగరానికి ఏమైంది' సీక్వెల్ రాస్తున్నారు. 'పెళ్లి చూపులు 2' కూడా ఆయన తెరకెక్కిస్తే బాగుంటుందని నా భావన. అవకాశం వస్తే విజయ్, నేను కలిసి యాక్ట్ చేస్తాం''అని తెలిపారు.



## పుస్తకాలు జీవితంలో ఎంతో కీలకం
### వేదకుమార్

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రతీ విద్యార్థి అకడమిక్ సబ్జెక్టులతో పాటు ఇతర పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని, పుస్తకాలు జీవితంలో ఎంతో కీలకమని బాల చెలిమి ఎడిటర్ వేదకుమార్ అన్నారు. 'తెలంగాణ బాలోత్సవం' ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన పిల్లల లైబ్రరీని మణికొండ వేదకుమార్ ఆదివారం ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా డాక్టర్ నళిని, ఎస్. వినయ్ కుమార్, రవీంద్రనాథ్, బాలోత్సవం కోశాధికారి జి.బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షురాలు కె.సుజావతి, మెడికల్ పి.ఆర్.ఓ శ్రీలతరాణి, రచయిత రాము, ప్రొఫెసర్ విజయలక్ష్మి, బాలోత్సవ కమిటీ మెంబర్ అంకమ్మ, నవీన్, బ్రహ్మణి, జాహ్నవి, సుచరిత, భవాని, సాత్విక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదకుమార్‌మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ స్కూల్స్‌లో స్వాతంత్ర్య విద్యా విధానం ఉన్నప్పటికీ, ప్రభుత్వ పాఠశాలల్లో చిన్న పిల్లలకు సరైన వసతులు, పోషకాహారం, మంచి విద్య అందించాల్సిన బాధ్యత అందరిదని తెలిపారు.

## కులగణన రెండో విడతను
# సద్వినియోగం చేసుకోవాలి
### బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రభుత్వం తలపెట్టిన కులగణన రెండో విడతను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ పేర్కొన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఇందిరాపార్క్‌లో ఆదివారం బిసి కమిషన్ చేపట్టిన కులగణన అవగాహన కార్యక్రమంలో బిసి కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్‌తో కలిసి నిరంజన్ స్వయంగా పాల్గొన్నారు. ప్రజలతో మైమే కమైతు కరచాలనం చేస్తూ కుల గణన గురించి జరిగిన తీరును ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అడిగి తెలుసుకున్నారు. ఇందులో ఎక్కువ శాతం తాము అపార్ట్మెంట్స్‌లో ఉంటామని ముఖ్యంగా దోమలగూడ, గాంధీనగర్, బండ మైసమ్మ, కవాడిగూడ, అశోక్ నగర్, జగదీష్ నగర్ ఏరియాలో కుల గణన సరిగా చేయలేదని, తమ ఇంటికి ఎన్యుమరేటర్స్ వచ్చి స్టిక్కర్ అతికించారు కానీ వివరాలు నమోదు చేయలేదని తెలిపారు. ఈ సందర్భంగా పార్క్ లో మీడియాతో నిరంజన్ మాట్లాడుతూ .. రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం రెండవ దఫా కులగణన చేస్తున్నందున, నమోదు కాని ప్రజలు తమ వివరాలు మూడు పద్ధతుల ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ వాసులైతే వార్డ్ ఆఫీస్ లో, జిల్లాలో అయితే ఎంపిడిఒ కార్యాలయాల్లో ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకు నమోదు ప్రక్రియ ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రజలు చైతన్యవంతులై కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని నిరంజన్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం కోఆర్డినేటర్స్ గా గుర్రం శంకర్, డాక్టర్ సుధాకర్ యాదవ్, చంద్రకళ, బాబు( ఎక్స్ కార్పొరేటర్) వ్యవహరించారు. ఆశన్న బిసి వెల్ఫేర్ ఆఫీసర్, సుధాకర్ డిపిఓ, రిసోర్స్ పర్సన్స్ అనిత మరియు లోహ లక్ష్మి పాల్గొన్నారు. దోమలగూడ పోలీసు వారు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్ర పార్క్ అసోసియేషన్ సభ్యులు మరియు వ రూధిని (వాకర్) పాల్గొన్నారు.

## రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే
# కేంద్రం నిధులు ఇస్తుంది



### అప్పుడే రాష్ట్రం స్వర్ణ తెలంగాణ అవుతుంది : ఆర్.కృష్ణయ్య

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే రాష్ట్రం స్వర్ణ తెలంగాణ అవుతుందని బిసి సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య అన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానం ఆర్ఎస్ఎస్, బిజెపి ద్వారానే ప్రారంభమైందని, ఆ తర్వాత బిసి ఉద్యమాలకు వైపు మళ్లాలని తెలిపారు. బిసిలను బిజెపి ఎప్పుడు వెన్నుతట్టి ప్రోత్సహిస్తుందని, అందుకు తానే నిదర్శమని చెప్పారు. ప్రధానమంత్రి బిసినేనని ముఖ్యమంత్రి వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ప్రపంచంలోనే దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్న ఏకైక పార్టీ బిజెపి మాత్రమేన్నారు. అందుకే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం వస్తే, కేంద్రం నుంచి భారీగా నిధులు వస్తాయని అప్పుడు రాష్ట్రం స్వర్ణ తెలంగాణగా మారుతుందన్నారు. ఢిల్లీ ప్రజలు ఇచ్చిన తీర్పును దేశ వ్యాప్తంగా ఇవ్వాలని ఆయన కోరారు. ఓటర్లు, రాజకీయ పార్టీలు కల్పించే చిన్నచిన్న ప్రలోభాలకు లొంగవద్దని కోరారు.

## ఆర్‌టిసిలో ఉద్యోగాల
# భర్తీ ఎప్పుడు
### ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసిలో మూడు వేల ఖాళీ పోస్టులు భర్తీ చేస్తున్నామని ఆర్భాటంగా ప్రకటించి ఎనిమిది నెలలు గడిచినా ఇంత వరకు దాని ఊసేలేదని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు విమర్శించారు. రెండు వేల మంది డ్రైవర్ పోస్టలతో పాటు సుమారు మూడు వేల మందిని భర్తీ చేసేందుకు సిఎం, రవాణా శాఖ మంత్రి, ఆర్‌టిసి ఎండి అనుమతి ఇచ్చినట్లు ప్రకటించినా ఇంత వరకు నియమించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఆర్‌టిసిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

# బురద తోడి బయట పారేస్తున్నాం
### వలసలపై నిర్ణయాన్ని సమర్థించుకున్న ట్రంప్



వాషింగ్టన్ : అమెరికాలో చేరిన బురదనంతా తమ ప్రభుత్వ యంత్రాంగం తోడి బయట పారేస్తోందని ఆదేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికాలో ప్రజల ప్రభుత్వాన్ని పునరుద్ధరిస్తున్నామన్నారు. ఎలాంటి అధికారిక పత్రాలు లేకుండా అమెరికాకు అక్రమంగా వలసవచ్చిన వారిని స్వదేశాలకు తిప్పి పంపుతున్న ప్రభుత్వ నిర్ణయాన్ని ట్రంప్ మరోసారి సమర్థించుకున్నారు. అనధికారికంగా దేశంలో నివసిస్తున్న వారిని తిప్పిపంపడాన్ని ''బురద తోడి అవతలపారేయడం'గా ఆయన అభివర్ణించారు. ఇంటి దొంగలను, మోసగాళ్ళను, ప్రపంచాన్ని ఏకైక రాజకీయవేదికగా మార్చాలని కోరుకునేవారినీ, దేశంలో అనధికారికంగా ఉంటూ అంతర్గతంగా రాజకీయ కుట్రలు చేసేవారిని అమెరికాలో చేరిన మురికి బురదగా పేర్కొంటూ దానిని తోడిపారేస్తున్నామన్నారు. అక్రమ వలసప్రజలను దేశం నుండి వెళ్ళగొట్టడం తమ ప్రభుత్వ కీలక విధానమని అన్నారు. ఆదివారంనాడు సిపిఎసి (సంప్రదాయ రాజకీయ కార్యాచరణ సదస్సు) సదస్సును ఉద్దేశించి ట్రంప్ మాట్లాడుతూ, ''మోసగాళ్ళు, పచ్చిఅబద్ధాలకోరులూ, వంచకులు, ప్రపంచాన్ని ఏకైక రాజకీయవేదికగా మార్చాలని కోరుకునే, రహస్య కుట్రలకు పాల్పడేవారందరినీ మూటకట్టి పంపేస్తున్నామన్నారు. ''అక్రమ చొరబాటుదారులైన విదేశీ నేరస్థులను తిరిగి వారి వారి ఇళ్ళకు పంపేస్తున్నాం'' అన్నారు. అమెరికా బుద్ధిజీవులకు చెందిన 'పిఇడబ్ల్యు' రీసెర్చ్ సెంటర్ నివేదిక ప్రకారం, 2022 నాటికి అమెరికాలో ఉన్న మొత్తం జనాభాలో 3.3 శాతం మంది అనధికారికంగా వచ్చిన వలసప్రజలే. అమెరికాగడ్డపై విదేశీయులకు పుట్టిన బిడ్డలే 23 శాతం మంది ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండోసారి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత యావత్ అక్రమ వలసల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళనకు పెట్టారు. దేశంలో నివసిస్తున్న అక్రమ వలస ప్రజలను సామూహికంగా బయటకు సగౌరవంగా పంపేస్తున్నారు, అరెస్టులు చేస్తున్నారు అని పేర్కొంది. అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ ఎక్స్ వేదికగా చేసిన పోస్టింగ్ ప్రకారం, ఫిబ్రవరి 3వ తేదీ నాటికి అమెరికా డిహెచ్ఎస్ ఏజంట్లు 8,768 మంది అక్రమ వలస ప్రజలను అరెస్టు చేశారు. మూడు విడతలుగా భారత్‌కు 332 మందిని తరలించారు. అదే విధంగా అమెరికా నుండి పనామాదేశానికి కూడా భారతీయులను తరలించారు. వారంతా పనామాలోని ఒక హోటల్‌లో ప్రస్తుతం బసచేసి ఉన్నారు. వారి బాగోగుల గురించి భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నది. అమెరికా నుండి ఏరిపారేసిన అక్రమ వలస ప్రజలను తిరిగి స్వదేశాలకు పంపడానికి పనామాదేశం ప్రస్తుతం ఒక తరలింపు కేంద్రంగా మారింది. మొదట అక్రమ వలస ప్రజలు పనామాకు చేరుకుంటారు. అక్కడి నుండి ఆ దేశం వారందరినీ వారి వారి దేశాలకు విభజించి పంపుతుంది.

## అవినీతి నిరోధక చట్టం కింద ప్రతీకేసులో
# ప్రాథమిక విచారణ వద్దు
### సుప్రీంకోర్టు స్పష్టీకరణ



న్యూఢిల్లీ : అవినీతి నిరోధక చట్టం కింద ప్రతి కేసులోనూ ప్రాథమిక విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కొన్ని కేసులకు మాత్రమే ఇది వర్తిస్తుందని తెలిపింది. అవినీతి నిరోధక చట్టంకింద దాఖలైన ప్రతి కేసులోనూ ప్రాథమిక విచారణ చేపట్టడం శాసనబద్ధమైన విధాయక చర్య కాదని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ప్రకటించింది. ప్రాథమిక విచారణ చేయాలని అవినీతి ఆరోపణ చేసిన వ్యక్తి కోరడం తప్పుకాదనీ, ఐతే అది వారి హక్కు కాదని పేర్కొంది. ఆదాయనికి మించిన ఆస్తులు కూడబెట్టిన అధికారిపై లోకాయుక్త పోలీస్ స్టేషన్ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ కర్ణాటక హైకోర్టు గత ఏడాది మార్చిలో తీర్పు ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి ముందుగా ప్రాథమిక విచారణ అత్యావశ్యకం కాదని, అందిన సమాచారం నిజమా? అబద్ధమా? అని తనిఖీ చేయడం కోసం కాదనీ, ఐతే చెప్పిన సమాచారం ఉద్దేశపూర్వక నేరమా? లేక నిజమైన సమాచారమా? అని ధృవీకరించుకోవాల్సిన అవసరం ఉంటుందని పేర్కొంది. ''ఎవరైనా ఒక ఉన్నతస్థాయి అధికారిపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి వారి నుండి స్వాధీనం చేసుకున్న ఏదైనా ఒక మూలాధారం హేతుబద్ధమైనదైతే, సహేతుకమైన వ్యక్తి ఎవరైనా దానిని నిర్ధారిస్తే సంబంధిత విచారణా కమిషన్ ఇక ప్రాథమిక విచారణను చేపట్టవలసిన అవసరం ఉండదు'' అని ఈనెల 17వ తేదీన ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్థిక శక్తిసామర్థ్యాలకు మించినస్థాయిలో ఆ అధికారి ఆస్తులు కూడబెట్టాడన్న ఆరోపణలపై ఈ ఎఫ్ఐఆర్ దాఖలైంది. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసి హైకోర్టు తీవ్ర తప్పిందం చేసిందని సుప్రీంకోర్టు పేర్కొంది. హైకోర్టు అవినీతి నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని ఆదేశాలు ఇవ్వడానికి ముందుగా ప్రాథమిక విచారణ జరపడం శాసనబద్ధ విధాయకర చర్యా? కాదా? సదరు వ్యక్తి అవినీతికి పాల్పడ్డారన్న సమాచారం ఎక్కడి నుండి వచ్చింది? ఆ వచ్చిన సమాచారం ప్రాథమిక విచారణ జరపడానికి సరిపోతుందా? దానిని పరిగణనలోకి తీసుకోవచ్చునా? అనే విషయంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ధర్మాసనం సుప్రీంకోర్టు ఇంతకుముందు ఇచ్చిన తీర్పులను కూడా ప్రస్తావించింది. ప్రస్తుతం కోర్టు ముందుకు వచ్చిన ఈ కేసుకు ఈ సూత్రాలను వర్తింపజేస్తూ, అవినీతి ఆరోపణ ఎదుర్కొంటున్న ప్రభుత్వ ఉద్యోగికి వ్యతిరేకంగా ఒక కేసు నమోదు చేయడానికి ప్రాథమిక విచారణ నిర్వహించడం అనివార్యమైన చర్య కాదని చాలా ప్రస్ఫుటంగా తేటతెల్లమవుతున్నదని ధర్మాసనం పేర్కొంది. ''ప్రాథమిక విచారణ అనేది కొన్ని రకాల ఆరోపణల కేసులకు సంబంధించినది, ఇది అవినీతి ఆరోపణలకు కూడా వర్తిస్తుంది, ఐతే అవినీతి జరిగిందనే సందేహంతో ప్రాథమిక విచారణ జరపాలని కోరడం తప్పుకాదు, కానీ ఆరోపణ చేసిన వ్యక్తికి అది ఒక స్వాధీనహక్కు మాత్రం కాదు, అతడు అడిగాడని అనివార్యంగా విచారణ చేయాల్సిన అవసరం లేదు, ఎందుకంటే ఇదొక క్రిమినల్ కేసు'' అని జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం స్పష్టం చేసింది. ఐతే ప్రాథమిక విచారణ జరపాలా?వద్దా? అని ఆయా కేసులకు సంబంధించిన వాస్తవాలను, పరిస్థితులను బట్టి నిర్ధారించుకోవాల్సి ఉంటుందని పేర్కొంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com